సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 234

మంగళవారం 15-11-2022




'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'



శరత్ కమల్‌కు 'ఖేల్‌రత్న'


జరీన్, శ్రీజలకు అర్జున అవార్డులు.. 30న జాతీయ క్రీడాపురస్కారాలు - 12లో



దిగుమతులు పెరిగాయ్

వంట నూనెల దిగుమతుల విలువ రూ.1.57 లక్షల కోట్లకు చేరింది -13లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మతమార్పిళ్లతో పెను సవాల్

మోసగించి, ప్రలోభపెట్టి, భయపెట్టి మతమార్పిడి చేయడాన్ని అత్యంత తీవ్రమైన అంశంగా సుప్రీంకోర్టు అభివర్ణించింది.

వివరాలు 6లో



మైన్‌పురి బరిలో డింపుల్

యూపీలోని మైన్‌పురి లోక్‌సభ స్థానానికి త్వరలో జరగనున్న ఉప ఎన్నిక బరిలో డింపుల్ యాదవ్ పోటీపడుతున్నారు.

వివరాలు 6లో



సంఘర్షణకు దారితీసే పోటీ వద్దు

సంఘర్షణలకు దారితీసే పోటీని నివారించాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్, చైనా అధినేత జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు.

వివరాలు 6లో



బాలికి ప్రధాని మోదీ

జీ-20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఇండోనేసియాలోని బాలికి చేరుకున్నారు.

వివరాలు 6లో

ఏది నిజం?

రామోజీ అర్ధసత్యాల 'బీమా' కలాపం

- బాబు హయాంలో ఐదేళ్లలో 30 లక్షల రైతులకే పరిహారం
- ఐదేళ్లలో పరిహారంగా చెల్లించిన మొత్తం రూ.3,411 కోట్లు
- ఈ ప్రభుత్వంలో మూడున్నరేళ్లకే 44.66 లక్షల రైతులకు బీమా
- వీరికి చెల్లించిన మొత్తం రెట్టింపు.. అంటే రూ.6,684.84 కోట్లు
- గతంలోనే కేంద్ర పథకం నుంచి బయటికొచ్చి సొంతగా రాష్ట్ర బీమా
- ప్రీమియం మొత్తం తనే చెల్లించేలా రాష్ట్ర పరిధిలోనే బీమా కంపెనీ
- దీనికోసం దరఖాస్తు... కేంద్రానికి సైతం అనుమతి కోసం అభ్యర్థన
- లోటుపాట్లు సరిదిద్దుతామని మళ్లీ చేరాలని కేంద్రం అభ్యర్థన
- షరతులకు ఓకే అనటంతో మళ్లీ కేంద్ర పథకంలో చేరనున్న రాష్ట్రం
- రబీలో పంట నష్టం అరుదు... ప్రభుత్వ బాధ్యతగా పరిహారం
- అవన్నీ వదిలేసి బీమా ప్రీమియం చెల్లించలేదంటూ రామోజీ తప్పుడు వార్త
- బురద జల్లటమే లక్ష్యంగా 'ఈనాడు' కథనం

4లో

'పరివర్తన' ఫలించేలా

అక్రమ మద్యం, గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

ఏజెన్సీలో అరికడుతూనే ఉపాధి మార్గాలు చూపాలి: సీఎం జగన్

- ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారికీ ఆర్వోఎఫ్ఆర్ పట్టాలివ్వాలి.. పట్టాలుంటే రైతు భరోసా లభిస్తుంది
- విత్తనాలు, ఎరువులు కూడా అందచేయాలి.. అప్పుడే మనం ఆశించిన మార్పు సాధ్యం
- ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- చేయూత, ఆసరా లాంటి పథకాల ద్వారా ఊతమివ్వాలి
- గతంతో పోల్చితే మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గుదల
- పన్ను చెల్లింపుదారులకు ప్రక్రియ మరింత సులభతరం చేయాలి
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అప్‌గ్రేడేషన్.. నిర్వహణలో లేని గనుల్లో కార్యకలాపాలు మొదలయ్యేలా చర్యలు చేపట్టాలి
- ఎక్సైజ్, పన్నులు, రిజిస్ట్రేషన్, రవాణా, మైనింగ్‌పై సీఎం సమీక్ష



మద్యం అమ్మకాలు తగ్గాయి

గతంతో పోల్చి చూస్తే మద్యం అమ్మకాలు గణనీయంగా తగ్గాయని సీఎం జగన్ వెల్లడించారు. బెల్టు షాపులను తొలగించడం, పర్మిట్ రూమ్‌ల రద్దు లాంటి పలు చర్యల వల్ల మద్యం విక్రయాలు తగ్గాయని చెప్పారు. దీంతో పాటు మద్యపానాన్ని నిరుత్సాహ పరిచేందుకు షాక్ కొట్టేలా రేట్లు పెంచడం వల్ల కూడా మద్యం వినియోగం తగ్గిందన్నారు. అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. పరివర్తన కార్యక్రమం అమలు తీరుపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆరా తీశారు.

సాక్షి, అమరావతి: గంజాయి సాగు, అక్రమ మద్యం తయారీ, విక్రయాలను అరికట్టి కేసుల నమోదుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎస్ఈబీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో గంజాయి సాగు నిర్మూలన చర్యలు చేపడుతూనే ఉపాధి మార్గాలు చూపాలని అధికార యంత్రాంగానికి సూచించారు. పన్ను చెల్లింపుదారులకు ప్రక్రియను మరింత సులభతరం చేయాలన్నారు. ఎక్సైజ్, అటవీ, గనులు, వాణిజ్య పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖల కార్యకలాపాలపై ముఖ్యమంత్రి జగన్ సోమవారం క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆ వివరాలివీ..

అటు ఉక్కుపాదం.. ఇటు ఉపాధితో ఊతం

పరివర్తన కార్యక్రమం ద్వారా ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారు. చేయూత, ఆసరా లాంటి పథకాల ద్వారా వారికి ఊతమివ్వాలని, ఆదాయం సమకూరే దిశగా ఉపాధి చూపాలని నిర్దేశించారు. అప్పుడే అక్రమ మద్యం తయారీ లాంటి వాటికి

మిగతా 3వ పేజీలో ▶

సూపర్‌స్టార్ కృష్ణకు గుండెపోటు

వెంటిలేటర్‌పై చికిత్స



సూపర్‌స్టార్ కృష్ణకు ఆదివారం అర్ధరాత్రి తీవ్రమైన గుండెపోటు వచ్చింది. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో నివాసం ఉంటున్న ఆయనకు హఠాత్తుగా గుండెపోటు రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు ఆయన్ను కాంటినెంటల్ ఆస్పత్రిలో చేర్పించగా, వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. కుమారుడు మహేశ్‌బాబు తదితరులు ఆస్పత్రికి చేరుకుని కృష్ణ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

12లో

గొంతు నులిమి.. ముక్కలుగా నరికి..



హత్యకు గురైన యువతి శ్రద్ధ (ఫైల్)

సహజీవనం చేసిన అమ్మాయిని దారుణంగా అంతం చేసిన దుర్మార్గుడు

వింటేనే ఒళ్లు జలదరించేంతటి దారుణం. సహజీవనం చేసిన అమ్మాయిని, పెళ్లి చేసుకొమ్మన్న పాపానికి గొంతు నులిమి చంపేశాడు. మృతదేహాన్ని ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో దాచాడు. రోజుకు కొన్ని చొప్పున పడేస్తూ వచ్చాడు. ఇలా ఆర్నెల్లపాటు మేనేజ్ చేశాడు! అమ్మాయి తండ్రి పోలీసులను ఆశ్రయించడంతో ఎట్టకేలకు పట్టుబడ్డాడు. వెన్నులో చలి పుట్టించే ఈ ఘటన ఢిల్లీలో జరిగింది.

6లో

అంతరిక్ష రంగంలో తెలుగు తేజం



- ప్రైవేట్ రాకెట్ రూపకర్తల్లో విశాఖ యువకుడు నాగభరత్
- దేశ చరిత్రలో తొలిసారిగా రాకెట్ ప్రయోగించనున్న స్కైరూట్ సంస్థ
- ఈ నెలలోనే నింగిలోకి దూసుకెళ్లనున్న 'విక్రమ్-ఎస్'

14లో



మహాదీపారాధనతో ప్రకాశించిన సాగరతీరం

- విశాఖలో ఘనంగా టీటీడీ కార్తీక మహాదీపోత్సవం
- కిటకిటలాడిన ఆర్కే బీచ్

5లో

విదేశీ విద్య.. కేరాఫ్ అమెరికా



విదేశాల్లో విద్యాభ్యాసానికి వెళ్లే భారతీయ విద్యార్థుల టాప్ చాయిస్‌గా ఇప్పటికీ అమెరికానే ఉంది. 2021–22 విద్యా సంవత్సరంలో మొత్తం 9.48 లక్షల మంది విదేశీ విద్యార్థులు అమెరికాలో ప్రవేశాలు పొందగా, వారిలో 21 శాతం మంది.. అంటే 1,99,182 మంది భారతీయులే కావడం గమనార్హం. 2021–22లో అమెరికాకు వెళ్లిన భారతీయ విద్యార్థుల సంఖ్య 18 శాతం పెరిగిందని ఓపెన్ డోర్స్ సంస్థ తన 2022 నివేదికలో వెల్లడించింది. ఈ నివేదికను ఢిల్లీలోని యునైటెడ్ స్టేట్స్ ఎంబసీ సోమవారం విడుదల చేసింది.

- వివరాలు 6లో

1,458 'సీనియర్ రెసిడెంట్'ల నియామకానికి నోటిఫికేషన్

19 వరకు దరఖాస్తులకు గడువు

- ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో పీజీ పూర్తి చేసిన 45 ఏళ్లలోపు వారు అర్హులు
- పీజీ తుది పరీక్షల్లో వచ్చిన మార్కులే ప్రామాణికంగా ఎంపిక
- రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తింపు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ మెడికల్, డెంటల్ బోధనాస్పత్రుల్లో 1,458 సీనియర్ రెసిడెంట్ (ఎస్ఆర్) డాక్టర్ల నియామకానికి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 19వ తేదీ రాత్రి 12 గంటల వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 45 ఏళ్ల లోపు వయసుండి, ప్రభుత్వ మెడికల్, డెంటల్ కళాశాలల్లో పీజీ పూర్తి చేసిన వైద్యులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. http://dme.ap.nic.in వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ అభ్యర్థులు రూ.500, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.250 చొప్పున దరఖాస్తు రుసుం చెల్లించాలి. ఎంపికైన అభ్యర్థులు ఏడాది పాటు ఎస్ఆర్‌లుగా సేవలు అందించాల్సి ఉంటుంది. సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్‌కు రూ.85 వేలు, స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్‌కు రూ.70 వేలు, సీనియర్ రెసిడెంట్ (పీజీ)కు రూ.65 వేలు చొప్పున గౌరవ వేతనాన్ని ప్రభుత్వం ఇస్తుంది. పీజీ తుది పరీక్షల్లో వచ్చిన (థియరీ, ప్రాక్టికల్స్)మార్కుల్లో మెరిట్ ప్రామాణికంగా, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఎంపికలు చేపడతారు. అత్యధికంగా ఎమర్జెన్సీ మెడిసిన్‌లో 144, జనరల్ మెడిసిన్‌లో 101, జనరల్ సర్జరీ విభాగంలో 101 ఖాళీలున్నాయి. పాథాలజీలో 88, అనాటమీలో 85, ఫార్మకాలజీలో 80, గైనకాలజీలో 69, అనస్థీషియాలో 56, పీడియాట్రిక్స్‌లో 56, ఆప్తమాలజీలో 56 ఖాళీలున్నాయి. ఇలా మొత్తంగా 49 విభాగాల్లో 1,458 ఎస్ఆర్ పోస్టులు భర్తీ కానున్నాయి. ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా

మిగతా 14వ పేజీలో ▶

నీ పార్ట్‌నర్ కోసం నిరాధార ఆరోపణలు చేస్తావా?



- జగనన్న కాలనీల్లో అవినీతిని రుజువు చేస్తే తలదించుకుంటా: మంత్రి బొత్స
- రూ.15 వేల కోట్లు ఖర్చు చేస్తే అంతే అవినీతి జరిగిందనడం పవన్ అజ్ఞానానికి నిదర్శనం
- 31 లక్షల అక్కచెల్లెమ్మల కలను సీఎం సాకారం చేస్తున్నారు
- ఏ క్షణంలోనైనా విశాఖ నుంచి పరిపాలనకు సిద్ధం

2లో

18 తర్వాత రాష్ట్రంలో వర్షాలు



ఇటీవల నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అరేబియా సముద్రంలో విలీనమైంది. బుధవారం ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుండటంతో ఈనెల 18 నుంచి మళ్లీ వర్షాలు పడనున్నాయి.

14లో

రామోజీ.. ఇవేమి నీచపు రాతలు?



- చంద్రబాబు ప్రభుత్వం రైతులకు ఎగ్గొట్టిన రూ.716 కోట్ల గురించి తెలుసుకో
- ఆ నగదు రైతులకు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే
- బాబు ప్రభుత్వం ఐదేళ్లలో బీమా కింద రైతులకు ఇచ్చింది రూ.3,411 కోట్లు
- మూడేళ్లలో ఈ ప్రభుత్వం రైతులకు రూ.6,684 కోట్లిచ్చింది
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

14లో

ఇదండీ సంగతి



మీకు ఇన్ని అధికారాలున్నాయని నాకిప్పుడే తెలిసింది సార్!

ఈ ఆనందం వెలకట్టలేనిది!

సొంతింటికి వచ్చిన వేళ టిడ్కో లబ్ధిదారులు, వారి పిల్లల్లో సంతోషాల వెల్లువ

- మంగళగిరిలో ఒకే చోట 1,728 టిడ్కో ఇళ్లు
- 60 అడుగుల రోడ్లు.. డ్రైనేజీ వ్యవస్థ
- మురుగుశుద్ధికి ఆధునిక ఎస్టీపీ
- నిర్మాణంలో పిల్లల ఆట స్థలం, పార్కు.. త్వరలో షాపింగ్ కాంప్లెక్స్ కూడా..
- రాష్ట్రంలోని 163 ప్రాజెక్టులూ ఇదే రీతిన నిర్మాణం



మంగళగిరిలో టిడ్కో ఇళ్లు

(నానాజీ అంకంరెడ్డి), సాక్షి, అమరావతి

మంగళగిరి వైఎస్సార్ జగనన్న నగర్ (టిడ్కో)లో వందల కుటుంబాల వారు తమ సొంతింటి ఆనందాన్ని పంచుకున్నారు. ఇక్కడ నిర్మించిన 1,728 టిడ్కో ఇళ్లల్లో దాదాపు 400 మంది ఉంటున్నారు. డిసెంబర్‌లో మంచి ముహూర్తాలు ఉండడంతో మిగిలిన వాళ్లు గృహ ప్రవేశాలకు ఏర్పాట్లుచేసుకుంటున్నారు. ఇళ్లు పొందిన వారి పిల్లలు చిల్డ్రన్స్ డే సందర్భంగా సోమవారం టిడ్కో ప్రాంగణంలోని తమ ఫ్లాట్లలో కలియదిరుగుతూ గదుల్లోని గోడలను తడిమి చూసుకుని ఆనందంగా గడిపారు. విశాలమైన 60, 40 అడుగుల రోడ్లు..

మిగతా 2వ పేజీలో ▶

మా పిల్లలకు గర్వంగా చెబుతున్నా..



తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న షేక్ జానీది కష్టాల కథే. పదుల సంఖ్యలో ఇళ్లు కట్టిన ఈ మేస్త్రీకి నిన్నా మొన్నటిదాకా సొంత గూడులేదు. 'మనం సొంతిల్లు కట్టుకోలేమా నాన్నా.. అని నా పిల్లలు అడిగినప్పుడు మనసు చివుక్కుమనేది. ఎన్నో ఇళ్లు కట్టిన నేను నా పిల్లలకు సమాధానం చెప్పలేకపోయేవాడిని. జగనన్న చలవవల్ల ఇప్పుడు నాకు పది లక్షల విలువైన ఇల్లు (బి-5)వచ్చింది. ఇంతకంటే ఇంకేం కావాలి? ఇదంతా జగన్ బాబు పుణ్యమే' అంటున్నప్పుడు మేస్త్రీ జానీ కళ్లలో కృతజ్ఞత కనిపించింది.

క్లుప్తంగా

విద్యా వ్యవస్థకు పటిష్ట పునాదులు వేసిన పండిట్ నెహ్రూ

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్



నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గవర్నర్

సాక్షి, అమరావతి: భారత ప్రథమ ప్రధాన మంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశంలో బాలల విద్యా వ్యవస్థకు బలమైన పునాదులు వేశారని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కొనియాడారు. పండిట్ నెహ్రూ 133వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం రాజ్‌భవన్‌లో నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి గవర్నర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక దేవాలయాలుగా పిలిచే నీటి పారుదల ప్రాజెక్టులు, వైజ్ఞానిక పరిశోధన సంస్థలు, స్టీల్‌ప్లాంట్లు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ఉన్నత విద్యాసంస్థల నిర్మాణానికి నెహ్రూ దార్శనికతతో పటిష్ట పునాదులు వేశారని వివరించారు. పండిట్ నెహ్రూ ఆశయాల మేరకు దేశాన్ని అగ్రభాగాన నిలపాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

చదువు, విలువలు ఇవే పిల్లలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి

బాలలదినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన సీఎం జగన్



సాక్షి, అమరావతి: చదువు, విలువలు ఇవే పిల్లలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సమాజ వికాసానికి వారే పట్టుకొమ్మలు, ప్రేమ, స్నేహం, సమభావంతో పిల్లలు ఎదగాలి. చిన్నారులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు.. అంటూ సోమవారం సీఎం ట్వీట్ చేశారు.

వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను 2022–23 ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు ప్రభుత్వం పొడిగించింది. దీనిపై వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో, సమాచార పౌర సంబంధాల శాఖలు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

16న రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ల ప్రమాణ స్వీకారం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు చట్టం నూతన కమిషనర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 16 వ తేదీన జరుగనుందని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (జీపీఎం అండ్ ఎఆర్) ప్రవీణ్ కుమార్ తెలియజేశారు.బుధవారం సచివాలయం మొదటి బ్లాకులో మధ్యాహ్నం 3గంటలకు రాష్ట్ర ముఖ్య సమాచార కమిషనర్‌గా నియమితులైన ఆర్.మహబూబ్ బాషా, రాష్ట్ర సమాచార కమిషనర్‌గా నియమితులైన పి.శామ్యూల్ జొనాథన్‌చే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ ప్రమాణ స్వీకారం చేయిస్తారన్నారు.

పవన్.. గుంకలాం వెళ్లి ఏంసాధించావ్?

- రూ.11 వేల కోట్లు ఖర్చు చేస్తే.. 15 వేల కోట్లు తినేశామంటావా?
- మంత్రి ఆర్కే రోజా




సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గుంకలాంలో జగనన్న కాలనీ లేఅవుట్‌కు వెళ్లి ఏమి సాధించారని సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి ఆర్కే రోజా ప్రశ్నించారు. అక్కడ పవన్ మాట్లాడిన మాటలు, ప్రవర్తన, వింతచేష్టలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆమె సోమవారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. కాస్త బుర్ర ఉన్న ఎవరైనా.. రూ.11 వేలకోట్లు ఖర్చుచేస్తే.. రూ.15 వేలకోట్లు తినేశారని మాట్లాడరన్నారు. ఇలాంటి పిచ్చిపిచ్చి మాటలు పవన్‌కే చెల్లుతాయని దుయ్యబట్టారు. పవన్‌కళ్యాణ్ గుంకలాం పర్యటనతో జగనన్న గొప్పతనం ఏంటో ప్రజలకు తెలిసిందన్నారు. 'ఒక్క మహిళ అయినా లంచం ఇచ్చినట్టు పవన్‌తో చెప్పిందా? దేశంలో ఏ సీఎం అయినా 30 లక్షల ఇళ్లస్థలాలిచ్చారా? ఎమ్మెల్యేగా కూడా గెలవని పవన్‌పై ఎవరైనా ఫిర్యాదు చేస్తారా? ప్రధానితో ఏం మాట్లాడాడో పవన్ ఎందుకు చెప్పలేదు. ఏనాడైనా రాష్ట్రం కోసం పవన్ మాట్లాడారా? జగనన్న ప్రజల సమక్షంలో ప్రధాని మోదీకి మన రాష్ట్ర సమస్యలు విన్నవించారు. ఎప్పుడూ జగనన్న రాష్ట్ర ప్రయోజనాల కోసమే కృషిచేస్తారు..' అని అన్నారు.

ప్రగతి రథంపై పాడు ఏడుపు

ఆర్టీసీలో అద్దె బస్సులంటూ ఈనాడు అసత్య కథనం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క అద్దె బస్సూ పెరగలేదు
- కాల పరిమితి తీరిన వాటి స్థానంలో మాత్రమే కొత్తవి
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ముందు ఉన్న అద్దె బస్సులు 2,360
- ఇప్పుడూ అదే సంఖ్యలో అద్దె బస్సులు
- ఒక్క ఉద్యోగంలోనూ కోత లేదు
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం ద్వారా 52 వేల మంది ఉద్యోగులకు ప్రయోజనం
- కొత్తగా 406 బస్సులు కొన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- మరో వెయ్యి బస్సుల కొనుగోలుకు నిర్ణయం



సాక్షి, అమరావతి: 'వినే వాడుంటే చెప్పే వాడు ఎన్నయినా చెబుతాడు' అన్నట్లుగా.. చదువుతున్నారు కదా అని పాఠకులంటే ఆ పత్రికకు అలుసు. నిత్యం అనేకానేక అబద్ధాలు రాసేస్తోంది. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెంచుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై నిత్యం అక్కసు వెళ్లగక్కుతోంది. అదే ధోరణిలో ఆర్టీసీపైనా అబద్ధాలు అచ్చేసింది. 'అద్దె బస్సులతో ఆర్టీసీలో 3 వేల ఉద్యోగాల కోత అంటూ' ఓ రోత కథనాన్ని సోమవారం ప్రచురించింది. ఈనాడు కథనం అవాస్తవమని అంశాల వారీగా తేల్చిచెబుతున్న ఫ్యాక్ట్ చెక్ ఇలా ఉంది..

1979 నుంచే అద్దె బస్సుల విధానం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అద్దె బస్సుల విధానంతో సంస్థ నిర్వీర్యమవుతోందని ఈనాడు చెప్పుకొచ్చింది. కానీ అద్దె బస్సుల విధానం ఆర్టీసీలో 1979 నుంచీ అమలులో ఉంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 14 ఏళ్లలో కూడా అద్దె బస్సుల విధానం కొనసాగింది. అదేమీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టింది కాదు.

ఒక్క అద్దె బస్సూ పెరగ లేదు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆర్టీసీలో అద్దె బస్సులు పెరిగాయన్న ఈనాడు కథనం పూర్తిగా అవాస్తవం. ప్రస్తుత ప్రభుత్వం ఆర్టీసీలో కొత్తగా ఒక్క అద్దె బస్సును కూడా తీసుకోలేదు.

కొనసాగుతున్న కొత్త బస్సుల కొనుగోలు ప్రక్రియ

ఆర్టీసీ కొత్త బస్సులను కొనేందుకు ప్రభుత్వం అనుమతించలేదన్న ఈనాడు ఆరోపణ పూర్తిగా అవాస్తవం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆర్టీసీ కొత్తగా 406 బస్సులను కొనుగోలు చేసింది. త్వరలో మరో వెయ్యి బస్సులు కొనేందుకు నిర్ణయించింది.

ప్రస్తుతం ఆర్టీసీలో 11,214 బస్సులు ఉండగా వాటిలో 2,360 మాత్రమే అద్దె బస్సులు. అంటే అద్దె బస్సులు 21 శాతమే ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకముందు కూడా 2,360 అద్దె బస్సులను ఆర్టీసీ నిర్వహించింది. గతంలో తీసుకున్న అద్దె బస్సుల కాల పరిమితి ముగియడంతో వాటి స్థానంలో అదే సంఖ్యలో కొత్త అద్దె బస్సులను టెండర్ల విధానంలో తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత అద్దె బస్సుల సంఖ్యను పెంచనే లేదు.

ఒక్క ఉద్యోగంలో కూడా కోత లేదు

వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక ఒక్క ఉద్యోగంలో కూడా కోత పడలేదు. ఇక ముందు కూడా ఉద్యోగుల సంఖ్య తగ్గించే యోచన ప్రభుత్వానికి లేదు. పైగా, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. దాంతో 52 వేల మంది ఆర్టీసి ఉద్యోగులు ఒకేసారి ప్రభుత్వ ఉద్యోగులయ్యారు. తద్వారా ఉద్యోగ భద్రతతో పాటు అదనపు ఆర్థిక ప్రయోజనాలు కూడా పొందుతున్నారు. సంస్థ లాభనష్టాలతో సంబంధం లేకుండా ప్రభుత్వం నుంచి నెలనెలా వారికి జీతాలు అందుతున్నాయి.

ఖర్చు రూ.11 వేల కోట్లు.. అవినీతి రూ.15 వేల కోట్లా?

- కేంద్ర చట్టం ప్రకారమే జగనన్న కాలనీలకు భూ సేకరణ
- పారదర్శకంగా పేదల ఇళ్ల నిర్మాణం.. అవినీతికి ఆస్కారమే లేదు

సాక్షి, అమరావతి: బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయంత అన్నట్లుగా జనసేనాని ఆరోపణల్లో డొల్లతనం బయట పడింది. జగనన్న కాలనీల పేరుతో ప్రభుత్వం రూ.10 వేల కోట్ల నుంచి రూ.15 వేల కోట్ల అవినీతికి పాల్పడిందంటూ పవన్ కళ్యాణ్ చేస్తున్న ఆరోపణలు పూర్తి అవాస్తవమని తేలింది. రాష్ట్రంలో ప్రతి నిరుపేదకు సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో దాదాపు 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలివ్వగా అందుకోసం 71,811 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. ప్రభుత్వ భూమి పోగా 25,374 ఎకరాలను రైతుల నుంచి కొనుగోలు చేసింది. అందుకోసం సుమారు రూ.11 వేల కోట్లు ఖర్చు చేసింది. అలాంటప్పుడు ఖర్చు చేసిందే రూ.11 వేల కోట్లయితే ఇక రూ.15 వేల కోట్ల అవినీతికి పాల్పడటం ఎలా సాధ్యం?

రైతుల నుంచి ఎకరా రూ.2 లక్షలు, రూ.4 లక్షలకు కొనుగోలు చేసి వైఎస్సార్‌సీపీ నేతలు రూ.20 లక్షలు, రూ.30 లక్షలకు విక్రయించారన్న ఆరోపణలోనూ నిజం లేదు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన భూ సేకరణ చట్టం ప్రకారమే జగనన్న కాలనీల కోసం భూ సేకరణ జరిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బేసిక్ వాల్యూ రిజిస్టర్‌లో నిర్దేశించిన విలువ ప్రకారమే విక్రయాలు, కొనుగోళ్లు జరిగాయి. దీనికంటే బహిరంగ మార్కెట్‌లో రేటు ఎక్కువగా ఉంటే కేంద్ర భూ సేకరణ చట్టం ప్రకారం ముందుకెళ్తారు. రిజిస్ట్రేషన్ విలువ కన్నా రూరల్‌లో రెండున్నర రెట్లు, అర్బన్‌లో రెట్టింపు విలువను అధికంగా చెల్లిస్తారు. అప్పటికీ రైతులు సంతృప్తి చెందకుంటే కలెక్టర్లు జిల్లా కమిటీలకు ఆ కేసులను అప్పగిస్తారు. ఇలాంటి సందర్భాల్లో బేసిక్ వాల్యూ రిజిస్ట్రేషన్ కన్నా అధిక ధరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ధరను, డాక్యుమెంట్లలో పేర్కొన్న విలువను పరిగణలోకి తీసుకుంటారు. ఇదంతా కేంద్రం రూపొందించిన భూ సేకరణ చట్టం ప్రకారమే అనుసరిస్తారు. ఆ డాక్యుమెంట్‌లో పేర్కొన్న సేల్ వాల్యూను పరిగణలోకి తీసుకుని హైవేలు, ఇతర కమర్షియల్ స్థలాలు, మేజర్ ప్రాజెక్టులకు సమీపంలో ఉన్న స్థలాల రైతులతో సంప్రదింపులు జరిపి మరో 10 నుంచి 20 శాతం ధర పెంచుతారు. అప్పటికీ రైతులు సంతృప్తి చెందకపోతే ఇలాంటి కేసులు రాష్ట్ర కమిటీలకు వెళతాయి. ధర ఖరారైన తర్వాత నేరుగా రైతు బ్యాంకు ఖాతాల్లోకి సీఎంఎఫ్ఎస్ నుంచి డబ్బులు జమ అవుతాయి. ఇందులో ఎక్కడా మధ్యవర్తులు ఉండరు.

భూ సేకరణ కోసం కలెక్టర్లు రెండు ప్రధాన పత్రికల్లో నోటిఫికేషన్ ఇచ్చి అభ్యంతరాలు స్వీకరిస్తారు. రైతులతో మాట్లాడిన తర్వాతే డిక్లరేషన్ చేసి అవార్డును ఎంక్వైరీ చేస్తారు. అనంతరం ఫైనల్ అవార్డును డిక్లేర్ చేస్తారు. ఈ ప్రక్రియ ముగిసేందుకు కనీసం 3 నుంచి 6 నెలల సమయం పడుతుంది. ఇంత పారదర్శకంగా భూసేకరణ జరిపి కాలనీలను నిర్మిస్తుంటే అందులో అవినీతికి ఎక్కడ ఆస్కారం ఉంది?

ఈ ఆనందం వెలకట్టలేనిది!

ఆయన మా పాలిట అల్లాహ్..



చిత్రంలో కనిపిస్తున్నామె పేరు షేక్ షహీనా. మంగళగిరి ఇస్లాంపేటలో అద్దె ఇంట్లో ఉండేవారు. ఈమె తల్లిదండ్రులు, అత్తమామలకు కూడా సొంతిల్లు లేదు. ఇప్పుడు మంగళగిరిలో నిర్మించిన వైఎస్సార్ జగనన్న నగర్‌లోని బి–16 బ్లాక్‌లో ఫ్లాట్ పొందారు. ఇద్దరు పిల్లలతో సరైన ఇల్లులేక ఏడ్చిన సందర్భాలను ఈమె గుర్తుచేసుకున్నారు. 'నా భర్త నిస్సార్ చెప్పుల దుకాణంలో పనిచేస్తారు. అరకొర జీతం. బంధువులు రాకూడదని షరతు. దీంతో ఎన్ని ఇళ్లు మారానో అల్లాకే తెలుసు. ఇప్పుడు నా సొంతింట్లో ఉంటున్నాను. ఇదంతా జగనన్న చలవే' అని చెమర్చిన కళ్లతో చెప్పారు. ఇక షహీనా తల్లి ఫైజాన్ మాట్లాడుతూ.. 'అద్దె ఇంట్లో నీరు ఎక్కువ వాడుతున్నారని తిట్టేవారు. దాంతో మనవలను చూడాలన్న ఆశ ఉన్నా వెళ్లడానికి ఉండేది కాదు. ఇప్పుడు నా బిడ్డకు జగన్‌బాబు ఇల్లిచ్చారు. నేను ఇక్కడకు ఎప్పుడైనా రావొచ్చు. ఆయన మా పాలిట అల్లాహ్'.. అన్నప్పుడు కళ్లలో ఆనంద బాష్పాలు కనిపించాయి. **– వీరి ఆనంద బాష్పాలకు ఖరీదుకట్టే షరాబు ఉన్నాడా?**

నేను స్వేచ్ఛగా ఆడుకోవచ్చు..



ఇక్కడ చిత్రంలోని తల్లి జె.రాజ్యలక్ష్మితో కనిపిస్తున్న పిల్లాడి పేరు మోక్షజ్ఞ. ఏడో తరగతి. వీరు గతంలో చిన్న గదిలో అద్దెకుండేవారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న తల్లి తెచ్చే కొద్దిపాటి ఆదాయంతోనే ఇల్లు గడిచేది. ఇప్పుడు వీరికి టిడ్కో ప్రాజెక్టులో ఏ–7 బ్లాక్‌లో ఇల్లిచ్చారు. దీనిపై మోక్షజ్ఞ స్పందిస్తూ.. 'ఇంతకుముందు ఆడుకునేందుకు ఏమీ ఉండేది కాదు. ఇప్పుడిక్కడ ప్లేగ్రౌండ్ ఉంది. పార్కు కూడా కడతారట'.. అన్నప్పుడు బాబు కళ్లలో కనిపించిన మెరుపు వెలకట్టలేం. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. 'జగనన్న వచ్చాక నాకంటూ సొంతిల్లు వచ్చింది' అని చెప్పింది. **– ఈ తల్లీకొడుకుల్లో సంతోషం, ధీమా కనిపించాయి.**

ఇరుకు గది నుంచి విశాల ప్రపంచానికి



ఈ చిత్రంలో కనిపిస్తున్న చిన్నారి పేరు కరిష్మా. నాలుగో తరగతి చదువుతోంది. నాన్నలేని ఈ బిడ్డకు ఓ తమ్ముడు ఉన్నాడు. వంట పనిచేసి తల్లి తెచ్చే కొద్దిపాటి సంపాదనతో మంగళగిరి ఐదో వార్డులోని చిన్నరేకుల షెడ్డులో వీరుంటున్నారు. ఇక్కడ బి–37లో ఫ్లాట్ ఇచ్చారు. ఈ చిన్నారిని పలకరించినప్పుడు 'మేం అద్దెకుండే రేకుల ఇల్లు వర్షం వస్తే కారిపోయేది. ఇక్కడ ఇల్లు వచ్చిందని తెలియగానే అమ్మ ఎంతో సంతోషపడింది. అమ్మను అంత ఆనందంగా ఎప్పుడూ చూడలేదు'. **– ఆ చిన్నారి కళ్లలో వెలకట్టలేని వెలుగు కనిపించింది.**

▶ మొదటి పేజీ తరువాయి

చక్కటి డ్రైనేజీ వ్యవస్థ, ప్రతిబ్లాక్‌కు 20 అడుగుల సెట్‌బ్యాక్, ఆధునిక టెక్నాలజీతో నిర్మించిన 0.8 ఎంఎల్‌డీ సామర్థ్యమున్న ఎస్టీపీతో చక్కటి ఇళ్లను ప్రభుత్వం లబ్ధిదారులకు అందించింది. సిరామిక్ టైల్స్‌తో ప్రతి గదినీ ముచ్చటగా తీర్చిదిద్దారు. 'ఇలాంటి చోట ఇంతమంచి ఇల్లు మా జీవితంలో కట్టుకోలేం' అని లబ్ధిదారులు అంటున్నారంటే వారెంత ఆనందంగా ఉన్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'దగ్గర్లోనే పట్టణ ఆరోగ్య కేంద్రం ఉంది, ఎవరికి ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా మంచిగా వైద్యం చేస్తున్నారంటూ' స్థానిక మహిళ జ్యోతి చెప్పారు. ఇక పిల్లల కోసం ప్రత్యేకంగా ఆట స్థలం సిద్ధమవుతోంది. అందరికీ ఉపయోగపడేలా పార్కును కూడా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడే కాదు.. రాష్ట్రంలో 88 స్థానిక సంస్థల్లో నిర్మిస్తున్న 163 జీ+3 టిడ్కో అపార్ట్‌మెంట్లను ఇదే రీతిలో తీర్చిదిద్దుతున్నట్లు టిడ్కో ఎండీ చిత్తూరి శ్రీధర్ తెలిపారు.

చిన్న రేకుల షెడ్డులో ఉండేవాళ్లం



తెనాలి రోడ్డులోని రేకుల షెడ్డులో ఉండేవాళ్లం. చిన్నపాటి వర్షానికి కారిపోయేది. మా నాన్న ఎలక్ట్రీషియన్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషిస్తారు. మాకు ఇక్కడ బి–21 బ్లాక్‌లో ఫ్లాట్ ఇచ్చారు. ఇప్పుడు సొంతింట్లో ఉంటున్నాం. దగ్గర్లోనే ప్లేగ్రౌండ్ కూడా ఉంది. చాలా ఆనందంగా ఉంది. **– ఎండీ యాకూబ్ బేగ్, 8వ తరగతి**

అన్ని సౌకర్యాలు ఉన్నాయి



మా అమ్మ షాపులోను, నాన్న టైలర్‌గాను పని చేస్తారు. చిన్న గది, ఇంటికి ఎవరొచ్చినా ఉండేందుకు అవకాశం ఉండేదికాదు. నా స్నేహితుల సొంతిళ్లను చూసినప్పుడు అలాంటి ఇల్లు మేం కొనుక్కోగలమా అని అనిపించేది. జగనన్న పుణ్యమా అని ఇప్పుడు మాకూ ఇల్లు వచ్చింది. **– గుమ్మడి జ్యోతిక, ఇంటర్ సెకండియర్**

మాటల్లో చెప్పలేని ఆనందం



ప్రైవేటు ఆస్పత్రిలో క్లర్క్‌గా పనిచేసే నేను సొంతిల్లు సంపాదించడం అసాధ్యం. చిన్న గదిలో అద్దెకుండే వారం. బంధువులొస్తే ఉండే అవకాశంలేదు. ఇప్పుడు అన్ని వసతులతో ఇల్లు ఇచ్చారు. మా అబ్బాయి ఎంతో మురిసిపోతున్నాడు. జగనన్న పుణ్యమాని అద్దె ఇంటి కష్టాలు తప్పాయి. **– షేక్ పర్వీన్, ప్రైవేట్ ఉద్యోగి**

పచ్చదనం కోసం త్వరలో మొక్కలు

విశాలమైన ఈ ఇళ్ల ప్రాంగణంలోని ప్రతి అపార్ట్‌మెంట్ సెట్‌బ్యాక్‌లోను పళ్ల మొక్కలు, రోడ్లకు ఇరువైపులా నీడనిచ్చే మొక్కలు నాటనున్నారు. నివాసితుల అవసరాలకు అనుగుణంగా దుకాణాల నిర్మాణం కూడా చేపట్టాలని నిర్ణయించారు. వైఎస్సార్ జగనన్న నగరాల నిర్వహణకు సంక్షేమ సంఘాలను కూడా ఏర్పాటుచేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఇళ్లలో ఇన్ని వసతులు ఉంటాయని ఊహించలేదని, ఇక్కడి నిర్మాణాలు చూశాక జగనన్న ప్రభుత్వం తమకెంత మేలుచేసిందో తెలిసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తంచేశారు. 'జగనన్న మాకు సొంతిల్లు ఇచ్చి ఆత్మ విశ్వాసాన్ని పెంచారు. ఇప్పుడు అందులో ఆనందంగా అడుగుపెట్టాం. బయటి వారు ఎవరో వచ్చి మా ఆనందాన్ని నాశనం చేయాలని చూస్తే ఎలా సహిస్తాం!' అంటూ గుంటి రాజలక్ష్మి (బి–6 బ్లాక్) అన్నారు.

ప్రజాదరణ సహించలేకే దుష్ప్రచారం

- టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్



వసతులపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న టిడ్కో చైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్

మంగళగిరి: టిడ్కో ఇళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించిందో తెలుసుకోవాలంటే మంగళగిరిలో జనసేన నేతలపై లబ్ధిదారులు తిరగబడిన ఘటనే నిదర్శనమని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఆటోనగర్‌లోని వైఎస్సార్ జగనన్న కాలనీ(టిడ్కో) ఇళ్లను సోమవారం ఆయన పరిశీలించి గృహప్రవేశాలు చేసిన పలువురు లబ్ధిదారులను మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలతోపాటు.. ప్రతి పేదవాడికి స్థలం కేటాయించి ఇల్లు కట్టించి ఇస్తుండడంతో సీఎం వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక టీడీపీ, జనసేన ఈ ఇళ్లపై దుష్ప్రచారం చేస్తున్నాయని ప్రసన్నకుమార్ ధ్వజమెత్తారు. టిడ్కో ఇళ్లను మొదలుపెట్టిన టీడీపీ పాలనలో జరిగిన అవినీతి ప్రశ్నించని పవన్‌కళ్యాణ్ ఇప్పుడు ఎంతో పారదర్శకంగా రివర్స్ టెండరింగ్‌తో మౌలికవసతులు కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీలకు వెళ్తున్న జనసేన నాయకులపై లబ్ధిదారులు తిరగబడి తరిమికొడుతున్నా వారికి సిగ్గులేదన్నారు.

వచ్చే మార్చికల్లా ఇళ్లన్నీ పంపిణీ

రాష్ట్రవ్యాప్తంగా 88 స్థానిక సంస్థల్లో 2.62 లక్షల టిడ్కో ఇళ్లను అన్ని వసతులతో నిర్మిస్తున్నామని.. ఇప్పటికే 40 వేలకు పైగా పంపిణీ చేశామన్నారు. ఇళ్లపై కొందరు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని.. వారికి ప్రజలే బుద్ధి చెబుతున్నారన్నారు.

నీ పార్ట్‌నర్ కోసం నిరాధార ఆరోపణలు చేస్తావా?

జగనన్న కాలనీల్లో అవినీతిని రుజువు చేస్తే తల దించుకుంటా: మంత్రి బొత్స

సాక్షి, అమరావతి: జగనన్న కాలనీల్లో అవినీతి జరిగినట్లు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆధారాలతో నిరూపించగలరా? అని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సవాల్ చేశారు. అవినీతి జరిగిందని నిరూపిస్తే తల దించుకోవడానికి తాను సిద్ధమని ప్రకటించారు. జగనన్న కాలనీల్లోకి రావద్దంటూ లబ్ధిదారులైన అక్కచెల్లెమ్మలు నీ పార్టీ నేతలు, కార్యకర్తలకు చీవాట్లు పెడుతుండటం కళ్లకు కనిపించడం లేదా? అని నిలదీశారు. 'మీకు వాస్తవాలు చెప్పేందుకు మావాళ్లు వచ్చేవాళ్లు.. కానీ నిన్ను అడ్డుకున్నామని నిందలు మోపుతావనే ఆగాం' అని పేర్కొన్నారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

వైఎస్సార్ బాటలో మహాయజ్ఞం

వైఎస్సార్ బాటలోనే రాష్ట్రంలోని పేదలందరి సొంతింటి స్వప్నాన్ని సాకారం చేసే మహాయజ్ఞాన్ని సీఎం జగన్ చేపట్టారని బొత్స తెలిపారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలకు భూమి కొనుగోలు, సదుపాయాల కల్పనకు ఇప్పటిదాకా రూ.15 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. జగనన్న కాలనీల్లో ప్రభుత్వం రూ.15 వేల కోట్ల అవినీతికి పాల్పడిందని పవన్ కళ్యాణ్ ఆరోపించడం ఆయన అజ్ఞానం, అవగాహనా రాహిత్యానికి నిదర్శనమన్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడొద్దని సూచించారు. ప్రజలు నువ్వు ఏది చెబితే అది నమ్మేందుకు నువ్వేమైనా యుగపురుషుడివా? అని నిలదీశారు. దాదాపు 31 లక్షల మంది అక్కచెల్లెమ్మకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి 71,813 ఎకరాల భూమిని సేకరించామని, ఇందులో 25 వేల ఎకరాలను ప్రైవేట్ వ్యక్తుల నుంచి రూ.11 వేల కోట్లు వెచ్చించి కొనుగోలు చేశామని బొత్స తెలిపారు. భూమి చదును చేయడానికి, విద్యుత్, నీటి సౌకర్యం, అంతర్గత రహదారులు లాంటి సదుపాయాల కోసం ఇప్పటివరకూ రూ.నాలుగు వేల కోట్ల మేర ఖర్చు చేశామన్నారు. జగనన్న కాలనీల్లో ఖర్చు చేసిందంతా వైఎస్సార్‌సీపీ నేతలు కాజేశారని నువ్వు ఆరోపిస్తే నమ్మడానికి ప్రజలేమైనా చెవిలో పువ్వులు పెట్టుకున్నారనుకుంటున్నావా? అని పవన్‌ను నిలదీశారు.

ఏ ఒక్కరైనా చెప్పారా?

విజయనగరం జిల్లాలోని గుంకలాం వద్ద 400 ఎకరాల్లో 12 వేల ఇళ్ల స్థలాలను సిద్ధం చేసి పది వేల మందికి పట్టాలను సీఎం జగన్ పంపిణీ చేశారని బొత్స గుర్తు చేశారు. రాష్ట్రంలోని అతిపెద్ద లేఅవుట్లలో ఇది రెండోదన్నారు. అక్కడకు వెళ్లిన పవన్ వద్దకు ఏ ఒక్క లబ్ధిదారుడూ రాలేదని, ఆయన వెంట ఉన్నది అభిమానులు మాత్రమేనని స్పష్టం చేశారు. ఆ లేవుట్‌లోని భూమి కొనుగోలులో అవినీతి జరిగిందని, సదుపాయాల కల్పన పనుల్లో అక్రమాలు జరిగాయని, ఇంటి బిల్లుల చెల్లింపు కోసం కమీషన్లు అడిగారని ఏ ఒక్కరితోనైనా చెప్పించగలవా? అని పవన్‌ను సూటిగా ప్రశ్నించారు. 21 లక్షల ఇళ్ల నిర్మాణ పనులకు అత్యంత పారదర్శకంగా రూ.7,700 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. అవినీతి జరగడానికి అధికారంలో ఉన్నది నీ పార్ట్‌నర్ చంద్రబాబు కాదు.. ఇది వైఎస్ జగన్ ప్రభుత్వమని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తైతే రాష్ట్రంలో కొత్తగా 17,005 గ్రామాలు, పట్టణాలు ఆవిష్కృతమవుతాయని చెప్పారు.

ఆ అవసరం మాకేముంది?

జగనన్న కాలనీలను పరిశీలించేందుకు వెళ్లిన పవన్ కళ్యాణ్ తనపై వైఎస్సార్‌సీపీ నేతలు ఢిల్లీలో ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించడం హాస్యాస్పదమని మంత్రి బొత్స చెప్పారు. 'నీపై మేం ఫిర్యాదులు చేయడానికి నువ్వేమైనా పెద్ద పుడింగివనుకుంటున్నావా?' అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. 'నీపై ప్రధానికి ఫిర్యాదు చేయాల్సిన అవసరం మాకేముంది? నీ గుణాలన్నీ మాకు ఆపాదిస్తే ఎలా' అంటూ ధ్వజమెత్తారు. 'ఏదో నీ పార్ట్‌నర్‌కు ఇచ్చిన కాల్షీట్ ప్రకారం రాష్ట్రానికి వచ్చిపోయే నీకు మా మాదిరిగా ప్రజాసేవ చేయాలనే ఆలోచనలు వస్తాయని అనుకోవడం లేదు' అని వ్యాఖ్యానించారు. క్రేన్లు కట్టి లేపినా చంద్రబాబు నిలబడే పరిస్థితి లేదన్నారు.

బీజేపీతో కాపురం.. బాబుతో పొత్తా?

బీజేపీతో కాపురం చేస్తూ చంద్రబాబుతో పొత్తు కోసం పవన్ కళ్యాణ్ అర్రులు చాస్తున్న విషయం అందరికీ తెలిసిందేనని ఓ ప్రశ్నకు సమాధానంగా మంత్రి బొత్స చెప్పారు. ప్రజలు తమను చొక్కా పట్టుకుని నిలదీసేందుకు తామేమైనా పవన్ కళ్యాణ్, ఆయన పార్టీ నేతల్లా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నామా? అని ప్రశ్నించారు. జనసేన రాజకీయ పార్టీనే కాదని, అది ఓ సెలబ్రిటీ పార్టీ అని పునరుద్ఘాటించారు. తమను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటారేమోనని పవన్ కళ్యాణ్ ఆరోపించడాన్ని చూస్తే అధిక శాతం సీట్లలో ఆయన పార్ట్‌నర్ పోటీ చేస్తారని సంకేతాలిస్తున్నట్లుగా ఉందన్నారు.

ఏ క్షణమైనా విశాఖ నుంచి పరిపాలన..

ఏ క్షణమైనా విశాఖ నుంచి పరిపాలన చేయడానికి సీఎం జగన్ సిద్ధంగా ఉన్నారని మంత్రి బొత్స చెప్పారు. కొన్ని దుష్ట శక్తులు సాంకేతిక కారణాలను అడ్డం పెట్టుకుని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణానికి మార్గం సుగమమైనట్లే ప్రజల మంచి కోసం సీఎం జగన్ చేస్తున్న యజ్ఞం సఫలమవుతుందని స్పష్టం చేశారు.

ఉక్కు ప్రైవేటీకరణకు మేం వ్యతిరేకం

రాష్ట్ర ప్రయోజనాలే తమకు ప్రధానమని, రాజకీయ ప్రయోజనాలు కాదని ప్రధాని మోదీ సమక్షంలో చెప్పడం ద్వారా సీఎం జగన్ మంచి సందేశం ఇచ్చారని బొత్స పేర్కొన్నారు. సింగరేణిలో కేంద్ర వాటా 49 శాతం, తెలంగాణ వాటా 51 శాతం ఉంది కాబట్టే ప్రైవేటీకరణ తమ చేతుల్లో లేదని మోదీ చెప్పారని బొత్స పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో పూర్తి వాటా కేంద్రానిదేనన్నారు. ప్రభుత్వ రంగంలోనే లాభాల బాటలో నడిపేలా సీఎం వైఎస్ ప్రత్యామ్నాయ మార్గాలను ప్రధానికి సూచించారని, ప్రైవేటీకరణకు తాము పూర్తి వ్యతిరేకమని తేల్చి చెప్పారని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పనీపాటా లేకుండా ఇలా తిరుగుతున్నారా?

- జనసేన నాయకులపై తిరగబడ్డ జగనన్న ఇళ్ల లబ్ధిదారులు



జనసేన నేతలను చుట్టుముట్టిన లబ్ధిదారులు

గొలుగొండ (అనకాపల్లి జిల్లా): సీఎం జగనన్న మాకు ఇళ్ల స్థలాలిచ్చి.. ఇళ్ల నిర్మాణం కోసం నిధులిస్తున్నా జనసేన నాయకులు ప్రభుత్వంపై విషం చిమ్మడం విడ్డూరంగా ఉందంటూ గొలుగొండ మండలం జోగుంపేట గృహ నిర్మాణ లబ్ధిదారులు తిరుగుబాటు చేశారు. జనసేన నర్సీపట్నం నియోజకవర్గ కన్వీనర్ రాజాన వీరసూర్యచంద్రతో కలిసి జనసేన కార్యకర్తలు జోగుంపేట జగనన్న కాలనీకి సోమవారం వచ్చారు. లే అవుట్ స్థలాన్ని పరిశీలించి మాట్లాడుతూ.. ప్రభుత్వం మూడున్నరేళ్లలో ఎలాంటి నిర్మాణాలు చేయలేదని, నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. దీంతో అక్కడే ఉన్న జోగుంపేట మహిళలు జనసేన కార్యకర్తలపై మండిపడ్డారు. పనీపాటా లేకుండా జనసేన నాయకులు తిరుగుతున్నారా? గ్రామాల్లో అభివృద్ధిని చూసి తట్టుకోలేపోతున్నారా.. అంటూ వారిపై తిరుగుబాటు చేశారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తే గ్రామాల్లో కూడా తిరగనిచ్చేది లేదంటూ హెచ్చరించారు. అక్కడే ఉన్న పోలీసులు మహిళలను శాంతింపజేశారు. ఏం చేయాలో పాలుపోక జనసేన కార్యకర్తలు అక్కడ నుంచి వెళ్లిపోయారు.

క్లుప్తంగా

ప్రభుత్వ బోధనాస్పత్రులకు నోడల్ ఆఫీసర్లుగా ఐఏఎస్‌లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 11 ప్రభుత్వ బోధనాస్పత్రులకు నోడల్ అధికారులుగా ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. ప్రజలకు ప్రభుత్వరంగంలో మెరుగైన వైద్యసేవలు అందించడం కోసం సీఎం వైఎస్ జగన్ సర్కార్ ఇప్పటికే పలు విప్లవాత్మక చర్యలు తీసుకుంది. తాజాగా విజయవాడ, గుంటూరు జీజీహెచ్‌లకు ఎంటీ కృష్ణబాబు, అనంతపురం, తిరుపతి రుయాకు జీఎస్ నవీన్‌కుమార్, కర్నూలుకు డి.మురళీధర్‌రెడ్డి, శ్రీకాకుళం, విశాఖపట్నం కేజీహెచ్‌కు డాక్టర్ వినోద్‌కుమార్, ఒంగోలు, నెల్లూరుకు జె.నివాస్, కడపకు ఎంఎస్ హరేంధిరప్రసాద్, కాకినాడ జీజీహెచ్‌కు డాక్టర్ సత్యవరప్రసాద్‌ను నోడల్ ఆఫీసర్లుగా నియమించింది. వీరు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా దిశానిర్దేశం చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వస్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంతో పాటు ఎన్ఏబీహెచ్ ప్రమాణాలకు అనుగుణంగా ఆస్పత్రులను తీర్చిదిద్దడం వీరి బాధ్యతే.

నేడు ఎన్‌డబ్ల్యూడీఏ పాలక మండలి సమావేశం

- నదుల అనుసంధానమే అజెండా
- గోదావరి–కావేరి అనుసంధానంపై కీలక చర్చ

సాక్షి, అమరావతి: జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) పాలక మండలి 70వ సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ అధ్యక్షతన వర్చువల్‌గా జరిగే ఈ సమావేశంలో ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్ సింగ్, సీడబ్ల్యూసీ చైర్మన్ డాక్టర్ ఆర్కే గుప్తా, అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శులు, ఈఎన్‌సీలు పాల్గొంటారు. నదుల అనుసంధానానికి ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారం, నిధుల సమీకరణ తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించి కేంద్రానికి నివేదిక ఇవ్వనున్నారు. గోదావరి–కావేరి అనుసంధానాన్ని అజెండాలో ప్రధానాంశంగా చేర్చారు. తుపాలకులగూడెం నుంచి నాగార్జునసాగర్ (కృష్ణా), సోమశిల(పెన్నా) మీదుగా కావేరి బేసిన్‌కు గోదావరి జలాలను తరలించడంపై కూడా ఈ సమావేశంలో చర్చించనున్నారు.

ఆ ఫైళ్లను తెప్పించేందుకు ఏం చేస్తున్నారో చెప్పండి

ఏపీ, తెలంగాణ హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్‌లకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: హైకోర్టు విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు చెందిన పలు కేసుల ఫైళ్లు తెలంగాణ హైకోర్టులో ఉండిపోయిన నేపథ్యంలో వాటిని తెప్పించే దిశగా హైకోర్టు సోమవారం కీలక ఉత్తర్వులు జారీచేసింది. ఏపీ హైకోర్టుకు చెందిన ఫైళ్లను తెప్పించేందుకు వీలుగా రెండు హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్‌లు సమావేశం కావాలని ఆదేశించింది. తెలంగాణలో ఎన్ని ఫైళ్లు ఉండిపోయాయి, వాటిని తెప్పించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.. వంటి వివరాలతో ఇద్దరు రిజిస్ట్రార్ జనరల్‌లు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఓ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఏపీ హైకోర్టుకు చెందిన పలు ఫైళ్లు తెలంగాణ హైకోర్టులోనే ఉండిపోయాయని, దీనివల్ల కేసుల విచారణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి, పలువురు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

ఎమ్మెల్సీ అనంతబాబు బెయిలు పిటిషన్ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్సీ అనంతబాబు బెయిలు పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు డిసెంబరు 12వ తేదీకి వాయిదా వేసింది. దళిత యువకుడి హత్యకేసులో ఏపీ హైకోర్టు బెయిలు నిరాకరించగా.. సవాల్ చేస్తూ అనంతబాబు కుటుంబసభ్యులు వేసిన పిటిషన్ సోమవారం జస్టిస్ సంజయ్ కిషన్‌కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ మేరకు ధర్మాసనం ఏపీ సీఐడీకి నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

వారం రోజుల్లో ఆదేశాలిస్తాం

- వైఎస్ వివేకా హత్య కేసు విచారణ బదిలీపై సుప్రీంకోర్టు
- ఎర్ర గంగిరెడ్డి బెయిలు రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయడంపై వచ్చే సోమవారంలోపు ఆదేశాలు ఇస్తామని జస్టిస్ ఎంఆర్ షా తెలిపారు. ఈ కేసులో ఎర్ర గంగిరెడ్డికి బెయిలు రద్దు చేయాలంటూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్ సోమవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ హిమా కోహ్లి ధర్మాసనం ముందుకొచ్చింది. దీనిని సోమవారం విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది. అయితే, వివేకా హత్య కేసు మరో రాష్ట్రానికి బదిలీ చేయడంపై ఆదేశాలు ఇంకా వెలువరించలేదని న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన జస్టిస్ ఎంఆర్ షా వచ్చే సోమవారంలోపు ఆదేశాలిస్తామని పేర్కొన్నారు. ఎర్ర గంగిరెడ్డి బెయిలు రద్దు పిటిషన్ కూడా అదేరోజు విచారిస్తామన్నారు.

రొయ్యల ధరల నియంత్రణకు ఎస్‌వోపీ

ధరల నియంత్రణపై రోజూ సమీక్ష	డిపార్టుమెంటల్ కాల్ సెంటర్ ఏర్పాటు	నిర్దేశించిన ధరలు 10 రోజులు ఉండేలా చర్యలు	ప్రభుత్వ చర్యలు చూసి ఓర్వలేకే 'ఈనాడు విలవిల'
	త్వరలో కేంద్రానికి ప్రత్యేక ప్రతినిధి బృందం	రొయ్యల ఎగుమతులను ప్రోత్సహించేలా చర్యలు	

సాక్షి, అమరావతి: రొయ్య రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. అంతర్జాతీయంగా మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో రొయ్య రైతులకు నష్టం వాటిల్లకుండా అన్ని విధాలుగా కృషిచేస్తోంది. ధరల నియంత్రణ కోసం ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) చట్టం ప్రకారం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ) రూపొందిస్తోంది. రోజూ మార్కెట్‌ను సమీక్షించడమేగాక రొయ్య రైతుల కోసం ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తోంది. మరోపక్క రొయ్యల ఎగుమతులను ప్రోత్సహించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి పంపేందుకు సన్నాహాలు చేస్తోంది.

అంతర్జాతీయ మార్కెట్ వల్లే..

ప్రధానంగా 100 కౌంట్ రొయ్యల ప్రధాన దిగుమతిదారైన చైనా కొనుగోలు ఆర్డర్లను పూర్తిగా నిలిపేసింది. రూ.వెయ్యి కోట్లకుపైగా చెల్లింపులను ఆపేసింది. మరోవైపు నాలుగులక్షల టన్నులకు మించి ఉత్పత్తి చేయని ఈక్వెడార్ దేశం ఈ ఏడాది 13 లక్షల టన్నులు ఉత్పత్తి చేస్తూ మన రొయ్యల కంటే తక్కువ ధరకు అమెరికాకు ఎగుమతి చేస్తోంది. ఫలితంగా దేశీయంగా రొయ్యల మార్కెట్ తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంటోంది. పరిస్థితిని సమీక్షించేందుకు సీనియర్ మంత్రులతో ఏర్పాటు చేసిన సాధికారత కమిటీ పలుమార్లు సమావేశమై పెంచిన ఫీడ్ ధరలను తగ్గించడమేగాక తగ్గిన కౌంట్ ధరలను నియంత్రించేలా చర్యలు చేపట్టింది. దీంతో రొయ్యల మేత ధరను కిలోకు పెంచిన రూ.2.60ని మేత తయారీదారులు తగ్గించారు.

ఎగుమతి మార్కెట్‌కు అనుగుణంగా పంటల ప్రణాళిక

ప్రాసెసింగ్ కంపెనీలు, ట్రేడర్లతో విస్తృతస్థాయిలో చర్చలు జరిపి ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన రీతిలో రొయ్యల ధరలను నిర్ణయించారు. ఈ ధరలు కనీసం 10 రోజులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇకనుంచి సీజన్ ప్రారంభానికి ముందే ఎగుమతి మార్కెట్ పోకడలను అంచనావేస్తూ పంటల ప్రణాళికను రూపొందించి తదనుగుణంగా సాగుచేపట్టేలా రైతులను సన్నద్ధం చేయాలని నిర్ణయించారు. మరోవైపు రొయ్య రైతులు, మేత తయారీదారులు, సీ ఫుడ్ ప్రాసెసర్లు, ఎగుమతిదారులకు ప్రాతినిధ్యం వహించే సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక బృందాన్ని న్యూఢిల్లీ పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రొయ్యలు దిగుమతి చేసుకునే దేశాలతో స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందం చేసుకోవడం, రొయ్యల ఎగుమతుల ప్రోత్సాహకాల (డ్యూటీ డ్రా బ్యాక్) శాతం పెరుగుదల, ఆక్వా ఫీడ్ ఇన్‌పుట్‌లపై దిగుమతి సుంకాల తగ్గింపు తదితర విషయాలపై సంబంధిత కేంద్రమంత్రులతో చర్చించనున్నారు. స్థానిక వినియోగాన్ని పెంచడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చేసేందుకు రాష్ట్రంలోని ప్రతి నివాస ప్రాంతాల్లో మత్స్య ఉత్పత్తుల రిటైల్ అవుట్‌లెట్లు ఏర్పాటు చేస్తున్నారు.



ప్రస్తుతం మార్కెట్‌లో రొయ్యల ధరలు ఇలా..

కౌంట్	ధర (రూపాయల్లో)
100	210
90	220
80	240
70	250
60	270
50	290
40	340
30	380

ఆక్వా రైతులకు రూ.2,377.52 కోట్ల సబ్సిడీ

వాస్తవంగా యూనిట్ విద్యుత్ రూ.6.89 ఉండగా ఆక్వాజోన్ పరిధిలోని 10 ఎకరాల విస్తీర్ణంలో చెరువులకు యూనిట్ రూ.1.50, జోన్ వెలుపల ఉన్న చెరువులకు రూ.3.86 చొప్పున విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. ఈ విధంగా మూడేళ్లలో రూ.2,377.52 కోట్ల విద్యుత్ సబ్సిడీ ఇచ్చారు. వాస్తవాలు ఇలా ఉంటే.. రొయ్య రైతులు విలవిల అంటూ ఆక్వారంగంలో ఉన్న వారిని ఆందోళనకు గురిచేసేలా ఈనాడు తప్పుడు కథనాలు రాస్తుండడం పట్ల ఆక్వా రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ చర్యలు చూసి ఓర్వలేకనే 'ఈనాడు విలవిల' లాడిపోతోందని పేర్కొంటున్నారు.

కష్టకాలంలో ప్రభుత్వం మేలు మరిచిపోలేం



నేను 30 ఎకరాల్లో రొయ్యలు సాగుచేస్తున్నా. 20టన్నుల ఉత్పత్తి వచ్చింది. ఇటీవల సాధికారత కమిటీ నిర్ణయించిన రేట్ల ప్రకారం 30 కౌంట్ రూ.380 చొప్పున 6 టన్నులు, 40 కౌంట్ రూ.340 చొప్పున 5 టన్నులు, 50 కౌంట్ రూ.290 చొప్పున 3 టన్నులు, 60 కౌంట్ రూ.270 చొప్పున 6 టన్నులు విక్రయించా. గతంలో ఎన్నడూ ఇలాంటి కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలిచిన దాఖలాలు లేవు. ప్రభుత్వమే దగ్గరుండి మరీ ప్రాసెసింగ్ కంపెనీల ద్వారా కొనుగోలు చేసి మద్దతుధర లభించేలా చేసింది. అంతర్జాతీయంగా ధరలు పతనమైనప్పటికీ ప్రభుత్వం దగ్గరుండి మరీ అమ్మించడంతో రైతులు గట్టెక్కగలుగుతున్నారు.

– తృవటపల్లి నాగభూషణం, ఆక్వారైతు, చెయ్యేరు, కోనసీమ అంబేడ్కర్ జిల్లా

ప్రభుత్వం అండగా నిలుస్తోంది



అంతర్జాతీయ మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో కౌంట్ ధరలు గణనీయంగా తగ్గినప్పటికీ, రాష్ట్రంలో మాత్రం రైతులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాధికారత కమిటీ ద్వారా రైతులను ఆదుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంటే రొయ్య రైతులను ప్రభుత్వం పట్టించుకోవడంలేదంటూ ఆరోపణలు చేయడం సరికాదు. ఈనాడు కథనంలో చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు.

- కె.కన్నబాబు, రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్

ఆక్వా రైతులను దగా చేసింది చంద్రబాబే

- ఆక్వా రైతును అన్ని విధాలా ఆదుకుంది మా ప్రభుత్వమే..
- అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏనాడూ ఆక్వా రైతులను పట్టించుకోని తెలుగుదేశం పార్టీ నేతలు... ఇప్పుడు వారి పట్ల మొసలి కన్నీరు కారుస్తూ ధర్నాల పేరిట హడావుడి చేయడం విడ్డూరంగా ఉందని ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం విమర్శించారు. మూడేళ్లుగా ఈ రాష్ట్రంలో ఆక్వా రైతుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రంలోని ఆక్వా రైతులందరూ అండగా ఉన్నారన్న విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలన్నారు. ఆయన సోమవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో సంక్షోభంలో చిక్కుకున్న ఆక్వా రంగాన్ని తమ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తూ ఆక్వా రంగం నిలదొక్కుకునేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారని చెప్పారు. టీడీపీ హయాంలో ఏనాడైనా ఆక్వా రంగానికి విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలన్న ఆలోచన చేశారా? అని ప్రశ్నించారు. ఆక్వా ఫీడ్ రేటు పెరిగిన ప్రతిసారీ... రైతుల పక్షాన నిలబడి పెంచిన ధరలను రెండుసార్లు తగ్గించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇటీవల ఫీడ్ రేటు పెరగడంతో పాటు, కౌంట్ ధరలు తగ్గుతున్నాయన్న సమాచారం తెలియగానే రైతులకు అండగా నిలవాలనే లక్ష్యంతో సీనియర్ మంత్రుల నేతృత్వంలో ఎంపవరింగ్ కమిటీ (సాధికారత కమిటీ)ని సీఎం వైఎస్ జగన్ నియమించారని గుర్తుచేశారు. ఈ కమిటీ కృషి వల్లే టన్నుకు పెంచిన రూ.2,600ను ఉపసంహరింపజేసి, అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకుల వల్ల కౌంట్ ధరలు తగ్గిపోయినప్పటికీ రాష్ట్రంలో ఎక్కడా 100కౌంట్ రూ.210కు తక్కువ కాకుండా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. అసలు ఆక్వా జోన్ చిచ్చు పెట్టింది చంద్రబాబేనని, ఆ సమస్యను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండిలో పార్టీ కార్యకర్తలతో మీటింగ్ పెట్టి, వారిని ఆక్వా రైతులుగా నమ్మించేందుకు ప్రయత్నించడం, వారితో ధర్నాల పేరిట హడావుడి చేయడం తగదన్నారు. కోవిడ్ సమయంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతుల పక్షాన నిలబడకపోయినా, సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం మాత్రం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అన్ని విధాలా అండగా నిలిచిందని రఘురాం వివరించారు.

మొక్కలు నాటిన సీజే, న్యాయమూర్తులు



హైకోర్టు వద్ద ఉసిరి మొక్క నాటిన సీజే జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

సాక్షి, అమరావతి: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, పలువురు న్యాయమూర్తులు సోమవారం హైకోర్టు వద్ద మొక్కలు నాటారు. ఉసిరి మొక్క నాటిన సీజే దానికి పూజలు చేశారు. ఆచార్య రామానుజం సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నిర్వాహకులు ఒక్కో మొక్కను ఒక్కో న్యాయమూర్తి పేరు మీద నాటించారు. జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్, జస్టిస్ కుంభజడల మన్మథరావు, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ టి.రాజశేఖర్‌రావు, జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మొక్కలు నాటారు.

హైకోర్టు న్యాయ పరిధికి మించి వ్యవహరించింది

- శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల పరిధుల్లో జోక్యం
- సుప్రీం కోర్టులో ఏపీ తరఫున మాజీ ఏజీ కేకే వేణుగోపాల్
- 28న వాదనలు వింటామన్న ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: మూడు రాజధానులపై ఏపీ హైకోర్టు న్యాయ పరిధికి మించి వ్యవహరించిందని, హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఏపీ తరఫు సీనియర్ న్యాయవాది, మాజీ అటార్నీ జనరల్ (ఏజీ) కేకే వేణుగోపాల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు రాజధానుల ఏర్పాటు, రాష్ట్ర విభజనకు సంబంధించి దాఖలైన పిటిషన్లు సోమవారం జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ హృషీకేశ్‌రాయ్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. ఈ సందర్భంగా రాష్ట్ర విభజన, మూడు రాజధానులు రెండూ వేర్వేరు అంశాలని సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అసలు పిటిషన్లు ఎన్ని? అంశాలు ఎన్ని.. అని ధర్మాసనం ప్రశ్నించింది. విభజన చట్టంపై 28 పిటిషన్లు, రాజధానుల ఏర్పాటు అంశంపై ఎనిమిది దాఖలయ్యాయని న్యాయవాదులు తెలిపారు. విభజన చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌తో కలిపి మిగిలిన వాటిని విచారిస్తామని మాజీ సీజేఐ జస్టిస్ యు.యు.లలిత్ తెలిపారని రైతుల తరఫు సీనియర్ న్యాయవాది ఫాలీ నారీమన్ చెప్పారు. ఫిర్యాదులేమిటని ధర్మాసనం ప్రశ్నించగా.. మూడు రాజధానుల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్న తర్వాత హైకోర్టు తీర్పు ఇచ్చిందని వేణుగోపాల్ తెలిపారు. న్యాయ పరిధికి మించి హైకోర్టు వ్యవహరించిందన్నారు. ఇది శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల పరిధుల్లో హైకోర్టు జోక్యం చేసుకొనే విధంగా ఉందన్నారు. శాసన వ్యవస్థ ఫలానా పని చేయకూడదని హైకోర్టు, సుప్రీంకోర్టు చెప్పరాదన్నారు. ఇదే ప్రధానమైన ఫిర్యాదు అని వేణుగోపాల్ తెలిపారు. పిటిషన్లు వేర్వేరుగా విచారించాలని కోరారు. కేకే వేణుగోపాల్ వాదనలను రైతుల తరఫు మరో సీనియర్ న్యాయవాది శ్యాం దివాన్ విభేదించారు. మూడు రాజధానులపై చట్టాన్ని ఉపసంహరించుకున్న తర్వాత ఇలా చేయండి.. అలా చేయండని హైకోర్టు చెప్పడం సరికాదని ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ తెలిపారు. రాజధానిని నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పులో అంశాలు చదివారు. హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరారు. అన్ని పక్షాల న్యాయవాదుల అభిప్రాయాలు తెలుసుకున్న ధర్మాసనం... విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. రెండు అంశాల పైనా వేర్వేరుగా వాదనలు వింటామని చెప్పింది.

సీఆర్‌డీఏ చట్టబద్ధత పిల్‌పై కౌంటర్ దాఖలు చేయండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ధర్మాసనం ఆదేశం
- విచారణ డిసెంబరు 12కి వాయిదా

సాక్షి, అమరావతి: ఏపీ సీఆర్‌డీఏ చట్టం చట్టబద్ధతను సవాలు చేస్తూ 2015లో దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు స్పందించింది. ఈ వ్యాజ్యంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 12వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ సీఆర్‌డీఏ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ విశ్రాంత న్యాయమూర్తులు జస్టిస్ ఎ.గోపాలరావు, జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి, ప్రముఖ జర్నలిస్ట్ ఏబీకే ప్రసాద్, సీనియర్ న్యాయవాది సి.సదాశివరెడ్డి ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం, 2013 భూసేకరణ చట్టం నిబంధనలకు విరుద్ధంగా సీఆర్‌డీఏ చట్టం ఉందని, అందువల్ల దాన్ని రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరారు. అంతేకాకుండా శివరామకృష్ణన్ నివేదికకు విరుద్ధంగా ప్రభుత్వం రాజధానిని నిర్ణయించిందని వారు పేర్కొన్నారు. జస్టిస్ గోపాలరావు మృతి చెందడంతో ఆయన పేరును, జస్టిస్ లక్ష్మణరెడ్డి రాష్ట్ర లోకాయుక్తగా నియమితులు కావడంతో ఆయన పేరును పిటిషనర్ల జాబితా నుంచి తొలగించాలంటూ ఈ ఏడాది రెండు అనుబంధ వ్యాజ్యాలు దాఖలయ్యాయి. సీజే ధర్మాసనం సోమవారం ఈ పిల్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది విరూపాక్ష వివేకానంద వాదనలు వినిపిస్తూ.. సీఆర్‌డీఏ చట్టబద్ధతను హైకోర్టు తేల్చలేదని అన్నారు. సీఆర్‌డీఏ చట్టం ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని మాత్రమే ఆదేశించిందని చెప్పారు. చట్టబద్ధతను తేల్చాల్సి ఉన్నందున ఈ వ్యాజ్యంలో తాము చేసిన అభ్యర్థనలు మనుగడలో ఉన్నట్లేనని వివేకానంద తెలిపారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. అమరావతి విషయంలో తామిచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్నందున, కొంత కాలం వేచి చూద్దామని తెలిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది.

మా ఉత్తర్వులను ఎందుకు ఉల్లంఘించారు?

- రొయ్యల చెరువు ధ్వంసంపై హైకోర్టు ఆగ్రహం

సాక్షి, అమరావతి: కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా రొయ్యల చెరువులను ధ్వంసం చేసిన వ్యవహారంలో నెల్లూరు జిల్లా అప్పటి అటవీ అధికారి (డీఎఫ్‌వో) మంగమ్మ, రేంజ్ అధికారి మారుతి ప్రసాద్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఎందుకు వ్యవహరించారో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 15కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాద్‌రావు సోమవారం ఉత్తర్వులిచ్చారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోడూరులో 20 ఎకరాల రొయ్యల చెరువును ధ్వంసం చేసేందుకు అటవీ రేంజ్ అధికారి ఇచ్చిన నోటీసును సవాలు చేస్తూ వీరబోయిన గంగాధర్ 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు.. చట్టం ప్రకారం రేంజ్ అధికారి జారీ చేసిన నోటీసు చెల్లదంటూ దాన్ని రద్దు చేశారు. అయినా అప్పటి డీఎఫ్‌వో, రేంజ్ అధికారి కలిసి తన రొయ్యల చెరువును ధ్వంసం చేశారంటూ గంగాధర్ కోర్టు ధిక్కార వ్యాజ్యం దాఖలు చేశారు.

జల ఒప్పందాలను తెలంగాణ ఉల్లంఘిస్తోంది

- సుప్రీంకోర్టులో ఏపీ తరఫు న్యాయవాది జయదీప్ గుప్తా
- శ్రీశైలం జలాల వినియోగంపై తెలంగాణ, టీఎస్ జెన్‌కో, కేంద్రం, కేఆర్‌ఎంబీకి నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా జలాల వినియోగానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ సీటీ రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ జెన్‌కో, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ)లకు నోటీసులు జారీ చేసింది. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర విభజన తర్వాత 2015లో కుదిరిన జల ఒప్పందాలను తెలంగాణ ఉల్లంఘిస్తోందన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి కృష్ణా జలాల వాడకానికి జీవోలు విడుదల చేసిందన్నారు. దీనివల్ల ఏపీకి కలుగుతున్న నష్టాన్ని వివరించారు. ఏపీ సమ్మతి లేకుండానే జల విద్యుదుత్పత్తికి తెలంగాణ ప్రభుత్వం నీరు విడుదల చేసిందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని నదీ జలాలు, ప్రాజెక్టుల నిర్వహణపై కేంద్రం నదీ యాజమాన్య బోర్డులు ఏర్పాటు చేసిందన్నారు. జలాశయాలకు సంబంధించిన వివరాలు ఏపీ ప్రభుత్వం కేఆర్‌ఎంబీకి అప్పగించిందని, తెలంగాణ అప్పగించలేదని జయదీప్ గుప్తా తెలిపారు. బోర్డు అధికారాలపై ధర్మాసనం ఆరా తీయగా.. జలాశయాలు, హెడ్‌వర్క్స్, కాలువలు, ప్రాజెక్టులు... ఇలా అన్నింటినీ బోర్డు నియంత్రిస్తుందని తెలిపారు. తెలంగాణ నుంచి పురోగతి ఏమిటని ధర్మాసనం ప్రశ్నించగా... కేంద్ర మంత్రి చైర్‌పర్సన్‌గా ఉన్న అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లామని వైద్యనాథన్ తెలిపారు. ఇరు పక్షాల వాదనల అనంతరం బోర్డు ఏర్పడిన తర్వాత పురోగతిపై కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ జెన్‌కో, కేఆర్‌ఎంబీలకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో సమాధానం ఇవ్వాలని, తదుపరి రెండు వారాల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని పేర్కొంది. జనవరి రెండో మంగళవారానికి విచారణ వాయిదా వేసింది.

'పరివర్తన' ఫలించేలా



సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

దూరంగా ఉంటారన్నారు. ఏజెన్సీలో గంజాయి నిర్మూలనతోపాటు ఉపాధి మార్గాలు కల్పించాలని సూచించారు. ఇంకా ఎక్కడైనా, ఎవరైనా అర్హులు మిగిలిపోతే తనిఖీ చేసి వారికి కూడా ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు అందించాలని ఆదేశించారు. తద్వారా పట్టాలు అందుకున్న రైతులకు రైతు భరోసా సాయం లభిస్తుందన్నారు. వారికి విత్తనాలు, ఎరువులు అందించే కార్యక్రమాలు కూడా చేపట్టాలని సూచించారు. అప్పుడే ఆశించిన స్థాయిలో మార్పు వచ్చి అక్రమ మద్యం, గంజాయి సాగు నుంచి దూరం అవుతారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

మరింత సౌలభ్యంగా పన్ను చెల్లింపులు

పన్ను చెల్లింపులకు సంబంధించి వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మరింత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి జగన్ సూచించారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో స్నేహపూర్వక వాతావరణం ఉందన్న విషయాన్ని పన్ను చెల్లింపుదారులకు వివరించాలన్నారు. చెల్లింపుల ప్రక్రియను మరింత సులభతరం చేయాలన్నారు. అవగాహన పెంపొందించి అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. దీనివల్ల చెల్లింపులు సకాలంలో జరుగుతాయని, పన్ను కట్టేవారికి కూడా చక్కటి సేవలు అందుతాయని సీఎం జగన్ పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడే ఏజెన్సీల పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తూ అందుబాటులో ఉన్న సమాచారం మేరకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రేడ్ అడ్వైజరీ కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

నిర్వహణలో లేని గనులపై దృష్టి

గనుల శాఖ కార్యకలాపాలపై సమీక్ష సందర్భంగా నిర్వహణలో లేని గనులపై దృష్టి పెట్టాలని సీఎం జగన్ ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న మైనింగ్ ఏరియాలో కార్యకలాపాలు మొదలయ్యేలా చూడాలని సూచించారు. సమీక్షలో విద్యుత్, అటవీ పర్యావరణ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీఎస్ సమీర్ శర్మ, అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషల్ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, ఆర్థికశాఖ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్, రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ గిరిజా శంకర్, సీఐడీ ఏడీజీ పీవీ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలపై..

రిజిస్ట్రేషన్ శాఖ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి జగన్ సమీక్షిస్తూ శాశ్వత భూహక్కు, భూసర్వే కార్యక్రమం చేపడుతున్న చోట్ల సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలపై విస్తృత అవగాహన కలిగించాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ఈ దిశగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సచివాలయాల పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఎలాంటి డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్న అంశాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను అప్‌గ్రేడ్ చేయాలని ఆదేశించారు.

2024లో చంద్రబాబు, లోకేశ్ గెలవలేరు

- సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శం
- కుటిల రాజకీయ పార్టీలైన టీడీపీ, జనసేనకు రాష్ట్రంలో స్థానం లేదు
- రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం చంద్రబాబా? పవనా?
- వైఎస్సార్‌సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్



సాక్షి, అమరావతి: వచ్చే 2024 ఎన్నికల్లో చంద్రబాబు కుప్పంలో, లోకేష్ మంగళగిరిలో గెలిచే పరిస్థితి లేదని, వారికి రాజకీయ భవిష్యత్తే లేదని వైఎస్సార్‌సీపీ చీరాల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ చెప్పారు. పద్నాలుగేళ్లు అధికారంలో ఉండి, రాష్ట్రాన్ని ఏ విధంగా పరిపాలించాలో కనీసం అవగాహన లేని నాయకుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదిస్తున్నారని చెప్పారు. అధికారం లేదన్న ఒకే ఒక్క అక్కసుతో చంద్రబాబు, ఎల్లో మీడియా, పవన్ కల్యాణ్ కలిసి సీఎం జగన్ ప్రజా ప్రభుత్వంపై కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, వచ్చే ఎన్నికల్లో జగన్‌కే అధికారం తథ్యమని చెప్పారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ బడుగు, బలహీనవర్గాలు... పార్టీలు, కుల, మతాలకతీతంగా లబ్ధి పొందారని అన్నారు. ఒక్క డీబీటీ ద్వారానే పేద కుటుంబాలకు రూ.1.75 లక్షల కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేశారని, దేశ చరిత్రలో ఇదొక అరుదైన రికార్డని చెప్పారు. సచివాలయాల వ్యవస్థతో లక్షలాది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించారని, అద్భుతమైన సంస్కరణలు తెచ్చారని తెలిపారు.

పొత్తుల కోసం విపక్షాల వెంపర్లాట

సీఎం జగన్‌ను ఢీకొని 2024 ఎన్నికల్లో గెలవలేమని భావించి, ప్రతిపక్షాలు పొత్తుల కోసమని వెంపర్లాడుతున్నాయని అన్నారు. 2014 నుంచి పొత్తులపై ప్రజల ముందు ఒక రకంగా, వెనకాల ఒక రకంగా నాటకాలాడుతున్నాయన్నారు. పొత్తు విషయం కూడా బయటకు చెప్పే దమ్ముధైర్యం వారికి లేదన్నారు. అసలు రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం చంద్రబాబో, పవనో చెప్పాలని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలే తప్ప, తమకు పార్టీలు, రాజకీయాలు ముఖ్యం కాదని ప్రధాని మోదీ ముందే కుండబద్దలు కొట్టినట్టు చెప్పిన మగాడు సీఎం జగన్ అని తెలిపారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ చంద్రబాబుకు ఈ గట్స్ ఉన్నాయా? ఉంటే 175 స్థానాల్లో టీడీపీ ఒంటరిగా పోటీ చేస్తుందని చెప్పాలని సవాల్ చేశారు.



అత్యధిక మంది భాగం అయినంత మాత్రాన తప్పు తప్పకుండా పోదు.
- లియో టాల్‌స్టాయ్

సాక్షి
మంగళవారం, నవంబర్, 15

ఈ మార్పులు మంచికేనా?

ఎక్కడైనా, ఎప్పుడైనా.... కాలాన్ని బట్టి నియమ నిబంధనల్ని మార్చాల్సిందే. కానీ, కొత్త నియమ నిబంధనలు పురోగమింపజేస్తాయా, తిరోగమింపజేస్తాయా అన్నదే కీలకం. విశ్వవిద్యాలయాల్లో పరిశోధనకు సంబంధించిన డాక్టోరల్ డిగ్రీల రూల్స్‌లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చేసిన సమూలమార్పులు ఇప్పుడు అదే చర్చకు దారి తీస్తున్నాయి. ఎంఫిల్ కోర్సుల రద్దు, పీహెచ్‌డీ రావడానికి చేయాల్సిన కోర్స్‌వర్క్‌ను సడలించడం, నాలుగేళ్ళ డిగ్రీ కోర్స్ చేసిన వెంటనే పీహెచ్‌డీలో పేరు నమోదుకు అనుమతించడం లాంటి మార్పులపై భిన్నాభిప్రాయాలున్నాయి. యువ విద్యార్థులను మరింతగా పరిశోధన వైపు ఆకర్షించడానికే ఈ చర్య అని యూజీసీ చెబుతోంది. కానీ ఆచరణలో ఇది ప్రమాణాల క్షీణతకూ, పర్యవేక్షకుల కొరతకూ దారితీస్తుందనే వాదన బలంగా వినపడుతోంది.

నిజానికి యూజీసీ 2009లో, తర్వాత 2016లో కొన్ని నియమాలు పెట్టింది. వాటి స్థానంలో కొత్తవాటిని ఈ నెల 7న వెల్లడించింది. ఈ కొత్త 'యూజీసీ (పీహెచ్‌డీ కనీస ప్రమాణాలు, విధానాల) నిబంధనలు 2022' వల్ల పీహెచ్‌డీ చేయడానికి అర్హత నుంచి ప్రవేశ విధానం, మూల్యాంకన పద్ధతుల దాకా అన్నీ మారనున్నాయి. మునుపటి నిబంధనల కింద అనుమతి లేని వర్కింగ్ ప్రొఫెషనల్స్ పార్ట్‌టైమ్ పీహెచ్‌డీలకు సైతం పచ్చజెండా ఊపారు. మాస్టర్స్ డిగ్రీ ఒక ఏడాది (2 సెమిస్టర్లు) చదివినా, లేక నాలుగేళ్ళ (8 సెమిస్టర్ల) బ్యాచలర్ డిగ్రీలో కనీసం 75 శాతం మార్కులు సాధించినా పీహెచ్‌డీలో చేరవచ్చు. ఎప్పటిలానే నెట్/ జేఆర్ఎఫ్ అర్హతలు, ప్రవేశపరీక్షలతో ప్రవేశాలు చేసుకోవచ్చు. అయితే పీహెచ్‌డీ ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశపరీక్ష చర్చను ప్రస్తావించకుండా వదిలేశారు.

పీహెచ్‌డీ చేస్తున్నవారు తప్పనిసరిగా ప్రత్యేక జర్నల్స్‌లో కనీసం ఒక పరిశోధనా పత్రాన్ని ప్రచురించాలనీ, సదస్సుల్లో కనీసం రెండు పత్రసమర్పణలు చేయాలనీ పాత నిబంధనలు. ఆ రెండూ ఇక తీసేశారు. ఇప్పటి దాకా పరిశోధనకు ప్రవేశద్వారంగా ఉన్న ఎంఫిల్ కోర్సును 'జాతీయ విద్యావిధానం' సిఫార్సుకు అనుగుణంగా ఎత్తేశారు. ఇవన్నీ పరిశోధనలో నాణ్యతను దెబ్బతీస్తాయనేది విద్యావేత్తల్లో ఒక వర్గం ఆందోళన. మరో వర్గం మాత్రం తప్పనిసరి తద్దినంగా మారిన పత్రాల నిబంధనల్లో పలు లోపాలున్నాయనీ, వాటితో ప్రయోజనం లేదు గనక ఎత్తేయాలన్న నిర్ణయం సరైనదేననీ అంటోంది. అసలీ పత్రాల ప్రచురణ అంశంపై యూజీసీ చాలాకాలంగా తర్జనభర్జన పడుతోంది. పరిశోధక విద్యార్థుల నుంచి రుసుము వసూలు చేసి, పత్రాలను ప్రచురించే 'దోపిడీ జర్నల్స్', గ్రంథచౌర్యం పెరగడంతో సమస్య వచ్చిపడింది.


విశ్వవిద్యాలయ పత్రాల్లో నూటికి 75 'స్కోపస్' గుర్తింపు పొందని జర్నల్స్‌లోనే ప్రచురితమవుతున్నాయనేది ఒక అధ్యయనం. అందుకే, ఆ తరహా జర్నల్స్‌లో, వాటి ప్రచురణకర్తలు పెట్టే సదస్సుల్లో ఇచ్చిన పత్రాలను పరిగణనలోకి తీసుకోరాదని 2019లోనే యూజీసీ ప్యానెల్ సిఫార్సు చేసింది. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడ్డ విద్యార్థులకు విస్తృత సంబంధాలు, ఆర్థిక స్థోమత ఉండవు గనక అలాంటి దోపిడీ జర్నల్స్‌కు అడ్డుకట్ట వేయాల్సిందే. రిసెర్చ్ స్కాలర్లపై ఒత్తిడిని తగ్గించాల్సిందే. కానీ, ప్రత్యామ్నాయం చూడకుండా, పత్రాలే అక్కర్లేదనడం వివేకవంతమేనా? మన దగ్గర ఇప్పటికీ విద్యార్థులు ఎక్కువ, నాణ్యమైన జర్నల్స్ తక్కువ. ఇదో పెనుసమస్య. ప్రపంచ పరిశోధకుల్లో 12 శాతం మంది మనవాళ్ళే అయినా, భారత పరిశోధనా పత్రాలు 4.52 శాతమేనట. 2020 నాటి స్కోపస్ శాస్త్రీయ ప్రచురణల డేటాబేస్ తేల్చింది.

ఆచరణలో లోపాలున్నా, పత్రాల ప్రచురణ ఆలోచన అసలంటూ మంచిదే. ఐఐటీల్లో పత్రాల ప్రచురణ తప్పనిసరి కాకున్నా నాణ్యమైన పరిశోధన సాగుతోందంటే ఆచార్యులు, విద్యార్థుల నిబద్ధతే కారణం. అలాంటి వాతావరణం కరవైన విశ్వవిద్యాలయాల్లో ఇప్పుడిక పత్రాలు లేకుండానే పరిశోధనాసక్తి, ప్రమాణాలు తగ్గకుండా ఎలా చూస్తారు? అలాగే, డిగ్రీ అవుతూనే పీహెచ్‌డీలో చేరిన విద్యార్థికి పరిశోధనా జ్ఞానం ఎలా ఉంటుంది? పీజీ చేసి, ఎంఫిల్‌లో మౌలిక పరిశోధనా పద్ధతులు తెలుసుకున్నాక ఆసక్తితో పీహెచ్‌డీ చేయడం వేరు. పరిశోధనలో ఓనమాలు తెలియకుండా డిగ్రీ అవుతూనే పీహెచ్‌డీలోకి దిగడం వేరు. అలా దిగినా, ఆరేళ్ళ నిర్ణీత వ్యవధిలో తొలి ఏళ్ళన్నీ పరిశోధనా పద్ధతులు తెలుసుకోవడానికే ఖర్చయిపోతుంది. అలాగే, పత్రసమర్పణ, ప్రచురణ తప్పనిసరి కానప్పుడు విద్యార్థులకు లోతైన అధ్యయనానికి ప్రేరణ లేకుండా పోయే ప్రమాదమూ ఉంది.

పరిశోధనను సైతం మామూలు చదువులంత తేలిగ్గా తీసుకోవడం మన దగ్గరే. మొదట్లో 1920లలో మన దగ్గర కొన్ని డజన్ల మందే పీహెచ్‌డీ స్కాలర్లుండేవారు. కానీ, ఇవాళ అమెరికాలో ఏటా 64 వేలకు పైగా డాక్టరేట్లు వస్తుంటే, 24 వేల మంది పీహెచ్‌డీ స్కాలర్లతో మనం ప్రపంచంలో 4వ స్థానంలో ఉన్నాం. 2010తో పోలిస్తే 2017లో పీహెచ్‌డీలో చేరేవారి సంఖ్య రెట్టింపు దాటింది. 2000 నాటికి దేశంలో డాక్టరేట్ ప్రదానం చేసే సంస్థలు 326. తీరా, 2017 కల్లా వాటి సంఖ్య 912. అంటే పీహెచ్‌డీ ఎంత వేలంవెర్రిగా మారిందో అర్థం చేసుకోవచ్చు. ఏటా 60 లక్షల మంది గ్రాడ్యుయేట్లు, 15 లక్షల మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు వస్తున్న దేశంలో నిఖార్సయిన పరిశోధక విద్యార్థుల శాతం ప్రశ్నార్థకమే. ఇప్పటికే నాసిరకమని పేరుపడ్డ మన విశ్వవిద్యాలయ రిసెర్చ్ ప్రమాణాలు మరింత దిగజారడానికి కొత్త నిబంధనలు కారణం కాకూడదు. లోతుగా పునఃపరిశీలన చేసినా తప్పు లేదు. ప్రామాణిక పరిశోధనలకై ఒక అడుగు వెనక్కి వేసినా... ప్రగతికి అది ముందడుగే!

గ్రంథాలయోద్యమంతో భవితకు బాట

సందర్భం



మందపాటి శేషగిరి రావు

అక్షరం ఆకృతి దాల్చిన నాటి నుంచి సామాజిక జీవన వికాసానికీ, సమాజ పురోభివృద్ధికీ పుస్తకాలు సోపానా లయ్యాయి. ఎప్పటికప్పుడు పరిణామక్రమాన్ని ఆవిష్కరిస్తున్నాయి. గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేయటం, నేటి తరా లను గ్రంథాలయాలకు సన్నిహితం చేయటమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ, ప్రతి ఏటా నవంబరు 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్స వాలను నిర్వహిస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వం నిర్లక్ష్యంతో గ్రంథాలయాలు దాదాపు నిర్వీర్యమయ్యే పరిస్థితి వచ్చింది. కనీసం పుస్తకాలు కొనుగోలు చేయాలన్న ఆలోచనను కూడా చేయలేదు. కనీస వసతులు లేకుండా చేశారు. ప్రధాన ఆదాయ వనరైన గ్రంథా లయ సెస్‌ని కూడా రాకుండా చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019లో అధి కారం చేపట్టిన తర్వాత గ్రంథాలయాల స్వరూపమే మారిపోయింది. విద్యావ్యవస్థలో సమూల మార్పులను తెచ్చి 'నాడు–నేడు'తో అట్టడుగువర్గాల వారికి కూడా కార్పొరేట్ విద్యను ఉచితంగా అందిస్తూ భవిష్యత్తును సువర్ణమయం చేసే క్రమంలో.. జగన్ గ్రంథాలయ వ్యవస్థకి సాంకేతికతను జోడించి 'డిజిటల్ లైబ్రరీ వ్యవస్థ'ను అందుబాటులోకి తెచ్చారు.

వ్యాసకర్త చైర్మన్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్, ఏపీ మొబైల్: 94402 64214

రామోజీ అర్ధసత్యాల 'బీమా' కలాపం...

అనుమానాస్పద ఖాతాల పరిశీలననూ తప్పబడుతూ అడ్డగోలు రాతలు

వారికి ఈ నెల 29వ తేదీన చెల్లింపులు చేస్తామని ఇప్పటికే చెప్పిన సీఎం

అసలు చంద్రబాబునాయుడి హయాంలో మొత్తం ఐదేళ్లలో పంట నష్టపోయినందుకు ఎంతమంది రైతులకు బీమా ఇచ్చారో తెలుసా? కేవలం 30.85 లక్షల మందికి!. మరి వారికిచ్చిన మొత్తమెంతో తెలుసా? కేవలం 3,411.20 కోట్లు!. అది కూడా... ఐదేళ్లూ కరువుతో అల్లాడిన రాష్ట్రంలో. నిజానికి కరువు పరిస్థితులున్నపుడు దెబ్బతినే పంట ఎక్కువుంటుంది. అయినా సరే.. బాబు రైతులకిచ్చిన పరిహారం ఇంతే!!.

ఈ ప్రభుత్వ పనితీరును పోల్చాలంటే గత ప్రభుత్వంతోనే కదా? అంతకన్నా మెరుగ్గా చేశారా లేదా అన్నదే కదా ప్రామాణికం. ఎందుకంటే వై.ఎస్.జగన్ సర్కారు బాధ్యతలు చేపట్టిన తొలిరోజు నుంచీ చక్కని వర్షాలు పడ్డాయి. పంటలూ విరగపండాయి. మునుపటితో పోలిస్తే నష్టం తక్కువ జరిగినా... ప్రతి ఎకరాన్నీ పరిగణనలోకి తీసుకోవటంతో... గడిచిన మూడున్నర ఏళ్లలో ఏకంగా 44.66 లక్షల మందికి బీమా పరిహారమిచ్చింది ఈ సర్కారు. వారికి చెల్లించిన మొత్తం ఏకంగా రూ.6684.84 కోట్లు. ఈ రెండింటికీ అసలు ఏ కొంచమైనా పోలిక ఉందా? మరి గతంలో దరఖాస్తులు పెట్టుకున్న వారికి కూడా బీమా పరిహారం చెల్లించలేదని రైతుల తరఫున ఒక్క అక్షరమైనా 'ఈనాడు' రాసిందా? ఎందుకు పెన్నెత్తలేదు రామోజీ? ఇప్పుడెందుకు ఇంత మేలు చేస్తున్న ప్రభుత్వంపై అదేపనిగా బురద జల్లుతున్నారు? 'బీమా ఆశలపై నీళ్లు' అంటూ సోమవారం పతాక శీర్షికల్లో అచ్చేసిన కథనం దేనికి చిహ్నం? గత ప్రభుత్వం కన్నా ఎందులోనైనా వెనకబడితే అడిగినా తప్పులేదు!. కానీ పోలికే లేని విధంగా మూడున్నరేళ్లలో నాటి ప్రభుత్వం ఐదేళ్లలో చెల్లించిన బీమా మొత్తానికి దాదాపుగా రెట్టింపు పరిహారం చెల్లించిన ఈ ప్రభుత్వాన్ని విమర్శించటం తగునా రామోజీ? అసలు 'ఈనాడు' రాసిన రాతల్లో ఏది నిజం?

నాడు... రైతులే బీమా ప్రీమియం చెల్లించాలి

విశేషమేంటంటే చంద్రబాబునాయుడి హయాంలో రైతులే బీమా ప్రీమియం చెల్లించాలి. చెల్లించినా కూడా వారికి పరిహారం వస్తుందన్న గ్యారెంటీ లేదు. ఎందుకంటే దిగిపోతూ దిగిపోతూ రైతులకిచ్చే పరిహారంలో ఏకంగా రూ.715 కోట్ల బకాయిలు పెట్టి మరీ దిగిపోయిన చరిత్ర చంద్రబాబుది. దాన్నికూడా ఏనాడూ 'ఈనాడు' ప్రశ్నించలేదు. అప్పట్లో చాలామంది రైతులు ప్రీమియం చెల్లించలేకుంటే వారిని నారా వారు పట్టించుకోలేదు. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క రైతూ నష్టపోకూడదనే ఈ–క్రాప్ వ్యవస్థను తెచ్చింది. ఈ–క్రాప్‌లో నమోదైన నోటిఫైడ్ పంటలు ప్రతి ఎకరాకీ ఆటోమేటిగ్గా బీమా అమలవుతుంది. ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. పైపెచ్చు ఎప్పటికప్పుడు సోషల్ ఆడిట్‌లో భాగంగా ఆర్బీకేల్లో పేర్లు ప్రదర్శించటం... పేర్ల నమోదులో తేడాలుంటే సరిదిద్దటం చిత్తశుద్ధితో చేస్తోంది. అందుకే రైతుల్లో ఆ సంతృప్తి!. దాన్ని అసంతృప్తిగా చిత్రీకరించడానికి రామోజీ చేస్తున్న అక్షర విధ్వంసంలో భాగమే తాజా కథనం.

రబీలో పంటనష్టం తక్కువని తెలియదా?

రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని పరిశీలిస్తే రబీలో ప్రకృతి వైపరీత్యాలు అత్యంత అరుదు. మంచు లేదా బోర్లమీదో.. లేకుంటే పక్కా నీటి సరఫరా ఉంటేనే ఈ సీజన్లో పంటలు సాగవుతాయి. వైపరీత్యాలు అత్యంత అరుదు కాబట్టి, పంటల బీమా పరిస్థితులూ సహజంగా రావు. రబీ పంట ఫిబ్రవరి– మార్చి నెలల్లో వస్తుంది కాబట్టి... అప్పటికి వర్షాల సీజన్ కూడా మొదలు కాదు కాబట్టి నష్టమూ తక్కువే. ఒక్క ఖరీఫ్ సీజన్‌లోనే అత్యధిక వర్షపాతం వల్లో... అత్యల్ప వర్షపాతం వల్లో పంటలు దెబ్బతిని బీమా చెల్లించాల్సిన పరిస్థితులు ఉంటాయి. ఖరీఫ్‌లో తెగుళ్లు, ఇతర వ్యాధులు ప్రబలి పంటలు నష్టపోయిన పరిస్థితులు కూడా ఎక్కువే. బాబు హయాంలో ఖరీఫ్‌లోనే పంటల బీమా. రబీలో బీమాయే లేదు. ఈ విషయం ఇటు రామోజీరావుకు గానీ... అటు చంద్రబాబు నాయుడికి గానీ తెలియంది కాదు. అయినా పంట నష్టం జరిగి పరిహారమివ్వకపోతే ప్రశ్నించినా తప్పు లేదు. కానీ బీమా చెల్లించలేదంటూ నిందలేల? రాష్ట్ర ప్రభుత్వమే బీమా కంపెనీని నిర్వహిస్తోంది. నష్టపోయి పరిహారం క్లెయిమ్ చేసిన రైతులకు తనే పరిహారం చెల్లిస్తుంది. మరి ఇందులో బీమా ప్రీమియం అంశం ఎక్కడుంది? ప్రభుత్వమే బీమా కంపెనీ నిర్వహిస్తున్నపుడు రబీ ప్రీమియం గురించి రామోజీకెందుకు అంత ఉలికిపాటు?

టీడీపీ హయాంలో జరిగింది ఇదీ...

చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో సగటున ఏడాదికి 20.28 లక్షల మంది రైతులు, 23.57 లక్షల హెక్టార్లకు మాత్రమే బీమా చేయించుకోగలిగారు. 2014–16 మధ్య వ్యవసాయ బీమా పథకం కింద 5.38 లక్షల మందికి రూ.471.94 కోట్లు, 2016–19 మధ్య పీఎంఎఫ్‌బీవై కింద 25.47 లక్షల మందికి రూ.2939.26 కోట్ల బీమా మొత్తాన్ని అందించారు. మొత్తంగా ఐదేళ్లలో కేంద్ర బీమా పథకాల ద్వారా రూ.3,411.20 కోట్ల పరిహారాన్ని అందించారు. నాటి 'ప్రధాని ఫసల్ బీమా యోజన'లో పంటను బట్టి ప్రీమియాన్ని నిర్ణయించాక... దాన్లో 2 శాతాన్ని రైతులే చెల్లించేవారు. బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులకు బ్యాంకులే ఈ మొత్తాన్ని మినహాయించేసి బీమా చేయించేవి. మిగిలిన రైతులకు బీమా గురించి తెలిసేదే కాదు. ప్రకృతి వైపరీత్యాలతో వారి పంట దెబ్బతింటే... వారికి బీమాయే లేదు కాబట్టి ప్రభుత్వం చేతులెత్తేసేది. బీమా ఉన్నవారికి కూడా ఒక సీజన్లో నష్టం జరిగితే రెండు మూడు సీజన్లు గడిచాక పరిహారం వచ్చేది. కేంద్ర పథకంలోని పరిమితులతో రైతులు నష్టపోతున్నారని భావించిన వై.ఎస్. జగన్ సర్కారు.. నోటిఫైడ్ పంటలు వేసే రైతులందరికీ బీమా వర్తింప చేయాలని డిమాండ్ చేసింది. ప్రీమియం చెల్లించిన వారికేనని కేంద్రం చెప్పడంతో ఆ పథకం నుంచి బయటికొచ్చేసింది. 2019 జూలై 8న డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని తెస్తూ బృహత్తర బాధ్యతను భుజానికెత్తుకున్నారు వైఎస్ జగన్. ఈ–క్రాప్‌ను సమర్థంగా అమలు చేస్తూ... పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతుకూ బీమా వర్తించేలా... ఆర్‌బీకేల్లోనే రసీదు ఇస్తున్నారు. ఆ రసీదు.. ఈ–క్రాప్‌లో నమోదు చేసినట్లు రైతుకిచ్చే అధికారిక గుర్తింపు. దాని ఆధారంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకూ నేరుగా సీజన్ తిరిగి రాకముందే పరిహారం అందుతోంది. ఇందులో రైతు వాటాతో పాటు కేంద్రం వాటానూ రాష్ట్రమే భరిస్తోంది. ఇక ఇన్‌పుట్ సబ్సిడీని ఏ సీజన్‌లో నష్టం జరిగితే.. ఆ సీజన్లోనే చెల్లిస్తున్నారు. ఇలాంటి ప్రక్రియను చరిత్రలో తొలిసారిగా అమలు చేయటంతో పాటు... ఏటా క్యాలెండర్ పెట్టుకుని మరీ రైతులకు డబ్బులు నేరుగా వారి ఖాతాల్లోకి పంపిస్తున్నారు కనకే చంద్రబాబు ప్రభుత్వంతో పోలిస్తే పంటల బీమా పరిధిలోకి వచ్చే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. బీమా పరిధిలోకి వచ్చిన రైతుల సంఖ్యకూడా 3 రెట్లు పెరిగి...
ఇది రైతు ప్రభుత్వమయ్యింది.



బీమా ఆశలపై నీళ్లు

కొత్తగా అర్హీలిచ్చిన రైతులను మొండిచెయ్యి

- 2020-21, 2021-22 రబీ బీమా ఊసేలేదు
- ఉచిత పంటల బీమా అమలు అంతంతే?

ఏది నిజం?

కేంద్రం అభ్యర్థించటంతో...

రాష్ట్ర ప్రభుత్వమే బీమా కంపెనీ పెట్టి... శెహబాష్ అనిపించుకునే రీతిలో నడుపుతూ ఏ ఒక్క రైతుకూ నష్టం జరగకుండా చూడటంతో కేంద్రం దిగి వచ్చిందనే చెప్పాలి. కొన్నాళ్ల కిందట కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ నేరుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఫోన్ చేశారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఫసల్ బీమా యోజనలో భాగస్వామి కావాలంటూ ఆయనే అభ్యర్థించారు. దాన్లో ఉన్న ఇబ్బందులను, చేయాల్సిన మార్పులను ముఖ్యమంత్రి పూర్తిగా వివరించటంతో... కేంద్ర బృందం రాష్ట్రానికి వచ్చింది. ఇక్కడ అమలవుతున్న ఉచిత పంటల బీమా పథకాన్ని అధ్యయనం చేసింది. నోటిఫైడ్ పంటలు సాగు చేస్తున్న ప్రతి ఒక్క రైతుకూ ఆటోమేటిగ్గా బీమా వర్తింప చేసేలా ఫసల్ బీమా యోజనలో కొన్ని మార్పులను సీఎం వైఎస్ జగన్ సూచించారు. ఆయన సూచనల మేరకు రైతులందరినీ బీమా పరిధిలోకి తీసుకొస్తామని, అందుకు ఉన్న అడ్డంకులను తొలగిస్తామని కేంద్రం మాట ఇచ్చింది. ఈ–క్రాప్ డేటా ఆధారంగా ఏపీలో ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తుండగా... ఇదే డేటాను తామూ ప్రామాణికంగా తీసుకుంటామని, నోటిఫైడ్ పంటలు సాగుచేసే రైతులందరికీ వర్తింప చేసేలా ఫసల్ బీమా యోజనలో మార్పులు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చి రాష్ట్రానికి రెడ్ కార్పెట్ వేసింది. దీంతో మళ్లీ కేంద్ర పథకంలో చేరడానికి రాష్ట్రం సుముఖత వ్యక్తం చేసింది. అయితే ఈలోగా తాము ఏర్పాటు చేసిన బీమా కంపెనీకి రెగ్యులేటరీ లైసెన్సు కోసం ప్రయత్నాలను మాత్రం మానలేదు. ఇది కేంద్ర పరిధిలోని అంశం కావటంతో దీనికోసం లేఖలు రాయటంతో పాటు నేరుగా అభ్యర్థిస్తూ ఆ ప్రయత్నాలనూ కొనసాగిస్తూనే ఉంది. 'ఈనాడు'కు మాత్రం ఇవేవీ పట్టవు. కేంద్ర పథకం నుంచి రాష్ట్రం బయటకు వచ్చినపుడు కూడా రామోజీరావు అడ్డగోలు రాతలే రాశారు. ఆ తరవాత మళ్లీ కేంద్ర పథకంలో రాష్ట్రం చేరుతున్నప్పుడు కూడా అడ్డుకోవటానికి శతథా ప్రయత్నిస్తూ విమర్శలే చేశారు. తాజా సీజన్‌కు రాష్ట్రమే ప్రీమియం, పరిహారం చెల్లిస్తుండగా... దానిపైనా అవాస్తవాలకే పట్టం గడుతున్నారు.

బాబు హయాంలో అడిగితే ఒట్టు?

అసలు కేంద్ర పథకంలో లోపాలున్న విషయాన్ని చంద్రబాబు హయాంలో ఒక్కనాడు కూడా రామోజీ ప్రస్తావించలేదు. రాష్ట్రమే నేరుగా అమలు చేయొచ్చుననే ఆలోచన కూడా ఈ గురుశిష్యులకు రాలేదు. అసలు ఖరీఫ్ సీజన్లో జరిగిన నష్టాన్ని మళ్లీ ఖరీఫ్ మొదలు కాకముందే ఇవ్వటమనేది మీ జన్మలో చూశారా రామోజీ? అలాంటి ఆలోచనైనా మీ చంద్రబాబుకు వచ్చిందా? ఇప్పుడెందుకు పనిచేస్తున్న ఈ ప్రభుత్వంపై పసలేని విమర్శలు? రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా వైఎస్సార్ పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నందుకు ఒక్కనాడైనా ప్రశంసిస్తూ ఒక్క అక్షరమైనా రాశారా? జగన్ ప్రభుత్వం చేసే మంచిని చూడకుండా... లేనిపోని విమర్శలకే పరిమితమవుతున్నారెందుకు? మీది ప్రతిపక్ష పాత్రా? లేకపోతే ప్రతినాయకుడి పక్షం వహించే పాత్రా? మీదిప్పుడు రాసే పాత్ర కాబట్టి పాఠకులతో సహా ఎవ్వరికీ సమాధానం ఇవ్వక్కర్లేదనుకోవచ్చు. కానీ మీకు మీరైనా జవాబు చెప్పుకోవాలి కదా?

అనుమానాస్పద ఖాతాలు పరిశీలించొద్దా?

కొన్ని ఖాతాలు అనుమానాస్పదంగా ఉండటంతో వాటిపై పరిశీలన జరపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇదిగో... అలాంటి వారికే రూ.67 కోట్లు ఇవ్వలేదనేది 'ఈనాడు' ఆరోపణ. పత్రికా ముఖంగా ఒక ప్రభుత్వంపై ఆరోపణ చేసేటపుడు అధికారులను అడిగైనా నిజాలు తెలుసుకోవాలి కదా రామోజీ? అనుమానాస్పద ఖాతాలను పరిశీలించాలని అనుకోవటం తప్పా? ఆ పరిశీలన పూర్తయ్యింది. సోషల్ ఆడిట్‌కూడా పూర్తయ్యింది. ఈనెల 29న ఈ డబ్బు ఇవ్వబోతున్నామని స్వయంగా అధికారుల సమీక్షా సమావేశంలోనే ముఖ్యమంత్రి ఇటీవల చెప్పారు. కానీ ఈ విషయం ప్రస్తావించకుండా... పచ్చి అబద్ధాలను వండేశారు రామోజీరావు. రామోజీ, 'ఈనాడు'ది జీవితం అంతా ఇదే బతుకా? కౌలు రైతుల మేలు కోసం సీసీఆర్సీ కార్డులను తీసుకువచ్చిన ప్రభుత్వమిది. గ్రామ సచివాలయాల్లోనే దరఖాస్తు నింపి అన్ని ప్రభుత్వ పథకాలను, సహాయాలను పొందే అవకాశాన్ని వారికి కలిగించిన ప్రభుత్వమిది. అంతేకాదు! ఎక్కువ మంది రైతులు వీటిని వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వమిది.

టీడీపీ హయాంలో చెల్లించిన బీమా ఇదీ..

సీజన్	రైతులు (లక్షల్లో)	లబ్ధి పొందిన మొత్తం (రూ.కోట్లలో)
2014-15	1.03	132.24
2015-16	4.35	339.7
2016-17	8.70	954.75
2017-18	6.77	720.6
2018-19 (ఖరీఫ్-2018)	10	1263.91
మొత్తం	30.85	3411.20

గడిచిన మూడేళ్లలో చెల్లించిన బీమా వివరాలు

సీజన్	రైతులు	బీమా మొత్తం (రూ.కోట్లలో)
గత ప్రభుత్వ బకాయిలు	6,19,641	715.84
ఖరీఫ్-2019-20	9,48,000	1252.18
ఖరీఫ్-2020-21	13,38,000	1739
ఖరీఫ్-2021-22	15,60,703	2977.82
మొత్తం	44,66,344	6684.84


రైతులు చెల్లించిన ప్రీమియం (రూ. కోట్లలో)

సంవత్సరం	ప్రీమియం
2016-17	347.96
2017-18	261.29
2018-19	262.01
2019-20	0.26 (ఇప్పటి నుంచి పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తోంది)
2020-21	---
2021-22	---



కొన్ని సలహాలూ, సంఘటనలూ!

కామెంట్



కరణ్ థాపర్

అత్యున్నత పదవుల్లో ఉన్నవారు తమ బాధ్యతలను ఎలా నిర్వర్తించారో ప్రక టించుకునే తరహా సంప్రదాయం మన దగ్గర పెద్దగా లేదు. మాంటెక్ సింగ్ అహ్లూవాలియా దీనికి ఒక మినహాయింపు. ప్రణాళికా సంఘం డిప్యూటీ చైర్మన్‌గా తన దశాబ్ద కాలపు అనుభవాలను గురించి ఆయన రాశారు. భారత ఉపరాష్ట్రపతిగా తన పదేళ్ల కాలం గురించి హమీద్ అన్సారీ సమగ్రమైన ఇంట ర్వ్యూను ఇవ్వడాన్ని ఎంచుకున్నారు. ఇప్పుడు సి. రంగ రాజన్... రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా, ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా, ఒరిస్సా, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో స్వల్పకాలం పాటు గవర్నర్ బాధ్య తలు నిర్వహించిన తన పదవీ కాలాల గురిం చిన రచనను (ఫోర్క్స్ ఇన్ ద రోడ్: మై డేస్ ఎట్ ఆర్బీఐ అండ్ బియాండ్) ప్రచురించారు. అది ఎన్నో చక్కటి వివరాలతో, సంతోషకరమైన ఉపాఖ్యానాలతో కూడి ఉంది.

భారత రిజర్వ్ బ్యాంక్(ఆర్బీఐ) గవర్నర్‌గా ఉన్నప్పుడు, 1990 నాటి ఆర్థిక సంక్షోభం గురించి ఆయన ఎంతో వివరంగా రాశారు. ఆ సంవత్సరం ఆగస్టు నెలలో నేషనల్ ఫ్రంట్ ప్రభు త్వానికి ఆర్బీఐ లేఖ రాస్తూ, "ఈ సంక్షోభాన్ని అధిగమించ డానికి అంతర్జాతీయ ద్రవ్య సంస్థలను సంప్రదించక తప్పని పరిస్థితి గురించి" పేర్కొంది. కానీ "ప్రభుత్వం తక్షణ చర్య ఏదీ తీసుకోలేదు." ఇది "రాజకీయ నాయకత్వ వైఫల్యమే" అని రంగ రాజన్ అభిప్రాయపడ్డారు. ఆనాటి "పరిస్థితిలోని తీవ్రతను నాటి ప్రభుత్వం గుర్తించకపోవడం, లేదా ఐఎంఎఫ్ (అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ) వద్దకు వెళ్లడానికి సైద్ధాం తికంగా విముఖత ప్రదర్శించడం" వల్ల చర్య తీసుకోవడానికి ప్రభుత్వం తిరస్కరించిందని రంగరాజన్ రాశారు.

ఈ నేపథ్యంలో ఆర్థిక పరిస్థితి "వేగంగా దిగజారి పోయింది" అంటే ఆశ్చర్యపడాల్సింది



సి. రంగరాజన్

ఏమీలేదు. నాలుగు నెలల తర్వాత, "మన నిల్వలు... కేవలం మూడు వారాల దిగుమతులకు మాత్రమే సమానంగా ఉన్నాయి," అని చెబుతూ ఆయన ఇలా కొనసాగిస్తారు: "పరిస్థితి ఎంత తీవ్రంగా ఉండిందంటే, విదేశాల్లో ప్రభుత్వానికి ఉన్న ఆస్తు లను అమ్మివేయాలని కూడా కొంత ఆలోచన సాగింది." అలా అమ్మేయడానికి పరిగణించిన ఆస్తుల్లో జపాన్ రాజధాని టోక్యో లోని భారత రాయబార కార్యాలయం కూడా ఒకటి.

ఈ పరిస్థితుల నేపథ్యంలో రిజర్వు బ్యాంక్ "డిఫాల్టర్‌గా ఉండ టానికి కూడా సిద్ధమైంది... దీన్ని తప్పించుకోవడానికి చివరికి అదీ, ఇదీ అనకుండా ప్రతి విషయం గురించి కూడా ఆలోచించాం" అని రంగరాజన్ నాతో చెప్పారు. ఆ సమ యంలో వారు ఎంపిక చేసు కున్న నిర్ణయాల్లో ఒకటి: 405 మిలియన్ డాలర్ల రుణం పొందడానికిగానూ, భారతదేశ బంగారు నిల్వల్లో 15 శాతం (ఇది 46.91 టన్నులకు సమా నం) తనఖా పెట్టాలనుకోవడం! ఈ రోజు చూస్తే అది పెద్ద మొత్తంగా అనిపించకపోవచ్చు. కానీ ఆ సమయంలో "ఆ సొమ్ము చాలా కీలక మైంది... ఎగవేతను అడ్డుకోవడానికి."

1991 జూలై నాటి మరొక అద్భుతమైన కథ ఈ పుస్తకంలో ఉంది. అది – పీవీ నరసింహారావు ప్రభుత్వం రూపాయి విలువను తగ్గించడం గురించినది. అప్పుడు డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నారు. అది రెండు దఫాలుగా జరిగింది. సి. రంగరాజన్ ఈ రెండో దఫా గురించి ఒక ఆసక్తి కరమైన విషయం వెల్లడించారు.

ఇక్కడ ఒక చిన్న నేపథ్యం గురించి చెప్పాల్సిన అవసరం ఉంది. తొలి విడత రూపాయి విలువను తగ్గించిన తర్వాత, దానిపై వచ్చిన తీవ్రమైన రాజకీయ ప్రతిస్పందన చూసి ప్రధాని నరసింహా రావు విశ్వాసం సన్నగిల్లింది. దీంతో రెండో దఫా రూపాయి విలువ తగ్గింపును వాయిదా వేయాలని మన్మోహన్ సింగ్‌ను కోరారు. ఆ సందర్భంలో రంగరాజన్ చెప్పిన విషయా నికి చాలా ప్రాముఖ్యం ఉంది.

రూపాయి విలువను రెండో దఫా తగ్గించిన రోజున (1991 జూలై 3) ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్ నుంచి ఉదయం 9.30 గంటలకు రంగరాజన్‌కు ఫోన్ కాల్ వచ్చింది. "పరిస్థితి ఎలా ఉంది?" అని మన్మోహన్ అడిగితే, "నేను జంప్ చేశాను"అని రంగరాజన్ సింపుల్‌గా చెప్పేశారు. దాంతో మన్మోహన్ "అయితే సరే" అని చెప్పి సంభాషణను ముగించారు. ఆనాటి తన సమాధానం గురించి రంగరాజన్ నాకు చెబుతూ, రూపాయి విలువను తగ్గించడానికి ఆర్బీఐ కోడ్ భాష వాడిందని వివరించారు. ఆ కోడ్ ఏమిటంటే 'హాప్, స్కిప్, అండ్ జంప్'. 'నేను జంప్ చేశాను' అనే సమాధానానికి "రెండో దశ రూపాయి విలువ తగ్గింపు ప్రక్రియ పూర్తయిం దనీ, దాన్ని ఇక ఆపలేమనీ" అర్థం.

రంగరాజన్ పుస్తకం ఈనాటి గవర్నర్లకు కొన్ని మంచి సలహాలను కూడా ఇది సూచించింది. ఒరిస్సాలో గవర్నర్‌గా ఉన్నప్పుడు భారత రాజకీయ నాయకులపై జ్యోతిష్యం ఎంత బలంగా ప్రభావం వేస్తోందో రంగరాజన్ కనుగొన్నారు. ఆనాడు ఒరిస్సా ముఖ్యమంత్రిగా ఉన్న గిరిధర్ గమాంగ్ కేవలం శుభ ముహూర్తాల్లో మాత్రమే గవర్నర్‌ని కలిసేవారట. "ఉదయం 11.13కు నేను మిమ్మల్ని కలుస్తాను" అని గమాంగ్ అనేవారని ఈ పుస్తకం చెబుతోంది. ముఖ్యమంత్రి చేస్తున్న పనులు గవర్నర్‌కి నచ్చకపోయినట్లయితే, ఆయన లేదా ఆమె ముఖ్య మంత్రితో నేరుగా చర్చించాలనీ, లేదా రాష్ట్రపతికి ఈ వ్యవహారంపై లేఖ రాయవచ్చనీ రంగరాజన్ తన పుస్తకంలో రాశారు. అంతకు మించి తన అసమ్మతిని, వ్యతిరేకతను గవ ర్నర్ బయటకు వెల్లడించకూడదనీ, ప్రజా ప్రదర్శన చేయ కూడదనీ సలహా ఇచ్చారు. ఈ మాటలు మమతా బెనర్జీ గానీ విన్నట్లయితే ఎంతో సంతోష పడతారు!

గతంలో ప్రముఖ రాజకీయ నేతలుగా ఉన్న వ్యక్తులను గవ ర్నర్లుగా నియమించినప్పుడు "కార్యాచరణలోకి దిగాలన్న దురద వారిలో కొన్నిసార్లు స్పష్టంగా కనిపిస్తుంది" అని రంగరాజన్ అంటారు. ఆయన సలహా ఒకటే! అది ఏమిటంటే – "వారు తమ అత్యుత్సాహాన్ని అదుపులో పెట్టుకోవడం తప్పక నేర్చుకోవలసి ఉంది... గవర్నర్లు తమకు గల అధికారాలను మాత్రమే కాకుండా తమ పరిమితులను కూడా అర్థం చేసుకోవలిసి ఉంటుంది."

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: బ.సప్తమి రా.2.18 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: పుష్యమి ప.2.06 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: తె.4.10 నుండి 5.56 వరకు (తెల్లవారితే బుధవారం), దుర్ముహూర్తం: ఉ.8.21 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.27 నుండి 11.17 వరకు, అమృతఘడియలు: ఉ.7.01 నుండి 8.45 వరకు; రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు; యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు; సూర్యోదయం 6.08 ; సూర్యాస్తమయం 5.21.

18వ తేదీ వరకు పలు రైళ్ల రద్దు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): చిన గంజాం-కరవది సెక్షన్‌లో 3వ లైన్ నిర్మాణంలో భాగంగా జరుగుతున్న నాన్ ఇంటర్ లాక్ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. విజయవాడ-ఒంగోలు (07461), ఒంగోలు-విజయవాడ (07576), విజయవాడ-గూడూరు (07500), గూడూరు-విజయవాడ (07458), విజయవాడ-బిట్రగుంట (07978), బిట్రగుంట-విజయవాడ (07977), విజయవాడ-గూడూరు (17260), గూడూరు-విజయవాడ (17259) రైళ్లను సోమవారం నుంచి 18 వరకు రద్దు చేశారు.

సత్యదేవుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



అన్నవరం: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరిపై కొలువైన సత్యదేవుని ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు సుమారు లక్ష మంది సత్యదేవుని దర్శించుకున్నారు. వ్రత మండపాలు, క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. రికార్డు స్థాయిలో 11,200 స్వామివారి వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.1.30 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఈవో సత్యనారాయణ మూర్తి తెలిపారు. 30 వేల మంది భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేశారు.



కాకినాడ జిల్లా దీజేపురంలో మహిళ సందేహాన్ని నివృత్తి చేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



కర్నూలు జిల్లా చెరుకులపాడులో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మన ప్రభుత్వం



పల్నాడు జిల్లా వయ్యకల్లులో వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



ఎన్టీఆర్ జిల్లా మారేమండలో దివ్యాంగుడికి సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

అడవిలో అగ్నిశిఖ



- నల్లమల అభయారణ్యంలో అరుదైన ఔషధి
- ఆయుర్వేద వైద్యంలో అడవి నాభిగా ప్రసిద్ధి



ఆయుర్వేదంలో దివ్యౌషధం

ఆయుర్వేదంలో దీనిని దివ్య ఔషధంగా భావిస్తారు. దీని కాండం, ఆకులు, విత్తనాలు, పండ్లు, పూలు, దుంపలు అన్నీ విషపూరితమైనవే. పాముకాటు, తేలు కాటుకు విరుగుడుగా, చర్మవ్యాధులు, కిడ్నీ సమస్యలు, గాయాలకు మందులుగా వాడతారు. ఉదర క్రిములను బయటకు పంపించే మందుగాను, దీర్ఘకాలిక వ్రణాలు, కుష్టువల్ల కలిగే గాయాలు, మొలలు, పొత్తి కడుపు నొప్పి నివారణకు వినియోగిస్తారు. శరీరానికి బలవర్ధకమే కాక వీర్యవృద్ధికి కూడా ఉపయోగపడుతుంది. ఆత్మన్యూనత లాంటి మానసిక రోగాలతో పాటు, రక్తపోటు లాంటి దీర్ఘకాలిక రోగ నివారణకు దీనిని వినియోగిస్తారు. సుఖవ్యాధుల చికిత్సలోనూ అడవినాభి ఉపయోగపడుతుంది. గర్భధారణ అవకాశాలను పెంచటంలో ఇది బాగా పని చేస్తుందని ఆయుర్వేద వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

పెద్దదోర్నాల (ప్రకాశం): ఆయుర్వేద వైద్యంలో అడవి నాభిగా ప్రసిద్ధి చెందిన అగ్నిశిఖ మొక్కలు నల్లమలలోని వివిధ ప్రాంతాల్లో కనువిందు చేస్తున్నాయి. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండల పరిధిలోని పులిచెరువు, తుమ్మలబైలు తదితర ప్రాంతాల్లో ఈ తీగజాతి మొక్కలు విరివిగా పెరుగుతున్నాయి. అందమైన పుష్పాలతో ఆకట్టుకునే అగ్నిశిఖ మొక్కలు అత్యంత విషపూరితమైనవి. ఇందులో విషపూరితమైన కోల్చీసిన్ అనే ఆల్కలాయిడ్ ఉంటుంది. దీనిని ఇంగ్లిష్‌లో ఫ్లేమ్ లిల్లీ, ఫైర్ లిల్లీ, గ్లోరియసా లిల్లీ అని.. వాడుకలో నాగేటిగడ్డ, నీరుపిప్పిలి అని పిలుస్తుంటారు. ఇవి పక్కనున్న మొక్కలను ఆధారం చేసుకుని పైకి ఎగబాకుతుంటాయి. వీటి పుష్పాలు ఎరుపు, నారింజ, తెలుపు రంగు, పసుపు రంగుల కలబోతగా దర్శనమిస్తాయి.

అడవినాభి అద్భుతమైన ఔషధి

నల్లమల అభయారణ్యంలోని కొన్ని ప్రాంతాల్లో లభించే అడవినాభి అరుదైన ఔషధ గుణాలు ఉన్న మొక్క. దీన్ని పలు పేర్లతో పిలుస్తుంటారు. పాముకాటు, తేలుకాటు, చర్మవ్యాధులు, కిడ్నీ సమస్యలకు సంబంధించిన మందుల తయారీలో ఎక్కువగా వినియోగిస్తారు.

– ఎం.రమేష్, సైంటిస్ట్, బయోడైవర్సిటీ, శ్రీశైలం ప్రాజెక్టు

మాల్దీవుల్లో మల్కాపురం యువకుడు గల్లంతు



ప్రేమ్‌రాజ్ (ఫైల్)

మల్కాపురం(విశాఖ పశ్చిమ): మాల్దీవుల్లో మల్కాపురం యువకుడు గల్లంతైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. విజయవాడకు చెందిన తమ్మిన ప్రేమ్‌రాజ్ (24) కొన్నాళ్ల కిందట తల్లిదండ్రులతో కలిసి విశాఖ వచ్చి, ఇక్కడి మల్కాపురం నగరాలవీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. నెల రోజుల కిందట ప్రేమ్‌రాజ్ మర్చంట్ నేవీలో చేరాడు. విధుల్లో భాగంగా గత శనివారం మాల్దీవులు నుంచి ఐలాండ్‌కు బోటులో ముగ్గురు సిబ్బందితో కలిసి ప్రయాణిస్తున్నాడు. అలల తాకిడికి బోటు బోల్తా పడింది. మిగతా ముగ్గురు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోగా, ప్రేమ్‌రాజ్ గల్లంతయ్యాడు. దీంతో అక్కడి సిబ్బంది అధికారులకు ఘటనపై సమాచారం ఇచ్చారు. గజ ఈతగాళ్లు, ఇతర నేవీ సిబ్బందిచే తీరం వద్ద గాలించినా ఫలితం లేకపోవటంతో సోమవారం ప్రేమ్‌రాజ్ కుటుంబానికి నేవల్ అధికారులు విషయం తెలియజేశారు. దీంతో తల్లిదండ్రులు మల్కాపురం పోలీసులను ఆశ్రయించారు.

పంచారామాల యాత్ర ప్రారంభం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పర్యాటక సంస్థ ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి పంచారామాల స్పెషల్ యాత్ర ప్రారంభమైంది. రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా దేవదాయ శాఖ, ఏపీటీడీసీ గుర్తింపు పొందిన ట్రావెల్ భారత్ సంయుక్తంగా అమరావతి, భీమవరం, పాలకొల్లు, సామర్లకోట, ద్రాక్షారామం యాత్రను అందుబాటులోకి తీసుకొచ్చింది. తొలుత కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాల్లో ప్యాకేజీలను నిర్వహిస్తున్నారు. నాన్ ఏసీ టికెట్ ధర రూ.1600గా నిర్ణయించారు. గైడ్ సౌకర్యం, నదీ స్నానం, శీఘ్ర దర్శనం కల్పించడంతో పాటు ప్రసాదం కూడా అందజేయనున్నారు. ఉమ్మడిగా పంచారామ యాత్రకు వెళ్లేవారికి ప్రత్యేక ఏసీ, నాన్ ఏసీ బస్సు సౌకర్యాలను కల్పించనున్నారు. వివరాలకు 73372 63156, 96669 07789 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు. ఏపీ పర్యాటకంలో తమకు గుర్తింపు ఇచ్చినందుకు ఏపీటీడీసీ ఎండీ కన్నబాబు, ఈడీ మల్ రెడ్డి, దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ ఆజాద్, డిప్యూటీ కమిషనర్ విజయరాజుకు ట్రావెల్ భారత్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

16న డిసెంబర్ నెల వర్చువల్ సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల: భక్తుల సౌకర్యార్థం డిసెంబర్ నెలకు సంబంధించి వర్చువల్ సేవ సంబంధిత దర్శన టికెట్ల కోటాను టీటీడీ నవంబర్ 16న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఇందులో తిరుమల శ్రీవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకార సేవలకు సంబంధించిన వర్చువల్ సేవ, సంబంధిత దర్శన టికెట్లు ఉన్నాయి. తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. 24 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండిపోగా.. ఆదివారం అర్ధరాత్రి వరకు 81,130 మంది స్వామిని దర్శించుకున్నారు. 29,464 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో భక్తులు హుండీలో రూ.4.85 కోట్లు సమర్పించారు. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మహాదీపారాధనతో ప్రకాశించిన సాగరతీరం

- విశాఖలో ఘనంగా టీటీడీ కార్తీక మహాదీపోత్సవం
- కిటకిటలాడిన ఆర్కేబీచ్



బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): విశాఖ సాగరతీరం దీపకాంతులతో ప్రకాశించింది. ఆర్కేబీచ్ భక్తులతో కిటకిటలాడింది. సోమవారం టీటీడీ ఆధ్వర్యంలో మహాదీపోత్సవం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం మూడుగంటలకు శోభయాత్రతో బయలుదేరిన శ్రీవేంకటేశ్వరస్వామి సాయంత్రానికి ఆర్కేబీచ్ ప్రధానవేదిక వద్దకు చేరుకున్నారు. దీపోత్సవంలో పాల్గొన్న భక్తులకు ప్రమిదలు, ఒత్తులు, మండపాలు, తులసి మొక్కలను టీటీడీ సమాకుర్చింది. డాక్టర్ పి.వి.ఎస్.ఎన్.మారుతి స్వాగతం, సందర్భ పరిచయం చేశారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వేదపండితులు శ్రీఫణియాజులు బృందం వేదస్వస్తి వినిపించింది. అనంతరం డాక్టర్ మారుతి దీపప్రాశస్త్యాన్ని వివరించారు. టీటీడీ ఆలయ అర్చకులు వైఖానస ఆగమశాస్త్రబద్ధంగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, శ్రీనివాసార్చన చేశారు. విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. అనంతరం శ్రీమహాలక్ష్మి పూజ చేశారు. భక్తులతో తొమ్మిదిసార్లు దీపమంత్రం పలికిస్తూ సామూహిక లక్ష్మీనీరాజనం సమర్పించారు. భక్తుల గోవిందనామ స్మరణతో విశాఖ సాగరతీరం మారుమోగింది. ఈ సందర్భంగా బాలకొండలరావు నేతృత్వంలో బృందం ప్రదర్శించిన దీపలక్ష్మీనమోస్తుతే నృత్యరూపకం భక్తులను ఆద్యంతం ఆకట్టుకుంది. చివరిగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు గోవిందనామాలు కీర్తిస్తుండగా నక్షత్రహారతి, కుంభహారతి సమర్పించారు.

టీటీడీ హిందూధర్మ ప్రచారం అద్భుతం

ఈ సందర్భంగా విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద స్వామి మాట్లాడుతూ టీటీడీ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున హిందూధర్మ ప్రచారం చేస్తోందని అభినందించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో గిరిజన, వెనుకబడిన ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణంతోపాటు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. భక్తుల చెంతకు భగవంతుడు అన్న నినాదంతో దేశవ్యాప్తంగా శ్రీవేంకటేశ్వర వైభవోత్సవాలు, శ్రీనివాస కల్యాణాలు, కార్తీక దీపోత్సవాలను టీటీడీ నిర్వహిస్తోందని చెప్పారు. రుషికొండలో శ్రీవారి ఆలయం నిర్మించిన తరువాత విశాఖకు అన్ని శుభాలే జరుగుతున్నాయన్నారు. సింహాచలం అప్పన్నతోపాటు తిరుమల శ్రీవారు విశాఖకు విచ్చేశారని, ఇక అందరికీ శుభం జరుగుతుందని పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో శ్రీనివాస కల్యాణాలు

టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ధర్మప్రచారంలో భాగంగా అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఇటీవల శ్రీనివాస కళ్యాణాలు నిర్వహించినట్లు తెలిపారు. వచ్చే మార్చి లేదా ఏప్రిల్ నెలలో జమ్ములో శ్రీవారి ఆలయానికి మహాసంప్రోక్షణ నిర్వహిస్తామని చెప్పారు. స్వామికి వివిధ బ్యాంకుల్లో ఉన్న 15,938 కోట్ల నగదు, 10,258 కిలోల బంగారం డిపాజిట్లకు సంబంధించిన ఇటీవల శ్వేత పత్రం విడుదల చేశామని ఆయన గుర్తుచేశారు. టీటీడీ జేఈవో సదా భార్గవి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస్, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీవేణుగోపాల దీక్షితులు, శ్రీశేషాచల దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపద సంరక్షణకే నగరవనం..

- రాష్ట్ర ముఖ్యఅటవీ సంరక్షణాధికారి వై. మధుసూదనరెడ్డి



కొండవీడు చెరువు ప్రాంతాల్ని పరిశీలిస్తున్న మధుసూదనరెడ్డి


యడ్లపాడు: ప్రాచీన కట్టడాలు, పర్యావరణ సంపద ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి నగరవనం కార్యక్రమాన్ని అటవీశాఖ చేపట్టిందని రాష్ట్ర ముఖ్య అటవీ సంరక్షణాధికారి వై.మధుసూదనరెడ్డి తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అటవీ సంరక్షణాధికారి వై.శ్రీనివాసరెడ్డి, పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్. రామచంద్రరావుతో కలిసి సోమవారం ఆయన కొండవీడును సందర్శించారు. ప్రజల ఉమ్మడి ఆస్తి 'కొండవీడు' అని.. ఆ చారిత్రక ఖజానా భావితరాలకు వారసత్వంగా అందించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. హౌస్ గణేష్‌పాడులోని కొండవీడు రెడ్డిరాజుల వారసత్వ ప్రదర్శనశాలను సందర్శించి ఘాట్‌రోడ్డు మ్యాప్‌ను పరిశీలించి నగర వనం పనుల వివరాలను తెలుసుకున్నారు. కొండవీడులో ఏర్పాటు చేయనున్న సాహస క్రీడలైన రాక్ క్లైంబింగ్, రాప్లింగ్ కృత్యాలను పరిశీలించారు. సందర్శకులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తామని మధుసూదనరెడ్డి చెప్పారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పూర్వ సీఎండీల పేరిట అవార్డులు

- డి.ఆర్.ఆహుజా, డాక్టర్ బి.ఎన్.సింగ్ సేవలకు గుర్తింపు
- 2023 నుంచి విద్యార్థులకు మెరిట్ అవార్డుల ప్రదానం



డి.ఆర్. ఆహుజా



డాక్టర్ బి.ఎన్. సింగ్

ఉక్కునగరం: విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం విశేషంగా కృషి చేసిన ఇద్దరు పూర్వ సీఎండీలు డి.ఆర్.ఆహుజా, డాక్టర్ బి.ఎన్.సింగ్‌ల పేరిట రెండు మెరిట్ అవార్డులు ఏర్పాటు చేశారు. ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన మెకానికల్, మెటలర్జీ బ్రాంచిల్లో ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులకు ఏటా ఈ అవార్డులను అందజేయనున్నారు. 1984–1990 మధ్య సీఎండీగా డీఆర్ ఆహుజా బాధ్యతలు నిర్వహించారు. 1985లో నాటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్లాంట్ నిర్మాణ పనులు ఆపేశారు. ఆ పరిస్థితుల్లో ఆయన నాటి ప్రధాని రాజీవ్ గాంధీని కలిసి ప్లాంట్ భవిష్యత్తును వివరించి ఒప్పించడం ద్వారా తిరిగి నిర్మాణ పనులు పూర్తి చేశారు. 1997తో సీఎండీగా డాక్టర్ బి.ఎన్.సింగ్ బాధ్యతలు చేపట్టారు. అప్పటికే ప్లాంట్ రూ. 4 వేల కోట్ల నష్టాలను చవిచూసింది. సిక్ కంపెనీగా బీఐఎఫ్ఆర్‌కు రిఫర్ చేయబడింది. ఆ పరిస్థితుల్లో ఆయన ప్లాంట్‌కు చెందిన 16 వేల మంది ఉద్యోగులను ఉత్తేజపరచడం ద్వారా లాభాల బాట పట్టించారు. తద్వారా 2022లో స్టీల్ ప్లాంట్ టర్న్ అరౌండ్ సాధించింది. వీరిరువురి సేవలను గుర్తించిన స్టీల్ ప్లాంట్ పూర్వ డైరెక్టర్ (పర్సనల్) వై.ఆర్.రెడ్డి, స్టీల్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ చెరో రూ. 3 లక్షల చొప్పున ఏర్పాటు చేసిన నిధులతో ఏటా ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. 2023 నుంచి విద్యార్థులకు మెరిట్ అవార్డులు అందజేస్తారు.

మన్యం కాఫీకి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

కేంద్ర కాఫీ బోర్డు సమావేశంలో ఎంపీ మాధవి



ఎంపీ మాధవికి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానిస్తున్న కాఫీబోర్డు కార్యదర్శి జగదీష్

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మన్యంలో పండించే ఆర్గానిక్ కాఫీకి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని అరకు ఎంపీ, కేంద్ర కాఫీబోర్డు సభ్యురాలు గొడ్డేటి మాధవి సూచించారు. పాడేరు, అరకు రైతులు పండించే కాఫీకి గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో సోమవారం నిర్వహించిన కేంద్ర కాఫీ బోర్డు సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా కాఫీ బోర్డు కార్యదర్శి, సీఈవో కేజీ జగదీష్ పుష్పగుచ్ఛం అందజేసి ఎంపీకి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. మన్యంలో ఆర్గానిక్ కాఫీ పండిస్తున్న రైతులు మార్కెటింగ్ సౌకర్యం లేక సంతలు లేదా ఇతర ప్రాంతాల్లో దళారులను నమ్మి మోసపోతున్నారని చెప్పారు. అరకు కాఫీని ఇతర మండలాల్లో ప్రత్యేక ట్యాగ్ లైన్‌తో ప్రారంభించేందుకు ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. కాఫీ మొక్కలకు నీడను ఇచ్చేందుకు సిల్వర్ ఓక్ చెట్లను బోర్డు అందించాలని కోరారు. కాఫీ తోటలను ఆశిస్తున్న తెల్లకాండం తొలుచు పురుగు నివారణకు రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మన్యం కాఫీకి అంతర్జాతీయస్థాయిలో మంచి డిమాండ్ ఉందని, ప్రోత్సాహకాలు అందిస్తే రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు.

ఆస్తిలో సింహభాగం సేవకే

అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్



న్యూయార్క్: తాను ఆర్జించిన సంపదలో అధిక భాగం సొమ్మును సమాజ సేవ కోసమే ఖర్చు చేస్తానని అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ తేల్చిచెప్పారు. ఫోర్బ్స్ మేగజైన్ తాజా అంచనా ప్రకారం.. బెజోస్ ఆస్తి విలువ 124.1 బిలియన్ డాలర్లు (రూ.10,04,934 కోట్లు). ఆయన తన మిత్రురాలు లారెన్ సాంచెజ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. తన సంపదలో సింహభాగం వాటాను సేవా కార్యక్రమాలకు వెచ్చించాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఎంత సొమ్ము ఇస్తారు? ఎవరికి ఇస్తారు? అనే విషయాలు మాత్రం బహిర్గతం చేయలేదు. అమెజాన్ సంస్థను నిర్మించడానికి తాను చాలా కష్టపడాల్సి వచ్చిందని, అలాగే సమాజ సేవ కూడా అనుకున్నంత సులభం కాదని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో అత్యంత సంపన్నులైన బిల్ గేట్స్, మెలిండా ఫ్రెంచ్ గేట్స్, వారెన్ బఫెట్ తదితరులు సమాజ సేవకు అంకితం అవుతామంటూ ప్రతిజ్ఞ చేశారు. జెఫ్ బెజోస్ ఇలాంటి ప్రతిజ్ఞ చేయలేదంటూ గతంలో విమర్శలు వచ్చాయి.

క్లుప్తంగా...

‘ఆరాధన స్థలాల’పై అఫిడవిట్

కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: 1947 ఆగస్టు 15 నాటికి ఉన్న ఆరాధనా స్థలాలపై హక్కులు కోరుతూ కోర్టులను ఆశ్రయించకుండా, ఆయా స్థలాల్లో ఎలాంటి మార్పులు చేయకుండా నిరోధిస్తున్న 1991 నాటి చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ అంశంపై డిసెంబర్ 12లోగా సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ‘ప్లేసెస్ ఆఫ్ వర్షిప్(స్పెషల్ ప్రొవిజన్స్) యాక్ట్–1991’లోని కొన్ని అంశాల చెల్లుబాటును ప్రశ్నిస్తూ బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు సుబ్రహ్మణ్య స్వామి గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ జేబీ పార్దివాలాతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ లేవనెత్తిన అంశాలపై స్పందించాలని, సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది.

ప్రసారభారతికి కొత్త సీఈవో

న్యూఢిల్లీ: సీనియర్ ఐఏఎస్ అధికారి గౌరవ్ ద్వివేది ప్రభుత్వరంగ ప్రసారభారతి సీఈవోగా సోమవారం నియమితులయ్యారు. ఆయన 1995వ బ్యాచ్ ఛత్తీస్‌గఢ్ కేడర్ అధికారి. ఇప్పటిదాకా ప్రభుత్వ మైగవ్‌ఇండియా సీఈవోగా చేశారు. ప్రస్తుత సీఈఓ శశి శేఖర్ వెంపటి పదవీ కాలం జూన్‌తో ముగిసింది.

ఈడీ ఎదుటకు శివకుమార్

న్యూఢిల్లీ: నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో శివకుమార్, ఆయన సోదరుడు సురేశ్‌ను కూడా గత నెల్లో ఈడీ ప్రశ్నించింది.

గుజరాత్‌లో ఎన్సీపీకి ఏకైక ఎమ్మెల్యే రాజీనామా

పోర్‌బందర్: గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)కి పెద్ద షాక్ తగిలింది. రాష్ట్రంలో ఎన్సీపీకి చెందిన ఏకైక ఎమ్మెల్యే కంధాల్ జడేజా సోమవారం పార్టీకి రాజీనామా చేశారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ అధిష్టానం టిక్కెట్ ఇవ్వకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ నుంచి టిక్కెట్‌పై హామీ రాకపోయినప్పటికీ ఆయన పోర్‌బందర్ జిల్లాలోని కుతియానా స్థానం నుంచి పోటీ చేయడానికి ఈ నెల 11న నామినేషన్ దాఖలు చేశారు. కంధాల్ జడేజా 2012, 2017లో ఇదే స్థానం నుంచి ఎన్సీపీ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎన్సీపీ–కాంగ్రెస్ ఒప్పందంలో భాగంగా తాజా ఎన్నికల్లో కుతియానా నుంచి పోటీ చేసే అవకాశం కాంగ్రెస్ పార్టీకి దక్కింది. కంధాల్ జడేజా గుజరాత్ ఎన్సీపీ అధ్యక్షుడు జయంత్ పటేల్‌కు లేఖ రాశారు. పార్టీలో అన్ని పదవులతోపాటు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. కంధాల్ జడేజా మరో పార్టీ నుంచి లేక స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

గొప్ప కలలు కనండి



‘గొప్ప కలలు కనండి. కష్టించి వాటిని నిజం చేసుకోండి. సుసంపన్న, అధునాతన భారత్‌ను ఆవిష్కరించండి’’ అంటూ చిన్నారులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సందేశమిచ్చారు. బాలల దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలల బాలలు సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ముర్మును కలిశారు. వారితో ఆమె ఆప్యాయంగా గడిపారు.

గొంతు నులిమి.. ముక్కలుగా నరికి

సహజీవనం చేసిన అమ్మాయిని దారుణంగా అంతం చేసిన దుర్మార్గుడు

- ఫ్రిజ్ కొని ముక్కలను దాచాడు
- రోజూ కొన్ని చొప్పున పడేశాడు
- ఢిల్లీలో ఒళ్లు జలదరించే కిరాతకం

న్యూఢిల్లీ: అత్యంత హేయం. వింటేనే ఒళ్లు జలదరించేంతటి దారుణం. నమ్మి వచ్చి సహజీవనం చేసిన అమ్మాయిని, పెళ్లి చేసుకొమ్మన్న పాపానికి అక్షరాలా గొంతు నులిమి చంపేశాడో కర్కోటకుడు. తర్వాత పదునైన ఆయుధంతో మృతదేహాన్ని ముక్కల కింద నరికాడు! ఫ్రిజ్ కొని మరీ వాటిని అందులో దాచాడు. రోజుకు కొన్ని చొప్పున పడేస్తూ వచ్చాడు. చుట్టుపక్కల ఫ్లాట్లకు దుర్వాసన రాకుండా అగరొత్తులు వెలిగిస్తూ, రూమ్ ఫ్రెషనర్లు కొడుతూ ఏకంగా ఆర్నెల్లపాటు మేనేజ్ చేశాడు! అమ్మాయి తండ్రి పోలీసులను ఆశ్రయించడంతో ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణలో అతను చెప్పిన విషయాలు విని ఖాకీలకే కళ్లు తిరిగాయి! వెన్నులో చలి పుట్టించే ఈ ఘటన ఢిల్లీలో జరిగింది. ఈ దారుణం జరిగిన తీరును పోలీసులు సోమవారం మీడియాకు వెల్లడించారు.

- హంతకుడు అఫ్తాబ్ అమీన్ పూనావాలా (28), శ్రద్ధా వాకర్ అమ్మాయి ఓ ఆన్‌లైన్ డేటింగ్ అప్లికేషన్లో కలిశారు. తర్వాత ముంబైలో ఓ కాల్ సెంటర్‌లో కలిసి పని చేశారు. పరిచయం ప్రేమగా మారింది. మతాలు వేరు కావడంతో ఇరు కుటుంబాలూ ఒప్పుకోలేదు.
- దాంతో ఈ ఏడాది మొదట్లో వాళ్లు ఢిల్లీకి పారిపోయి వచ్చారు. మెహ్రౌలీలోని ఛత్తర్‌పూర్ ప్రాంతంలో ఓ ఫ్లాట్ అద్దెకు తీసుకుని సహజీవనం ప్రారంభించారు. కొన్నాళ్లకే భేదాభిప్రాయాలు మొదలయ్యాయి. ముఖ్యంగా పెళ్లి కోసం శ్రద్ధ ఒత్తిడి చేస్తుండటం గొడవలను మరింత పెంచింది. ఆమెపై చేయిచేసుకోవడం ప్రారంభించాడు.
- ఆమె మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో ఉండే తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పింది. కానీ తర్వాత వాళ్లతోనూ సరిగా మాట్లాడటం మానేసింది. పెళ్లి విషయమై మే 18న ఇద్దరికీ మరోసారి పెద్ద గొడవ జరిగింది. ఆవేశంలో శ్రద్ధను అఫ్తాబ్ గొంతు పిసికి చంపేశాడు.
- ట్రెయిన్డ్ షెఫ్ అయిన అఫ్తాబ్ అరెస్టును తప్పించుకోవడానికి మృతదేహాన్ని 35కు పైగా ముక్కలుగా నరికాడు. తర్వాత 300 లీటర్ల ఫ్రిజ్ కొని వాటిని మూడు వారాల పాటు అందులోనే దాచాడు. తర్వాత 16 రోజుల పాటు రోజూ అర్ధరాత్రి దాటాక కొన్నేసి శరీర భాగాలను పాలిథిన్ బ్యాగుల్లో తీసుకెళ్లి నగరంలో అక్కడా ఇక్కడా పడేస్తూ వచ్చాడు. ఫ్లాట్ నుంచి దుర్వాసన రాకుండా అగరొత్తులు వెలిగించేవాడు.
- ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు శ్రద్ధ సోషల్ అకౌంట్ల ద్వారా ఆమె ఫ్రెండ్స్‌తో వారాల పాటు చాట్ చేస్తూ వచ్చాడు. తద్వారా ఆమే తమతో టచ్‌లో ఉందని వారు నమ్మేలా చేశాడు.
- కూతురి క్షేమ సమాచారం తెలియక తల్లిదండ్రులు తల్లడిల్లారు. సెప్టెంబర్లో కూతురి స్నేహితులతో మాట్లాడారు. తన ఫోన్ అస్సలు కలవడం లేదని వారు చెప్పడంతో శ్రద్ధ తండ్రి అఫ్తాబ్‌కు ఫోన్ చేశారు. తామెప్పుడో విడిపోయామని, తనెక్కడుందో తెలీదని బుకాయించడంతో అనుమానంతో మహారాష్ట్రలోని మాణిక్‌పూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.
- నవంబర్ మొదట్లో తండ్రి ఢిల్లీ వచ్చి ఫ్లాట్లో చూసినా లాభం లేకపోయింది. మహారాష్ట్ర పోలీసులు కేసును ఢిల్లీ పోలీసులకు బదిలీ చేశారు.
- వికాస్ కూడా నవంబర్ 8న మెహ్రౌలీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కూతుర్ని అఫ్తాబ్ బూతులు తిట్టేవాడని, తరచూ కొట్టేవాడని పేర్కొన్నారు.
- ముంబై పోలీసులు అఫ్తాబ్‌తో మాట్లాడితే తనకేమీ తెలియదన్నాడు. అతని పొంతన లేని మాటలతో అనుమానమొచ్చి ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగారు. ఫ్లాట్‌పై దాడి చేసి అఫ్తాబ్‌ను అదుపులోకి తీసుకున్నారు. తాను చేసిన దారుణాన్ని విచారణలో పూసగుచ్చినట్టు చెప్పుకొచ్చాడు. అమెరికా క్రైమ్ టీవీ సిరీస్ డెక్స్‌టర్ స్ఫూర్తితో మృతదేహాన్ని ముక్కలుగా నరికాడట! ఏ భాగాలు ముందుగా కుళ్లిపోతాయన్న దాన్ని బట్టి వేటిని ముందుగా పారేయాలో కూడా పక్కాగా ఆలోచించి ఆ ప్రకారం చేసినట్టు చెప్పాడు!!
- ఫ్లాట్లో తనిఖీ చేయగా కొన్ని శరీరభాగాలు ఇంకా ఫ్రిజ్‌లోనే కన్పించాయి! అఫ్తాబ్ చెప్పిన 13 చోట్ల వెదకగా ఎముకలు దొరికాయి. హత్యాయుధం దొరకాల్సి ఉంది. ఈ దారుణంపై ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మలీవాల్ తీవ్ర ఆవేదన వెలిబుచ్చారు. ‘‘ఇంతటి క్రూరులు సమాజంలో తిరుగుతున్నారా! అఫ్తాబ్‌ను త్వరగా కఠినంగా శిక్షించాలి’’ అంటూ ట్వీట్ చేశారు.



హంతకుడు అఫ్తాబ్



శ్రద్ధ



శరీర భాగాలను దాచింది ఈ ఫ్రిజ్‌లోనే..

బలవంతపు మతమార్పిళ్లు...

దేశభద్రతకే పెనుసవాలు!

- అత్యంత తీవ్రమైన అంశమిది: సుప్రీంకోర్టు
- కేంద్రం తక్షణం జోక్యం చేసుకోవాలని వ్యాఖ్య
- అడ్డుకునేందుకు ఏం చర్యలు తీసుకుంటారు?
- 22లోగా అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశం



న్యూఢిల్లీ: బలవంతపు మతమార్పిడులను అత్యంత తీవ్రమైన అంశంగా సుప్రీంకోర్టు అభివర్ణించింది. మోసగించి, ప్రలోభపెట్టి, భయపెట్టి మతాంతరీకరణ చేయడాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తున్నట్టు స్పష్టం చేసింది. ‘‘మత స్వేచ్ఛ ఉండొచ్చు. కానీ బలవంతంగా మతం మార్చే స్వేచ్ఛ ఎవరికీ లేదు! ఈ తరహా మార్పిడులను అడ్డుకోని పక్షంలో చాలా సమస్యాత్మక పరిస్థితులు తలెత్తుతాయి. ఈ పోకడలు నిజమే అయితే గనక అంతిమంగా ఇది దేశభద్రతకే పెనుసవాలు విసరగలిగినంతటి తీవ్రమైన సమస్య! అంతేగాక పౌరులు తమకు నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను కూడా ప్రమాదంలో పడేస్తుంది’’ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కేంద్రం తక్షణం జోక్యం చేసుకోండి. బలవంతపు మతమార్పిళ్లకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోండి. ఆ వివరాలతో 22లోగా అఫిడవిట్ దాఖలు చేయండి’’ అని ఆదేశించింది. బలవంతపు మత మార్పిళ్లను అడ్డుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలంటూ అడ్వకేట్ అశ్వనీకుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఆర్.షా, జస్టిస్ హిమా కోహ్లీలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. బలవంతపు మతమార్పిడులను అడ్డుకునేందుకు కేంద్రం ఏం చేయనుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ప్రశ్నించింది. ఈ అంశాన్ని రాజ్యాంగ పరిషత్తులో చర్చించినట్టు ఆయన ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ‘‘డబ్బు తదితర ప్రలోభాలు చూపి, భయపెట్టి, మోసగించి మతం మార్చడాన్ని అడ్డుకునేందుకు ఒడిశా, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు తెచ్చిన రెండు చట్టాలు ఇప్పటికే ఉన్నాయి. ఈ అంశం గతంలో సుప్రీంకోర్టు దృష్టికి వచ్చినప్పుడు ఆ చట్టాల చెల్లుబాటును సమర్థించింది కూడా’’ అని ఆయన వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఈ బలవంతపు మతమార్పిళ్లు అడ్డూఅదుపూ లేకుండా సాగుతున్నాయన్నారు. ‘‘తాము క్రిమినల్ నేరాల్లో భాగస్వాములుగా మారుతున్నామన్న వాస్తవం కూడా ఇలాంటి బాధితులకు చాలా సార్లు తెలియదు. పైగా మతం మారుస్తున్న వాళ్లు తమకు సాయం చేస్తున్నారని భ్రమిస్తుంటారు’’ అని ఆవేదన వెలిబుచ్చారు. విచారణను నవంబర్ 28కి ధర్మాసనం వాయిదా వేసింది.

దేశవ్యాప్తంగా రబీ జోష్



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా భారీ వర్షాలతో నీటి నిల్వలు, భూగర్భ జలాల్లో పుష్కలంగా పెరగడంతో రబీ సీజన్‌లో దేశంలో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే నవంబర్ రెండో వారానికి 6 శాతం పెరుగుదల ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ పేర్కొంది. గతేడాది 1.68 కోట్ల హెక్టార్లలో సాగు చేయగా ఈసారి 1.80 కోట్ల హెక్టార్లను దాటింది. ‘‘గోధుమల సాగు 41 లక్షల హెక్టార్ల నుంచి అది ఇప్పటికే 46 లక్షలకు చేరవైంది. వరి 6 లక్షల హెక్టార్ల నుంచి 7.5 లక్షలకు పెరిగింది. పప్పు ధాన్యాల విస్తీర్ణం గతేడాది 55.41 లక్షల హెక్టార్ల కంటే స్వల్పంగా తగ్గింది’’ అని పేర్కొంది. పంజాబ్, మధ్య ప్రదేశ్ లో వరి కోతలు సాగుతుండటంతో గోధుమల సాగు ఇంకా మొదలవలేదని వ్యవసాయ శాఖ చెప్పింది. తెలంగాణ సహా వరి పండించే రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తమిళనాడులో ఇప్పుడిప్పుడే వరి పంటల సాగు మొదలైందని వెల్లడించింది. గతేడాది అన్ని పంటల సాగు విస్తీర్ణం 6.18 కోట్ల హెక్టార్లుగా నమోదైంది. ఈసారి 6.33 కోట్ల హెక్టార్ల వరకు పెరగవచ్చని అంచనా.

విదేశీ విద్య @ అమెరికా

21 శాతం భారతీయులే
గతేడాది 1.99 లక్షల ప్రవేశాలు



సాక్షి, న్యూఢిల్లీ: విదేశాల్లో విద్యాభ్యాసానికి వెళ్లే భారతీయ విద్యార్థుల టాప్ చాయిస్ ఇప్పటికీ అమెరికానే! 2021–22లో అమెరికాలో 9.48 లక్షల మంది విదేశీ విద్యార్థులు ప్రవేశాలు పొందగా వారిలో 21 శాతం (1,99,182 మంది) భారతీయులే! 2020–21తో పోలిస్తే ఇది 18 శాతం ఎక్కువని ఓపెన్ డోర్స్ సంస్థ నివేదిక వెల్లడించింది.

మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్

కరోనా వల్ల 2020–21లో అమెరికాలో అడ్మిషన్లు తీసుకున్న భారతీయ విద్యార్థుల సంఖ్య 13.2 శాతం తగ్గింది. వైరస్ ప్రభావం తగ్గడంతో 2021–22లో అడ్మిషన్లు భారీగా పెరిగాయి. భారతీయ విద్యార్థుల సంఖ్య 18.9 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. అమెరికాలోని విదేశీ విద్యార్థుల సంఖ్యలో చైనాదే అగ్రస్థానం. కానీ వారి సంఖ్య 2020–21లో 3.17 లక్షలుండగా 2021–22లో 2.9 లక్షలకు తగ్గింది. అమెరికాలో 9,48,519 మంది విదేశీ విద్యార్థులున్నారని ప్రభుత్వం వెల్లడించింది. వీరిలో 21.1 శాతం (2 లక్షలు) మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, 19.8 శాతం (1.88 లక్షలు) ఇంజనీరింగ్ చదువుతున్నారు. వచ్చే వేసవిలో భారత విద్యార్థులకు 82 వేలకు పైగా వీసాలు జారీ చేస్తామని యూఎస్ ఎంబసీ ప్రకటించింది. గతేడాది 62 వేల వీసాలు జారీ చేసినట్లు ‘మినిస్టర్ కౌన్సెలర్ ఫర్ పబ్లిక్ డిప్లొమసీ’ గ్లోరియా బెర్బెనా తెలిపారు.

బాలికి మోదీ

- నేటి నుంచి రెండు రోజుల జీ 20 సదస్సు
- భారత్ సాధించిన ఘనతలను చాటుతా
- కీలక సమస్యలపై నేతలతో చర్చిస్తా: మోదీ

న్యూఢిల్లీ/బాలి: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటును తిరిగి పట్టాలెక్కించడం, ఆహార, ఇంధన భద్రత తదితర కీలకాంశాలపై పలువురు దేశాధినేతలతో లోతుగా చర్చిస్తానని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. మొదలవుతున్న 17వ జీ 20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు మూడో రోజుల పర్యటన నిమిత్తం ఆయన సోమవారం ఇండొనేసియాలోని బాలికి చేరుకున్నారు. పలు రంగాల్లో భారత్ సాధించిన అద్భుత ప్రగతి, గ్లోబల్ వార్మింగ్ తదితర ప్రపంచ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో చేస్తున్న కృషిని జీ 20 వేదికపై ప్రస్తావిస్తానని ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ప్రధాని పేర్కొన్నారు. వచ్చే ఏడాది భారత్ సారథ్యంలో జరిగే జీ 20 సదస్సుకు ‘ఒకే భూమి, ఒక కుటుంబం, ఒకే భవిష్యత్తు’ (వసుధైవ కుటుంబం) ప్రధాన నినాదంగా ఉండబోతోందని పేర్కొన్నారు. ఇండొనేసియా అధ్యక్షుడి నుంచి జీ 20 సారథ్య బాధ్యతలు భారత్ స్వీకరించనుండటాన్ని చరిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. సదస్సు సందర్భంగా పలువురు దేశాధినేతలతో విడిగా భేటీ అవుతానని వెల్లడించారు. బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్‌తో మోదీ భేటీ జరుగుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. అమెరికా, చైనా, ఫ్రాన్స్ అధ్యక్షులు జో బైడెన్, షీ జిన్‌పింగ్, ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తదితరులు భేటీలో పాల్గొననున్నారు. మంగళవారం బాలిలోని భారతీయులతో భేటీ అయ్యేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నట్టు చెప్పారు.



మనకు గొడవలొద్దు

జిన్‌పింగ్‌తో భేటీలో జో బైడెన్

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధినేత షీ జిన్‌పింగ్ సోమవారం ఇండొనేషియాలోని బాలీలో సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా జిన్‌పింగ్‌తో బైడెన్‌కు ఇదే తొలి ముఖాముఖి! తైవాన్ తదితర అంశాల్లో ఇటీవల ఇరు దేశాల సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. జీ 20 సదస్సు కోసం వచ్చిన నేతలిరువురూ పలు అంశాలపై దాదాపు 3 గంటలపాటు అభిప్రాయాలు పంచుకున్నారు! అంతకుముందు పరస్పరం అభివాదం చేసుకున్నారు. చిరునవ్వులు చిందిస్తూ చేతులు కలిపారు. భేదాభిప్రాయాలు తొలగించుకునేందుకు కలిసి పనిచేద్దామని బైడెన్ అన్నారు.

మైన్‌పురి బరిలో డింపుల్



మైన్‌పురి: సమాజ్‌వాదీ పార్టీ దిగ్గజం ములాయం సింగ్ యాదవ్ అస్తమయంతో ఖాళీ అయిన ఉత్తరప్రదేశ్‌లోని మైన్‌పురి లోక్‌సభ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికకు పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్ యాదవ్ (44) సోమవారం నామినేషన్ వేశారు. తనకు రూ.14 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. భర్త అఖిలేశ్‌కు రూ.17.22 కోట్ల స్థిరాస్తులున్నట్లు తెలిపారు. ఇద్దరి ఆస్తుల విలువను రూ.26.83 కోట్లుగా చూపారు. వారికి 1999లో వివాహమైంది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 17 ఆఖరు తేదీ. డిసెంబర్ 5న పోలింగ్ జరుగుతుంది. 8న ఫలితాలు వెలువడతాయి. బీజేపీ ఇక్కడ తన అభ్యర్థిని ఇంకా ప్రకటించలేదు.

బీజేపీ నుంచి తోడి కోడలి పోటీ?

మైన్‌పురి బరిలో ములాయం కొడుకు ప్రతీక్ యాదవ్ భార్య అపర్ణా యాదవ్ కూడా ఉంటారనే వాదనలు వినిపిస్తున్నాయి. బీజేపీలో చేరిన అపర్ణా యాదవ్ ఇటీవల రాష్ట్రకాషాయ నేతలతో భేటీ కావడం ఈ చర్చకు ఊతమిస్తోంది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆమె బరిలో ఉన్నా గెలుపు సాధించలేకపోయారు. బిఅవేర్ అనే సంస్థను స్థాపించిన ఈమె మహిళల హక్కులు, సాధికారిత కోసం ఉద్యమాలు చేస్తున్నారు. ములాయంకు ఇద్దరు భార్యలు. వీరిలో సాధనాగుప్తా కొడుకే ప్రతీక్.

నాపై భారీ అంచనాలున్నాయ్

కానీ అద్భుతాలు చేయలేను: సీజేఐ



న్యూఢిల్లీ: చాలామంది తనపై భారీ స్థాయిలో అంచనాలు పెట్టుకున్నారని, కానీ తానున్నది అద్భుతాలు చేసేందుకు కాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. సోమవారం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆయన్ను సత్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ‘బార్ నుంచి వచ్చిన న్యాయమూర్తులతో కోర్టులో నూతనత్వం వస్తుందని భావిస్తున్నా. న్యాయమూర్తులుగా పదోన్నతి పొందే న్యాయవాదులతో సుప్రీంకోర్టులో బార్, బెంచ్‌ల విశిష్ట కలబోత కనిపిస్తుంది. పెను సవాళ్లున్నాయి. నాపై అంచనాలూ భారీగానే ఉన్నాయి. అంతటి నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు. కానీ నేనున్నది అద్భుతాలు చేయడానికి కాదు. ప్రతి రోజూ ఇదే నా చివరిరోజు అన్నట్లుగా శ్రమిస్తా. అదే నా సిద్ధాంతం. హైకోర్టు న్యాయమూర్తులుగా, సీజేలుగా అపార అనుభవం గడించి సుప్రీంకోర్టుకు పదోన్నతిపై వచ్చిన జడ్జీల విశేషానుభవం, విషయపరిజ్ఞానం నాక్కూడా పంచాలని ఆశిస్తా’’ అని సీజేఐ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు.

ఆదివాసీలు ఆదుకుంటారా?

గుజరాత్‌లో గిరిజన ఓట్లకు బీజేపీ గాలం

గుజరాత్‌లో 27 ఏళ్లుగా అధికారంలో ఉండడంతో ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకతను అధిగమించడానికి బీజేపీ చేయని ప్రయత్నాల్లేవు! ప్రధాని మోదీ సొంత రాష్ట్రం కూడా కావడంతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ప్రతిష్మాత్మకంగా మారింది. ముక్కోణ పోరులో నెగ్గేందుకు ఆదివాసీ మంత్రం జపిస్తోంది...!

ఆదివాసీ ప్రాంతాల్లో పట్టు బిగించడం ద్వారా గుజరాత్ అసెంబ్లీతో పాటు వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కూడా విజయం సాధించడానికి బీజేపీ పకడ్బందీగా వ్యూహరచన చేస్తోంది. రాష్ట్రపతిగా ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్ము ఎన్నిక, మరో జలియన్‌వాలాబాగ్‌గా పేరు పడిన రాజస్థాన్‌లోని మాన్‌గఢ్ ధామ్‌ను జాతీయ స్మారక చిహ్నంగా ప్రకటించడం వంటి చర్యలెన్నో చేపడుతోంది. కాంగ్రెస్ కంచుకోటలైన ఈ స్థానాల్లో ఆప్ కూడా ప్రభావం చూపొచ్చన్న ఆందోళనా బీజేపీలో ఉంది. ఆదివాసీ స్థానాల్లో ఆప్ గట్టిగా ప్రచారం చేస్తోంది. వారు మొదట్నుంచే తనవైపే అయినా ముక్కోణపు పోటీలో ఏం జరుగుతుందోనన్న అనుమానంతో భారతీయ ట్రైబల్ పార్టీతో పొత్తుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. 27 ఏళ్ల బీజేపీ పాలనతో తమ బతుకులు ఏమీ మారలేదని ఆదివాసీలు గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆదివాసీ ప్రాంతాల్లో ప్రచారాన్ని బీజేపీ మరింత ఉధృతం చేసింది. ‘మీ దీవెనలు కావా’లంటూ ఆదివాసీ ప్రాంతమైన వల్సద్ నుంచే మోదీ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. 27 ఎస్టీ స్థానాల్లో కనీసం 20 గెలవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే రూ.15 వేల కోట్లతో ఆదివాసీల అభివృద్ధి ప్యాకేజీ తెచ్చింది. ఆదివాసీలకు ఉద్యోగాల కల్పన, ఆ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధిని ప్రచారంలో ప్రస్తావిస్తోంది. గిరిజన ప్రాంతాల్లో స్వయంపాలన కోసం 1996లో పార్లమెంటు చేసిన ప్రొవిజన్స్ ఆఫ్ ది పంచాయత్స్ యాక్ట్ (పెసా) అమలు కాకపోవడం, భూ యాజమాన్య హక్కుల వంటివి విపక్షాల ప్రచారాస్త్రాలుగా మారాయి. ‘‘పెసా తదితరాలపై ఆదివాసీలు కాస్త అసంతృప్తిగా ఉన్నా అది చాలా తక్కువ. 20 ఏళ్లలో వారి జీవితాలు చాలా మారాయి. అభివృద్ధి కనిపిస్తోంది. అందుకే ఆదివాసీలు ఈ సారి మా వైపే ఉంటారు’’ అని భరూచ్ బీజేపీ ఎంపీ మన్‌సుఖ్ వాసవ ధీమాగా చెప్పారు. గుజరాత్‌లో ప్రచారాన్ని బీజేపీ, ఆప్ ఉధృతంగా చేస్తున్నా కాంగ్రెస్ నుంచి గాంధీ కుటుంబానికి చెందిన వారు ఇప్పటివరకు ఆ రాష్ట్రం వైపు కూడా చూడకపోవడం పార్టీలో అంతర్గతంగా అసంతృప్తిని రాజేస్తోంది. ఈ ముక్కోణపు పోటీలో బీజేపీ ఆశిస్తున్నట్టుగా ఆదివాసీలు అండగా ఉంటారో లేదో.. వేచి చూడాలి..

ఏ ఫర్ ఆదివాసీ

‘‘ఏ ఫర్ ఆదివాసీ’’ వారి కంటే తనకు ముఖ్యం మరెవరూ కాదంటూ ప్రధాని మోదీ గుజరాత్‌లోని ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. గుజరాత్ జనాభాలో 15% గిరిజనులే ఉన్నారు. అంటే దాదాపుగా 80 లక్షల నుంచి కోటి మంది వరకు గిరిజన జనాభా ఉంటుంది. దేశవ్యాప్తంగా చూసుకుంటే 8.1% గిరిజన జనాభా గుజరాత్‌లోనే ఉన్నారు. రాష్ట్రంలోని 14 జిల్లాలు 53 తాలూకాల్లో వీరి జనాభా విస్తరించి ఉంది. ఉత్తరాన అంబాజీ నుంచి దక్షిణాన ఉంబర్‌గావ్ వరకు ఆదివాసీల ప్రాబల్యమున్న ప్రాంతాలున్నాయి. మొత్తంగా 12 తెగలు ఉన్నప్పటికీ భిల్ తెగకు చెందినవారే సగం మంది ఉన్నారు. ఇక దాంగ్ జిల్లాలో గిరిజనుల ప్రాబల్యం ఎక్కువ.

– సాక్షి, నేషనల్ డెస్క్

గిరిజనుల సమస్యలు

గుజరాత్‌లో ఆదివాసీ ప్రాంతాల్లో పౌష్టికాహార లోపం ఇప్పటికీ ప్రధాన సమస్యగా ఉంది. అక్షరాస్యత చాలా తక్కువ. కొండల్లో కోనల్లో పండిన పంటల నుంచి వచ్చే ఆదాయం ఏ మాత్రం వారికి సరిపోవడం లేదు. దళారుల దోపిడీలతో విసిగి వేసారి ఉన్నారు. ప్రతీ ఏడాది రాష్ట్రంలోని గిరిజనుల్లో 30% మంది ఉపాధి అవకాశాల కోసం తాత్కాలికంగా వలస వెళ్లిపోతున్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. విద్య, నిరుద్యోగం, ఆరోగ్యం, కుల సర్టిఫికెట్, ప్రొవిజన్స్ ఆఫ్ ది పంచాయత్స్ యాక్ట్ అమలు వంటి సమస్యలు ఇప్పటికీ ఎన్నికల ఎజెండాలో ఉన్నాయి.



గిరిపుత్రులు ఎటువైపో?!

రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాలు 182కి గాను 27 ఎస్టీ రిజర్వ్‌డ్ సీట్లు ఉన్నాయి. మొత్తంగా చూస్తే 48 అసెంబ్లీ స్థానాల్లో ఆదివాసీ ఓట్లు అత్యంత కీలకం. రెండు దశాబ్దాలుగా అధికారంలో బీజేపీ ఉన్నప్పటికీ ఎస్టీ జనాభా ప్రాబల్యం అధికంగా ఉన్న సీట్లలో కాంగ్రెస్ స్థానం చెక్కు చెదరలేదు. గత మూడు దఫా ఎన్నికల్లోనూ ఎస్టీ రిజర్వ్ స్థానాలను బీజేపీ కంటే కాంగ్రెస్ మెరుగైన ఫలితాలు సాధించింది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్టీ రిజర్వ్ స్థానాల్లో కాంగ్రెస్ 17 స్థానాల్లో విజయం సాధిస్తే, బీజేపీ ఎనిమిది సీట్లు, భారతీయ ట్రైబల్ పార్టీ (బీటీపీ) రెండు సీట్లలో విజయం సాధించింది. అయితే కాంగ్రెస్ తరఫున విజయం సాధించిన ఎమ్మెల్యేల్లో అయిదుగురు ఆ తర్వాత బీజేపీ గూటికి చేరుకున్నారు. అంతకు ముందు 2012లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 16 సీట్లలో గెలుపొందితే, బీజేపీకి 10, జనతాదళ్ (యూ)కి ఒక్క సీటు వచ్చింది.

సాక్షి విజయనగరం

మంగళవారం । 15 । నవంబర్ । 2022



మంచి పుస్తకంతో మార్పు

మంచి పుస్తకాలు, మనిషి జీవితంలో గొప్ప మార్పును తీసుకువస్తాయని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు.

- 8లో



డీజీపీని కలిసిన కలెక్టర్

విజయనగరం క్రైమ్: రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ ఎ.సూర్యకుమారి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను బహూకరించారు. కార్యక్రమంలో ఎస్పీ ఎం.దీపిక పాల్గొన్నారు.



గంట్యాడ: పెదవేమలి గ్రామంలో కాళికా మాత ఆశ్రమం ఆధ్వర్యంలో లక్షదీపారాధన

న్యూస్‌రీల్

రాములోరికి పట్టాభిషేకం



స్వామివారి వెండి మండపం వద్ద పట్టాభిషేక మహోత్సవాన్ని జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో అర్చకులు సోమవారం ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారికి వేకువ జామున ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరాకాండ హవనం చేశారు. అనంతరం స్వామి ఆస్థాన వెండి మండపం వద్ద కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించి తలంబ్రాల సేవను నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణ నడుమ శ్రీరాముడిని పట్టాభిషిక్తుడిని చేశారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీ డిపో సందర్శన



పల్లెవెలుగు బస్సును పరిశీలిస్తున్న జోనల్ చైర్మన్ బంగారమ్మ

శృంగవరపుకోట: ఎస్.కోట ఆర్టీసీ డిపోను ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ గదల బంగారమ్మ సోమవారం సందర్శించారు. ముందుగా డిపో ప్రాంగణంలో కొబ్బరి మొక్కను నాటారు. అనంతరం డిపో ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఆదాయం, లాభనష్టాలను డిపో మేనేజర్ రమేష్ వివరించారు. యూనియన్ నాయకులు రాజయ్య, కోటేశ్వరరావు మాట్లాడుతూ అరకు ఘాట్ ఉన్నందున డిపోకు కొత్త బస్‌లు, టిమ్‌లు కేటాయించాలని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించేలా చూడాలని కోరారు. డిపో ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు చైర్మన్ బంగారమ్మను సన్మానించారు. అనంతరం ఆమె డిపో కార్యాలయం, గ్యారేజీ, బంకు, కొరియర్ విభాగం, కాంప్లెక్స్‌లను పరిశీలించారు. కాంప్లెక్స్‌లో వ్యాపార సముదాయాల యజమానులతో మాట్లాడారు. పల్లెవెలుగు బస్‌ను పరిశీలించి ప్రయాణికులతో మాట్లాడి ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

జేఎన్‌టీయూ జీవీ వీసీ నియామకానికి కసరత్తు



జేఎన్‌టీయూ జీవీ ప్రాంగణం

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)కి రెగ్యులర్ వైస్ చాన్సలర్ నియామకానికి కసరత్తు జరుగుతోంది. దీని కోసం సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీ చేశారు. కర్ణాటక బెలగాం విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ కె.బాలవీరరెడ్డి చైర్మన్‌గా సెర్చ్ కమిటీ ఏర్పాటయింది. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నామినీ సభ్యునిగా జేఎన్‌టీయూ హైదరాబాద్ మాజీ వీసీ ప్రొఫెసర్ డీఎన్‌రెడ్డి, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ సభ్యునిగా కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ బట్టు సత్యనారాయణ వ్యవహరిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విజయనగరంలోని జేఎన్‌టీయూ వీసీగా కాకినాడ జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జేఎన్‌టీయూ జీవీ వైస్‌చాన్సలర్ నియామకం కోసం స్వీకరించిన దరఖాస్తుల్లో అర్హులైన ప్రొఫెసర్ల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీకి అందజేసింది. ఆ జాబితాలో ఒకరిని వీసీగా సెర్చ్ కమిటీ ఎంపిక చేయనుంది.

20న క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్యశిబిరం

విజయనగరం: థెరిసా క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 20న విశాఖపట్నంలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు క్యాన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య శిబిరాన్ని క్లబ్ ఆవరణలో నిర్వహిస్తారని వ్యవస్థాపక కార్యదర్శి కె.టి.కురియాకోస్ సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి నిర్వహించే శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుస్తుగా పేర్ల నమోదుకు సెల్:94409 55735 నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఆ రోజు 200 మందికి సేవలందిస్తారన్నారు.

కార్తీక శోభ

కార్తీక మాసం మూడో సోమవారం.. దారులన్నీ శైవక్షేత్రాల వైపే సాగాయి. వేకువజాము నుంచే ముక్కంటీశ్వరుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. శివనామ స్మరణలో తరించారు. అభిషేక ప్రియుడికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించి ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. - విజయనగరంటౌన్/ఎస్.కోట



విజయనగరం పశుపతినాథేశ్వర ఆలయంలో పుష్పాలంకరణలో స్వామివారు



పశుపతినాథేశ్వర ఆలయంలో సామూహిక రుద్రాభిషేకంలో పాల్గొన్న దంపతులు



ఎస్.కోట: పుణ్యగిరి మెట్ల మార్గంలో భక్తుల రద్దీ

సంగమేశ్వరుని సేవలో స్పీకర్

పవిత్ర సంగమేశ్వరస్వామిని స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ బోను ఆనందరావు, ఈఓ పొన్నాడ శ్యామలరావు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన చేతుల మీదుగా పూజలు జరిపి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసినట్టు స్పీకర్ వెల్లడించారు. దేవాలయాల భూములు ఆక్రమించేవారిపై చర్యలు తప్పవన్నారు. సంగమేశ్వర స్వామిని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగిచినఅప్పలనాయుడు దంపతులు దర్శించుకున్నారు. క్షీర, రుద్రాభిషేకాలు జరిపారు. - వంగర



సంగమేశ్వర సన్నిధిలో పూజలు చేస్తున్న స్పీకర్, కుటుంబసభ్యులు



ఎమ్మెల్యే కంబాల జోగులుకు ఆశీర్వచనాలు అందిస్తున్న ఆలయ అర్చకులు



సంగమేశ్వరుడి ఆలయంలో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన అప్పలనాయుడు దంపతులు

మహిళా కూలీలకు డిమాండ్



కోత కోస్తున్న మహిళా కూలీలు

- గతంలో కంటే రూ.50 నుంచి రూ.100 వరకూ పెరుగుదల
- పురుషులతో సమానంగా మహిళలకు కూలి రేట్లు

రాజాం/రేగిడి:

జిల్లాలో ఖరీఫ్ వరి కోతలు ఆరంభమయ్యాయి. అన్నిచోట్లా ఒకేదఫా వరి పంట కోతదశకు రావడం, వాతావరణం అనుకూలంగా ఉండడంతో చేతికందిన పంటను దక్కించుకునేందుకు కోతలను రైతులు ముమ్మరం చేశారు. దీంతో ఒక్కసారిగా కూలీలకు డిమాండ్ పెరిగింది. వరితో పాటు మొక్కజొన్న, పత్తి, గోగు, చెరకు పంట పనులు కూడా సాగుతుండడంతో కూలీలు దొరకడం కష్టమవుతోంది. నూర్పిడికి యంత్రాలు వినియోగిస్తుండడంతో కూలీలు అవసరం లేకపోయినా, కోతలకు మహిళా కూలీలు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పెరిగిన కూలి...

వరి కోతకు వచ్చే మహిళలకు రోజుకు రూ.250 నుంచి రూ.300లు చెల్లిస్తున్నారు. కొన్ని చోట్ల ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మరికొన్ని ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోస్తున్నారు. వరి పనలు మోపులు కట్టి గట్టుకు, కల్లాలకు తెచ్చేవారికి రోజుకు రూ.400లు నుంచి రూ.500లు చెల్లిస్తున్నారు. వీరికి మధ్యాహ్న సమయంలో భోజన సదుపాయం కూడా ఏర్పాటుచేయాలి.

పోటాపోటీగా...

ఈ ఏడాది వ్యవసాయ పనుల్లో స్త్రీ, పురుషులు ఇద్దరు పోటాపోటీగా రోజువారీ కూలిని సంపాదిస్తున్నారు. గుత్తగా ఎకరా పంట కోతకు రూ.2వేలు చొప్పున ఒప్పుకుని నలుగురు మహిళలు ఆరు గంటల వ్యవధిలో పనిని పూర్తిచేస్తున్నారు. పంటను కుప్పలుగా పెట్టేందుకు కూడా గుత్త (కాంట్రాక్టు) ప్రాతిపదికన పనిచేస్తున్నారు. రైతులు కూడా పంట సకాలంలో కల్లాంకు చేరుతుందనే ఆశతో గుత్తకు ఇచ్చేస్తున్నారు. కొన్నిచోట్ల పని గంటలు పెరిగితే కూలి డబ్బులు రోజుకు రూ.600 ఇవ్వాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.

రోజుకు రూ.400లు వరకు...



గతంలో మాకు రోజుకు రూ.250లు వచ్చేది. గత కొన్ని నెలలుగా ఈ వేతనం పెరిగింది. రోజువారీ కూలీ పనులు కంటే ఎకరా పొలం, రెండెకరాలు పొలం అని గుత్తకు ఒప్పుకుంటున్నాం. వరి కోతలు, మోతలు సమయంలో రూ.400లు పైబడి రోజుకు గిట్టుబాటు అవుతోంది. ఒక్కోదఫా మోతలకు, నూర్పిడి యంత్రాలు వద్ద చేను అందించేందుకు కూడా వెళ్తున్నాం.

- ఎ.నూరీదు, మహిళా రైతు, వన్నలి, రేగిడి మండలం

రూ.300 దాటి...



గతంలో కంటే ప్రస్తుతం మహిళా కూలీలకు కోతకు రూ.300లు దాటి రోజుకు ఇస్తున్నారు. డిమాండ్ బట్టి ఈ కూలి ధర ఒక్కో దఫా పెరుగుతోంది. కొంతమంది రైతులు భోజనాలు కూడా పెడుతున్నారు. మేము గుత్తకు ఒప్పుకుంటే రోజుకు రూ. 600లు కూడా సంపాదిస్తున్నాం. మగవారితో సమానంగా మాకు అన్నిచోట్ల కూలి డబ్బులు చెల్లిస్తున్నారు.

- తాడ్డి జగదీశ్వరి, మహిళా రైతు కూలీ, లక్ష్మీపురం, రాజాం మండలం

నేటి బాలలే రేపటి పౌరులు



బాలల దినోత్సవానికి జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలి
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- ఘనంగా బాలల దినోత్సవం

విజయనగరం: నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని, పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను, సృజనాత్మకతకు పదునుపెట్టాల్సిన అవసరం ఉపాధ్యాయులపై ఉందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మాజీ ప్రధాని చాచానెహ్రూ జయంతిని పురస్కరించుకొని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్, సాయి ఫౌండేషన్ సంయుక్తంగా ఆనందగజపతి కళా క్షేత్రంలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆయన ముఖ్యతిథిగా పాల్గొన్నారు. జెడ్పీ చైర్మన్‌తోపాటు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు కోలగట్ల శ్రావణి, రేవతీదేవి, ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేషన్ కమిషనర్‌లు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన పులి వేషాలు, సాము గరిడీని తిలకించారు. అనంతరం పిల్లలకు విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులపై ఉందన్నారు. ఎంపీ బెల్లాన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. మన విద్యార్థులు ప్రపంచ విద్యార్థులతో పోటీ పడేలా ఆంగ్ల మాధ్యమాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. విద్యా వ్యవస్థలో సమూలమైన సంస్కరణలు తీసుకువచ్చి ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని చెప్పారు. సమావేశంలో కార్పొరేషన్ విద్యా కమిటీ సభ్యులు బాలి పద్మావతి, సంతోషి కుమారి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



చిన్నారుల పులివేష ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని వివిధ కేటగిరీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణ కుమారి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్ఎన్‌సీయూలో స్టాఫ్‌నర్సు-2 పోస్టులు (ఎస్సీ మహిళ, ఓసీ జనరల్), సపోర్టింగ్ స్టాఫ్ నర్సు పోస్టు-1 (ఓసీ ఎక్స్‌సర్వీస్‌మేన్), సెక్యూరిటీ గార్డు-1 (ఎస్సీ జనరల్), ఎన్ఆర్‌సీలో కుక్‌కమ్ కేర్ టేకర్ పోస్టు-1 (ఓసీ జనరల్), వార్డు క్లీనర్-1 (ఓసీ పీహెచ్, వీహెచ్(మహిళ) పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే, ఎన్ఎంహెచ్‌పీకి సంబంధించి సైకియాట్రిక్ సోషల్ వర్కర్ పోస్టు-1(ఎస్సీ మహిళ), కేస్ రిజిస్టర్ అసిస్టెంట్ పోస్టు-1 (ఓసీ మహిళ), ఆర్‌కేఎస్‌కే కన్సల్టెంట్ పోస్టు-1 (ఓసీ మహిళ), ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ పోస్టులు-2 (ఓసీ మహిళ, ఎస్సీ మహిళ), జిల్లా సత్వర చికిత్స కేంద్రం డీఈఐసీ)కు సంబంధించి ల్యాబ్ టెక్నీషియన్-1 (ఓసీ జనరల్) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు విజయనగరం.ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

16,17 తేదీల్లో పాలిటెక్నిక్ ఫెస్ట్-2022



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆశారమణి

- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి

విజయనగరం రూరల్: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 16, 17 తేదీల్లో జిల్లా కేంద్రంలోని ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్-2022ను విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ జె. ఆశారమణి విద్యార్థులకు పిలుపునిచ్చారు. పూల్‌భాగ్‌లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పాలిటెక్నిక్ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం, వారిలోని సాంకేతిక ప్రతిభను ప్రదర్శించేందుకు ఒక వేదికను అందించాలనే లక్ష్యంతో ఈ ఫెస్ట్‌ను ఏర్పాటుచేస్తున్నట్టు వెల్లడించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పరిధిలోని 5 ప్రభుత్వ పాలిటెక్నిక్, 17 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. వారంతా కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ విభాగాల్లో 54 ప్రాజెక్టులు ప్రదర్శిస్తారని చెప్పారు. వీటిలో రెండు ఉత్తమ ప్రదర్శనలను ఎంపికచేసి మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు నగదును అందిస్తామని చెప్పారు. అలాగే, ఈ నెల 24 నుంచి 26 వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి టెక్ ఫెస్ట్‌లో పాల్గొనే 15 ఉత్తమ ప్రాజెక్టులను ప్రదర్శనలో ఎంపికచేస్తామన్నారు.

ఫెస్ట్ ప్రారంభోత్సవానికి మంత్రి బొత్స

ప్రదర్శన ప్రారంభోత్సవానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. సమావేశంలో చినమేరంగి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.విజయలక్ష్మి, విద్యార్థి వ్యవహారాల సలహాదారు ఎస్వీ రమణ, ఫెస్ట్ కోఆర్డినేటర్ సీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై నిఘా



సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

- ఎస్ఈబీ దాడులతో సారా అక్రమ రవాణాకు చెక్
- రుణయాప్‌లపై విస్తృత అవగాహన
- గంజాయి రవాణా కట్టడికి ప్రత్యేక చెక్‌పోస్టుల ఏర్పాటు
- ఏసీబీ 14400 మొబైల్‌యాప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

విజయనగరం క్రైమ్: జిల్లాలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, సైబర్ క్రైమ్ కేసుల సంఖ్య పెరుగుతోందని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించినట్టు రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. విజయనగరం జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఊరూరా అవగాహన సదస్సులు నిర్వహించి సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామన్నారు. సారా తయారీదారులు, విక్రయదారులకు వేరే వృత్తుల్లో ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. సారా నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం బీసీ, ఎస్సీ కార్పొరేషన్, వివిధ స్కీమ్‌లతో 3,400 కుటుంబాలకు ఉపాధి కల్పిస్తోందని వెల్లడించారు. అవినీతిని నిర్మూలించేందుకు ప్రభుత్వం రూపొందించిన 14400 మొబైల్ యాప్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్స్‌లో రుణయాప్‌లు లోడ్ చేయడం, అన్ని ఆప్షన్లకు అనుమతులివ్వడంతో మన కాంటాక్ట్స్, ఫొటోలు, లొకేషన్ తదితర డేటా అంతా వారి చేతుల్లోకి వెళ్లిపోతుందన్నారు. వీటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు అధికారులు కూడా అనధికార వ్యక్తులు బ్యాంకు ఖాతాలు తెరిచే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలు చేసే ఖాతాలపై నిఘా పెట్టాలన్నారు. సమావేశంలో శాంతిభద్రత విభాగం అదనపు డీసీ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్, విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ, ఎస్పీ ఎం.దీపిక తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాకు చెక్

జిల్లా పోలీసుల చర్యలతో గంజాయి రవాణాకు చెక్ పడిందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగును నియంత్రించామని చెప్పారు. మన రాష్ట్రం వలే ఇతర రాష్ట్రాల్లో కూడా గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టారన్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టుల కార్యకలాపాలు ఉన్నాయని డీజీపీ పేర్కొన్నారు. మావోల చర్యలను నియంత్రించేందుకు ఎప్పటిలానే పోలీసుశాఖ చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు. జిల్లాల పునర్విభజనతో ఏర్పడిన ఇబ్బందులను ఇప్పటికే చాలా వరకూ పరిష్కరించినట్టు వెల్లడించారు. సిబ్బంది సర్దుబాటు, వాహనాలు, మౌలిక వసతుల కల్పన వంటి అంశాల్లో చాలావరకూ సమస్యలు లేకుండా పరిష్కరించామన్నారు. త్వరలో పోలీస్ నియామక ప్రకటనను ప్రభుత్వం జారీచేయనుందన్నారు.

కేసులు రాజీ చేయించడం భేష్

లోక్ అదాలత్‌ల ద్వారా 2,200 పైబడి కేసులను రాజీచేయించడం అభినందనీయమని డీజీపీ పేర్కొన్నారు. జిల్లా పోలీసులు పనితీరు బాగుందన్నారు. ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఆయనకు సాయుధ బలగాలు గౌరవవందనం చేశాయి. అనంతరం ఆయన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కాన్ఫరెన్స్‌హాల్‌లో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించి, నేరాల నియంత్రణపై దిశా నిర్దేశం చేశారు. మహిళా సంరక్షణ పోలీసుల సహకారంతో క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. ఎస్పీ ఎం.దీపిక జిల్లాలో నమోదైన కేసులు, వాటి పరిష్కారానికి పోలీసు శాఖ చేపట్టిన చర్యలు, పండగల సమయంలో బందోబస్తు నిర్వహణ, పునర్విభజన సమయంలో సిబ్బంది సరద్దుబాటు వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీజీపీకి వివరించారు. పది పోలీస్‌స్టేషన్ల పరిధిలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నియంత్రణకు చర్యలు చేపట్టామన్నారు.

క్లుప్తంగా

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

• ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి తదితరులు

విజయనగరం ఫోర్ట్: బాలల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిదీ అని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి బి. శాంతకుమారి పేర్కొన్నారు. జిల్లా ఫోరమ్ ఫర్ చైల్డ్‌రైట్స్ గ్రూప్ ఆధ్వర్యంలో రుపొందించిన సమానత్వం సమ్మిళితం బాలల అందరికి అందిద్దాం అనే వాల్ పోస్టర్లను స్థానిక స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతర్జాతీయ బాలల హక్కుల ఒప్పందంలో భారతదేశం సంతకం చేసి సభ్య దేశంగా కొనసాగుతున్న తరుణంలో బాలల హక్కుల పరిరక్షణకు అనేకమైన చర్యలు కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్నాయన్నారు. బాలలే మన దేశ భవిష్యత్తు అని తెలిపారు. గర్భంలో శిశువు పడినప్పటి నుంచి 18 సంవత్సరాల వరకు ఉన్న బాలలందరి సమగ్రమైన అభివృద్ధికి అనేక పథకాలు ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో చైల్డ్‌రైట్స్ ఫోరం జిల్లా చైర్మన్ పి.చిట్టిబాబు, డీసీపీయూ అరసవిల్లి నాయుడు, కె.వరలక్ష్మి, శివప్రసాద్, బొంగా భానుమూర్తి, విద్యాసాగర్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కారు-బైక్ ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు



ప్రమాద దృశ్యం

కురుపాం: మండలంలోని మూలిగూడ జంక్షన్ సమీపంలో సోమవారం మధ్యాహ్నం అతి వేగంగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న పాడి పంచాయతీ బూర్జమానుగూడ గ్రామానికి చెందిన సోమయ్య, కుమారికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిద్దరినీ కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం తీవ్రగాయాలైన సోమయ్యను మెరుగైన వైద్య సేవలు కోసం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కురుపాం పోలీసులు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సముద్రంలో మునిగిపోయిన ముగ్గురు పర్యాటకులు

• ఒడ్డుకు చేర్చిన మెరైన్ హోంగార్డులు



సురక్షితంగా బయటపడిన పర్యాటకులతో మెరైన్ పోలీసులు

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి బీచ్‌లో సోమవారం ముగ్గురు పర్యాటకులు మునిగిపోవడంతో విధుల్లో ఉన్న మెరైన్‌హోంగార్డులు వారిని క్షణాల్లో కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కొండములగాం గ్రామానికి చెందిన బోనెల గోవింద, రణస్థలానికి చెందిన కెల్ల వెంకటేష్, విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం సతివాడకు చెందిన మీసాల రమణలు చింతపల్లి బీచ్‌కు వచ్చారు. కాసేపు ఆనందంగా గడిపి అత్యుత్సాహంతో కెరటాలకు ఎదురు వెళ్లి మునిగిపోయారు. ఆ సమయంలో బందోబస్తులో ఉన్న మెరైన్‌పోలీసులు గమనించి క్షణాల్లో స్పందించి స్థానిక మత్స్యకారుల సహకారంతో ముగ్గురు పర్యాటకులను కాపాడారు. పర్యాటకులను కాపాడిన హోంగార్డులు అనిల్, రాముడు, అమ్మోరులను పలువురు అభినందించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	52,640-00
బంగారం(22సి. 10గ్రా.)	48,260-00
వెండి (కిలో)	67,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

మంచి పుస్తకంతో.. మనిషి జీవితంలో మార్పు

• జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
• 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: మంచి పుస్తకాలు, మనిషి జీవితంలో గొప్ప మార్పును తీసుకువస్తాయని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు సమాజం పట్ల అవగాహన అవసరమన్నారు. గొప్ప గొప్ప రచయితల రచనల ద్వారా సమాజం, వివిధ అంశాలపట్ల అవగాహన పెంచుకోవచ్చని అభిప్రాయపడ్డారు. పుస్తకాలు సమాజంలో ఎన్నో మార్పులకు దోహదం చేశాయని పేర్కొన్నారు. పుస్తక పఠనం ప్రతి ఒక్కరికీ అవసరమని మంచి పుస్తకాలను అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలని కోరారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఎన్నో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గ్రంథాలయాల్లో మరిన్ని మౌలిక వసతులను కల్పించి, మంచి పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. గ్రంథాలయాల అభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి తమ వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన బాల క్రీడాకారుడు, స్కేటింగ్‌లో విశేషప్రతిభ చూపుతున్న సాయి కౌశిక్‌ను అన్ని విధాలా ప్రోత్సహిస్తామని జెడ్పీచైర్మన్ హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి మాట్లాడుతూ సమాజ వికాసంలో గ్రంథాలయాల ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. పిల్లలు టీవీలు, సెల్ ఫోన్లకు పరిమితం కాకుండా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పెద్దవారు కూడా పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవడమే కాకుండా పిల్లల్లో పుస్తక పఠాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈఓ కె.వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.లలిత, డాక్టర్ ఎ.గోపాలరావు, మసుమర్తి సన్యాసిరావు తదితర ప్రముఖులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి: కలెక్టర్ సూర్యకుమారి



మోడల్‌స్కూల్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం పూల్‌బాగ్: ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పిలుపునిచ్చారు. పుస్తకాలు జ్ఞాన సముపార్జనకు సోపానాలని ఆమె పేర్కొన్నారు. స్థానిక అయ్యప్పనగర్‌లోని ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం జరిగిన 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి పుస్తకాలు ఒక మార్గమని సూచించారు. ప్రతి విషయాన్ని స్వయంగా చూసి, అనుభవించి తెలుసుకోవడం కంటే, పుస్తకాలను చదవడం ద్వారా కూడా ఆయా అంశాలపట్ల అవగాహన కల్పించుకోవచ్చని అభిప్రాయ పడ్డారు. కాల్పనిక సాహిత్యం కంటే, మహనీయుల జీవిత చరిత్రలు, వారు రాసిన పుస్తకాలు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అంశాలను అధ్యయనం చేయాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ పుస్తక పఠనం చాలా అవసరమన్నారు. ప్రతిరోజూ పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, కొత్త అంశాలను తెలుసుకోవడమే కాకుండా, కొత్తకొత్త పదాలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్‌లలిత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రుక్సానా సుల్తానా, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ అర్జీలే అధికం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: రెవెన్యూ శాఖకు సంబంధించి అర్జీలు తగ్గడం లేదు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు ప్రజలు నేరుగా వచ్చి ఇస్తున్న వినతుల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖలో మ్యూటేషన్ ప్రక్రియ అక్రమాలు ఉంటున్నాయి. తాజాగా సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన 155 వినతులలో 74 అర్జీలు రెవెన్యూ శాఖ చెందినవే ఉన్నాయి. మిగిలిన వాటిలో వైద్యశాఖ 32, డీఆర్‌డీఏ 17, మున్సిపల్ శాఖ 13, హౌసింగ్ 7, పంచాయతీ రాజ్ శాఖ 5, మాన్యువల్‌గా 7 వినతులు ఉన్నాయి. ముఖ్యంగా సదరం, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, భూ సమస్యలు, గృహాల కోసం విజ్ఞప్తులు వచ్చాయి. వినతులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్, సబ్‌కలెక్టర్ సుదర్శనదొర, సూర్యనారాయణ, పద్మావతి స్వీకరించారు. రీ ఓపెన్ వినతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అర్థవంతమైన సమాధానాలను ఇవ్వాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

ఎస్పీ స్పందనకు 28 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి 28 ఫిర్యాదులను డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులతో స్వయంగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చట్టపరిధిలో చర్యలు చేపట్టి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీసీ సీఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం శ్రీశ్రీ ఇక లేరు



జనార్దన్ మాస్టారు (ఫైల్)

పార్వతీపురంటౌన్: సాహితీ అభిమానులు పార్వతీపురం శ్రీశ్రీగా అభివర్ణించే బంటుపల్లి జనార్దన్ మాస్టారు (85)సోమవారం అనారోగ్యంతో కన్నుమూశారు. సాంస్కృతిక వేదిక ఏదైనా శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానంలోని కవితలను అనర్గళంగా చదువుతూ సభ్యులను ఉర్రూతలూగించే మాస్టారి మరణం తీరని లోటని ఉత్తరాంధ్రకు చెందిన కవి, రచయిత గంటేడ గౌరునాయుడు ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన మృతి పట్ల స్థానిక రచయితలు, కవులు, కళాకారులు సంతాపం వెలిబుచ్చారు.

పవన్‌వి దిగజారుగుడు ఆలోచనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

• ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం సిటీ: రాష్ట్రంలో ఉనికి కోసం జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ దిగజారుడు ఆలోచనలు చేస్తూ నీచరాజకీయాలకు పాల్పడుతున్నారని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు విమర్శించారు. పసలేని పవన్ కల్యాణ్ ఏం ముఖం పెట్టుకుని జనం మధ్యకు వస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అర్హులైన అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇల్లులేని పేదలందరికీ నవరత్నాలు పథకాల్లో భాగంగా సొంతింటి కల నెరవేరుస్తుంటే, ఏమీ జరగలేదని చెప్పే ప్రయత్నం చేయడం పవన్ కల్యాణ్ అవివేకానికి నిదర్శనమన్నారు. అజ్ఞానంతో రాజకీయాల్లోకి అడుగుపెట్టి అంతటితోనే ఆగిపోయాడని ఎద్దేవా చేశారు. నిజానిజాలను పక్కకు నెట్టడం సరికాదని, వాస్తవాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని హితవు పలికారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ఇచ్చిన 600 హామీలు ఒక్కటికూడా నెరవేర్చలేదని, ఆ విషయాన్ని ఎందుకు ప్రశ్నించలేదని దుయ్యబట్టారు. ప్రతిపక్ష నేతలు పచ్చమీడియాను అడ్డం పెట్టుకుని తక్కువ రేటుకు ఇంటి నిర్మాణం కష్టమంటూనే మరోవైపు దోచిపెడుతున్నారంటూ తప్పుడు రాతలు రాయిస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. టీడీపీ ఐదేళ్లలో చేసిన అవినీతి అక్రమాలను సరిచేసుకుంటూనే రాష్ట్రంలో మంచి వాతావరణాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కల్పిస్తున్న విషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. పసలేని ఆరోపణలు చేస్తున్న ప్రతిపక్షాలు, ఎల్లో మీడియాను సామాజిక స్పృహ కలిగిన వారంతా నిలదీయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ఎప్పటికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ప్రజలు ఉంటారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టౌన్, రూరల్, వంగర కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, కరణం సుదర్శనరావు, పాట్నూరు లక్ష్మణరావు, వంజరాపు విజయ్ కుమార్, యాలాల వెంకటేష్, గెడ్డాపు అప్పలనాయుడు, వావిలపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వీఆర్వోపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

• పనుల కోసం వెళ్తే తూలనాడుతున్నారంటూ ఆరోపణ




వీఆర్వోపై తహసీల్దార్ గణపతిరావుకు ఫిర్యాదు చేస్తున్న శ్రీదేవి కుటుంబసభ్యులు

రామభద్రపురం: ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర అవసరాల కోసం చేసుకున్న దరఖాస్తులను స్వీకరించి, పరిష్కరించేందుకు సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సచివాలయాల వల్ల ఎంతో లబ్ధికలుగుతున్నా పాత వాసనలు పోని కొందరు వీఆర్వోల వల్ల నేటికీ దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సచివాలయం-3 పరిధిలోని వీఆర్వో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసిన తనను పరుష పదజాలంతో తూలనాడుతూ అగౌరవపరుస్తున్నారని మండలకేంద్రంలోని శ్రీరానగర్ కాలనీకి చెందిన పసుపులేటి శ్రీదేవి సోమవారం తహసీల్దార్ పి.గణపతిరావుకు రాత పూర్వకంగా ఫిర్యాదుచేశారు. పనుల కోసం వెళ్లిన వారిని వీఆర్వో కసురుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. నీకు కార్డు చేయను. నావల్ల కాదు. నా వద్దకు రావద్దు పొమ్మంటున్నారని శ్రీదేవితో పాటు ఆమె భర్త సత్యనారాయణ, కుమార్తె ప్రియాంక తహసీల్దార్ ముందు కన్నీటి పర్యంతమయ్యారు. విజయనగరంలోని కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యమంలో వినతి ఇచ్చిన అనంతరం దరఖాస్తు పరిశీలించాలని పౌరసరఫరాల అధికారి ఆదేశించానా కనీసం ఒక్కరోజైనా వీఆర్వో పరిశీలనకు రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. దరఖాస్తు పరిశీలించలేదు సరికదా రేషన్ కార్డు ఎవరిస్తారో చూస్తానంటూ తిరిగి తమపై ఆగ్రహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ గణపతిరావును వివరణ కోరగా ఈ సమస్య తన వద్దకు రాలేదని ఇక నుంచి వీఆర్వో వద్దకు వెళ్లవద్దని, తన దగ్గరకు రావాలని ఫిర్యాదు దారులకు చెప్పారు. వీఆర్వోతో సమావేశమై సమస్య పట్ల చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇదే సమస్యపై ఈ నెల 11వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుదారు, వీఆర్వో పెద్ద పెద్ద కేకలతో వాగ్వాదానికి దిగడం విశేషం.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

• డీఎస్పీ సుభాష్



వాహన తనిఖీలు చేస్తున్న డీఎస్పీ సుభాష్

పార్వతీపురంటౌన్: మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులపై చర్యలు తప్పవని పార్వతీపురం డీఎస్పీ సుభాష్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలోని వెంకంపేట గోరీల వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనర్లు వాహహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున వాహన యజమానులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. మద్యంమత్తులో వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. వాహన చోదకులు లైసెన్స్‌తో పాటు వాహన అనుమతి పత్రాలను కలిగి ఉండాలని, లేకుంటే అపరాధ రుసుం విధిస్తామన్నారు. ఇంటి వద్ద బయలుదేరి మళ్లీ ఇంటికి క్షేమంగా చేరుకోవాలని, భార్యాపిల్లలు ఉన్నారన్న ధ్యాస ప్రతి ఒక్కరిలో ఉండాలని హితవు పలికారు. రహదారి భద్రత నియమాలను పాటిస్తూ రోడ్డుప్రమాదాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు సకాలంలో పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

• కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. స్పందన కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్, జేసీ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకటరావులు వివిధ గ్రామాలనుంచి వచ్చిన 90 మంది అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథ రావు, జిల్లా పశుసంవర్థక అధికారి ఎ. ఈశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, పీఆర్ ఈఈ ఎంవీఆర్ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ ఒ.ప్రభాకర రావు, హౌసింగ్ పీడీ పి.రఘురాం, డీఈఓ ఎస్‌డీవీ రమణ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎండి.నాయక్, ఐసీడీఎస్ పీడీ వరహాలు, మలేరియా అధికారి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల వివరాలు కొన్ని..

సీతంపేట మండలం కేపీ ఈతమానుగూడ గ్రామ పంచాయతీ తైలబుగూడ, నీలంగూడ గ్రామాల్లోని చిన్నారులు చదువుకునేందుకు వీలుగా తైలబుగూడ గ్రామంలో పాఠశాలను నిర్మించాలని ఆయా గ్రామస్తులు కోరారు. 'సీతంపేట మండలం పెద్దగూడబ పంచాయతీ జంపరకోట నుంచి అచ్చబ గ్రామానికి రహదారిని పునరుద్ధరించాలని గ్రామసర్పంచ్ బాపయ్యతో పాటు గ్రామస్తులు అర్జీ అందజేశారు. 'కురుపాం మండల తిత్తిరి గ్రామానికి సచివాలయం, సెల్ టవర్ నిర్మించాలని గ్రామస్తుడు హెచ్.గోవింద్‌తో పాటు ఇతరులు కోరారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు: జిల్లా అదనపు ఎస్పీ

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్ కోరారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, వారి సమస్యలను చట్ట పరిధిలో తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను వారం రోజుల్లోగా పరిష్కరించి, జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదికలు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ ఎన్.శ్రీనివాస రావు, ఎస్సై దినకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విజేతలకు అభినందన



మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా క్రీడాకారులను ఎమ్మెల్సీ, జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరు రఘురాజు అభినందించారు. ఈ మేరకు సోమవారం నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో జరిగిన కార్యక్రమంలో ఇటీవల విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో సమావేశమయ్యారు. ఈ పోటీల్లో 62 బంగారు, 38 వెండి, 23 కాంస్య పతకాలను విజయనగరం జిల్లా క్రీడాకారులు సాధించడం గర్వకారణమని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు పేర్కొన్నారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 11,12,13 తేదీల్లో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో జరగనున్న మాస్టర్స్ జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించడంతో పాటు జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆల్తి త్రినాథరావు, మజ్జి శంకరరావు, పైడిరాజు, కుమార్, సాగర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం


విద్యార్థికి ప్రశంస పత్రం అందజేస్తున్న రామేశ్వరిప్రభు

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీపై అవగాహన అవసరమని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి రామేశ్వరి ప్రభు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బాలికల ఆరోగ్యం అనే అంశంపై సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ ఏవిధంగా వ్యాప్తి చెందుతుంది, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అనంతరం క్విజ్ పోటీలో విజేతలకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీపీఎం బాలాజీ, ప్రిన్సిపాల్ గౌరీశ్వరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి


పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

విజయనగరం: నగరంలో పారిశుద్ధ్య మెరుగుదలకు ప్రత్యేక బృందాలతో పర్యవేక్షిస్తున్నామని కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు అన్నారు. అన్ని డివిజన్ల పరిధిలో మొత్తం 230 మంది కార్మికులతో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేసినట్లు చెప్పారు. డ్రైనేజీల శుభ్రత, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

గుంకలాంలో 'ఫ్యామిలీ డాక్టర్'

విజయనగరం రూరల్: మండలంలోని గుంకలాం గ్రామంలో సోమవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. రాకోడు పీహెచ్‌సీ వైద్యురాలు శ్రావణి, వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ పర్యటించి వైద్య సేవలు అందించారు. రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి వద్దకే వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ నారాయణ, సర్పంచ్ కునుకు వెంకటరావు, వైద్యులు యశ్వంత్, ఏఎన్‌ఎం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ భార్గవి పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి

నెల్లిమర్ల: బాలలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు నిరంతర సాధన చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి సూచించారు. పట్టణంలోని కేజీబీవీలో సోమవారం నిర్వహించిన జాతీయ బాలల దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాలలు తప్పనిసరిగా తమ హక్కులను తెలుసుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ బి.ఉమా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, పానల్ అడ్వకేట్ వి.శ్రీదేవి, నేచర్ చైల్డ్‌లైన్ మేనేజర్ జీకే దుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సముద్ర మార్గ చొరబాట్లపై నిఘా


మాట్లాడుతున్న సీఐ కేకేవీ విజయనాథ్

భోగాపురం: తీరప్రాంతంలో సముద్ర మార్గం ద్వారా వచ్చే ఉగ్రవాదులను నిలువరించేందుకు ఏటా 'సాగరకవచం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐ కేకేవీ విజయనాథ్ తెలిపారు. నేటి నుంచి భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో రెండు రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. సముద్ర మార్గం గుండా చొరబాట్లను అడ్డుకునేందుకు నిఘా పటిష్టం చేశామన్నారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు రెండు మండలాల్లోని 17 మత్స్యకార గ్రామాలతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ఆయనతో పాటు మెరైన్ సీఐ వైకుంఠరావు ఉన్నారు.

వేడుకగా సీతారాముల కల్యాణం

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండ రోడ్డులో ఉన్న ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని సోమవారం వేడుకగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు పీవీజీ చాణక్య, జీఎస్ హర్ష ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్నపనం, పంచామృతభిషేకం, సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా చేశారు. ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు పాల్గొన్నారు.


నెల్లిమర్ల రూరల్: సారిపల్లి దిబ్బేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన


విజయనగరం టౌన్: అయ్యకోనేరు దక్షిణగట్టుపై రావి, వేప చెట్టు మధ్యలో వెలసిన శివలింగానికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు


నెల్లిమర్ల రూరల్: జోగిరాజుపేట ఉమాచంద్రశేఖర స్వామి ఆలయ ప్రాంగాణంలో లక్ష దీపారాధన


డెంకాడ: చింతలవలస ఉమామహేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులకు వెండి కిరీటాన్ని అందిస్తున్న పిన్నింటి అప్పలనాయుడు

హరహర మహాదేవ..

- మార్మోగిన శివనామస్మరణ
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

విజయనగరం టౌన్:

కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. హరహర మహాదేవ.. శంభోశంకర.. అంటూ శివ నామస్మరణతో మార్మోగాయి. పట్టణంలోని రింగు రోడ్డులో ఉన్న పశుపతినాథేశ్వరస్వామి ఆలయంలో స్పటిక లింగాకారునికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ ఆవరణలో 75 మంది దంపతులు రుద్రాభిషేకం నిర్వహించుకున్నారు. స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్ద ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైన మహాశివునికి అర్చకులు సోమశేఖరాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో లింగోద్భవునికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు నందీశ్వరుని వద్ద, జమ్మి, వేప, చెట్ల వద్ద దీపారాధన చేశారు. అదేవిధంగా మూడుకోవెళ్లు, శివాలయం వీధిలో ఉన్న ఉమారామలింగేశ్వరునికి, కొత్త అగ్రహారం శివాలయంలో స్వామివారికి విశిష్ట పూజలు నిర్వహించారు.

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన ఆలయక్షేత్ర పాలకులైన ఉమాసదాశివ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకస్వామి మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో శివుడికి పంచామృతాలతో అభిషేకం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సారిపల్లిలోని పురాతన దిబ్బేశ్వరస్వామి ఆలయంలో భక్తులు దీపారాధన చేశారు.


విజయనగరం టౌన్: పశుపతినాథేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణలో ఉన్న మహాశివుడు


విజయనగరం టౌన్: ఉమారామలింగేశ్వర ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

– డెంకాడ: మండలంలోని చింతలవలస ఐదవ ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న ఉమామహేశ్వస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చింతలవలస మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిన్నింటి అప్పలనాయుడు, బంగారమ్మ దంపతులు స్వామివారికి కిలోన్నర వెండి కిరీటాన్ని బహూకరించారు. కిరీటాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఎం.గోపాలకృష్ణ, కోరాడ రామునాయుడు అర్చకులకు అందజేశారు.


విజయనగరం టౌన్: కంటోన్మెంట్ గూడ్స్ షెడ్ శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు


విజయనగరం టౌన్: పశుపతినాథేశ్వర ఆలయంలో భక్తులు తాకిడి


నెల్లిమర్ల రూరల్: ఉమాసదాశివుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలను చూడకుండగా..అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని అక్కివరం గ్రామంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పతకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు చేకూరిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా ఈ మూడున్నరేళ్లలో అక్కివరం పంచాయతీకి రూ.21.50 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. గ్రామ సచివాలయం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేస్తోందన్నారు. 'గడపగడపకు' కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, పోలిపల్లి సొసైటీ అధ్యక్షుడు బాలి సత్యనారాయణ పాల్గొన్నారు.


ప్రభుత్వం అందించిన ఆర్థిక ప్రయోజనాలను లబ్ధిదారుకు వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

బాల్యం చాలా విలువైనది

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె.అప్పారావు

విజయనగరం ఫోర్ట్: బాల్యం చాలా విలువైనదని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. స్థానిక చైతన్య స్కూల్లో నిర్వహించిన బాలల దినోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలివితేటలకు మార్కులు కొలమానం కాదన్నారు. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ బి.వెంకటరావు, జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారిత అధికారి బి.శాంతకుమారి, బాలల న్యాయ మండలి సభ్యులు వి.లక్ష్మణరావు, డీసీపీయూ ఎం.అరసవిల్లినాయుడు పాల్గొన్నారు.

బాలలతో ప్రేమగా నడుచుకోవాలి

విజయనగరం ఫోర్ట్: బాలలతో ప్రేమగా నడుచుకోవాలని బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ జి.హిమబిందు అన్నారు. నేచర్ చైల్డ్‌లైన్ 1098 సంస్థ, బాలల సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. చిన్నారుల ఇష్టాలను తెలుసుకుని వారిని ప్రోత్సహించాలని, బాలల హక్కులు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. బాలల సంక్షేమ కమిటీ సభ్యులు భవాని, సుధారాణి, నేచర్ చైల్డ్‌లైన్ 1098 సంస్థ కోఆర్డినేటర్ మీన, కౌన్సిలర్ దుర్గ, బంగారుబాబు, సుబ్బలక్ష్మి, గౌరి పాల్గొన్నారు.

ప్రేమాలయంలో బాలల దినోత్సవం

విజయనగరం టౌన్: దేవుని ఆశీస్సులు చిన్నారులందరిపైనా ఉండాలని బిషప్ డాక్టర్ ఎం.ఎ.పాల్ (విశాఖ) ప్రార్థించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని యేసుప్రేమాలయం ఆధ్వర్యంలో స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చిన్నారుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. దైవ కృపతో వారంతా భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చిన్నారులతో కలిసి బెలూన్లు ఎగురవేశారు. పాస్టర్ అలజంగి రవికుమార్, నాగేశ్వరరావు, విక్టర్‌బాబు, సూర్యనారాయణ, యూత్ ఫర్ జీసెస్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.


విజయనగరం టౌన్: బెలూన్లు ఎగురవేస్తున్న చిన్నారులతో బిషప్ డాక్టర్ ఎం.ఎ.పాల్


విజయనగరం ఫోర్ట్: స్త్రీ,శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి మెమొంటో అందజేస్తున్న అప్పారావు

సంక్షిప్తంగా...

నేడు క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

భోగాపురం: రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న సీఎం ప్రైజ్‌మనీ క్రికెట్ టోర్నమెంట్‌కు నెల్లిమర్ల నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ క్రికెట్ ఇన్‌చార్జి లీలాకృష్ణ, పీడీ పనసాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17 సంవత్సరాలు దాటిన బాలురు టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తెల్లని యూనిఫాం, సొంత క్రికెట్ కిట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు.

నేడు మంత్రి బొత్స జిల్లాకు రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మంగళవారం ఉదయం 7 గంటలకు జిల్లా కేంద్రంలోని తన నివాసానికి చేరుకుంటారు. ఉదయం 10.30 గంటలకు గరివిడిలో జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.00 గంటలకు విజయనగరంలో బయలుదేరి విశాఖ మీదుగా విజయవాడ చేరుకుంటారు.

16న నీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లకు ఈనెల 16న పబ్లిక్ కుళాయిల ద్వారా నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని కార్పొరేషన్ డీఈఈ అప్పారావు సోమవారం తెలిపారు. నగర ప్రజలకు నీటి సరఫరా చేసే ముషిడిపల్లి రక్షిత మంచి నీటి పథకం నుంచి వచ్చే పైప్‌లైన్ మరమ్మతులను ఈ నెల 15న చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో మరుసటి రోజు 20, 21, 22, 23, 24, 25, 35, 37, 38, 39, 40, 41 డివిజన్‌లలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఈ విషయా న్ని గమనించి సహకరించాలని కోరారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

పూసపాటిరేగ: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని హెచ్‌ఎం బి.శంకర్రావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో సోమవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముత్తూట్ ఫిన్‌కార్ప్ సహకారంతో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ముత్తూట్ ఫిన్‌కార్ప్ బ్రాంచ్ మేనేజరు జగదీష్‌తో పాటు ఉపాధయాయులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియో పెంపుపై గౌడ సంఘం హర్షం

విజయనగరం పూల్‌బాగ్: నూతన పాలసీతో గీత కార్మికులు సంబరాలు చేసుకుంటున్నారని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఎక్స్‌గ్రేషియో రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలుకు పెంచడం మంచి పరిణామమని గౌడ కార్పొరేషన్ డైరెక్టరు వై.భవానీ అన్నారు. స్థానిక యూత్ హాస్టల్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గీత కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు ఎం.రామకృష్ణ, ఎస్.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, జె.నాగేశ్వరరావు, వీవీ రమణ, వై.గణేష్, బి.సంతోష్, ఆర్.సావిత్రి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు

నెల్లిమర్ల: మండల పరిషత్ ప్రాంగణంలోని భవిత కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను దివ్యాంగులైన చిన్నారులు వినియోగించుకోవాలని ఎంపీడీఓ జి.గిరిబాల పిలుపునిచ్చారు. స్థానిక భవిత కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రంలో అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను పరిశీలించారు. సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని చిన్నారుల తల్లిదండ్రులను ఆరా తీశారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. దివ్యాంగులైన చిన్నారుల కోసం ప్రభుత్వం ఎన్నో రకాల సేవలను అందిస్తోందన్నారు. ఫిజియోథెరపీతో చిన్నారుల అంగ వైకల్యాన్ని నయం చేయవచ్చన్నారు.

హైందవ ధర్మం విస్తృతానికి ధర్మపథం

విజయనగరం టౌన్: సనాతన హైందవ సంప్రదాయాన్ని ఆంధ్రప్రదేశ్ దేవదాయ, ధర్మదాయశాఖ ఏర్పాటుచేసిన ధర్మపథంతోనే విస్తృతం చేయాలని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఈఓ శ్రీనివాస్ అన్నారు. ఆలయ ఆవరణలో సోమవారం రాత్రి ధర్మపథం కార్యక్రమం నిర్వహించారు. అరకాలగెడ్డ వీధికి చెందిన చప్ప రామచంద్రశేఖర్, సమతాదేవిలు భక్తిగీతాలాపన చేశారు. మృదంగంపై శ్రీనివాస్, వీణపై ఉదయరాణి వారికి సహకరించారు. అనంతరం వారిని ట్రస్ట్ బోర్డు చైర్మన్ రెయ్యి శంకర్‌రెడ్డి సత్కరించారు.

అప్రెంటీస్ మేళాలో 56 మంది ఎంపిక

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళాకు నిరుద్యోగ అభ్యర్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాకు 10 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. మేళాకు 140 మంది అభ్యర్థులు హాజరు కాగా వారిలో 56 మందిని ఎంపిక చేశారు.

సమయాన్ని వృథా చేసుకోవద్దు

- జేఎన్‌టీయూ వీజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ స్వామినాయుడు

డెంకాడ: సామాజిక మాధ్యమాల్లో విలువైన సమయాన్ని వృథా చేయకుండా వ్యక్తిత్వాన్ని, విద్యాప్రమాణాలను మెరుగపరుచుకునేందుకు లెర్నింగ్ సెంటర్లను ఉపయోగించుకోవాలని విజయనగరం గురజాడ జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ గరుగుబెల్లి స్వామినాయుడు విద్యార్థులకు సూచించారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విద్యావంతులు, అక్షరాస్యుల మధ్య ఉన్న సూక్ష్మ వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవాలన్నారు. లైబ్రరీలో ఉన్న పుస్తకాలు, డిజిటల్ మెటీరియల్‌ను వినియోగించుకుని విజ్ఞానాన్ని, సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎల్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, లైబ్రేరియన్ కె.ఉమామహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ శాఖా గ్రంథాలయంలో..

డెంకాడ శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ వై.మహేష్ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ పతివాడ గౌరి, జడ్పీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల వేసి వారోత్సవాలను ప్రారంభించారు.

జేఎన్‌టీయూ జీవీలో..

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం(జీవీ) యూనివర్సిటీలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలోని సాంకేతిక పురోగతి పండిట్ నెహ్రూ దార్శనికత వల్లే సాధ్యపడిందన్నారు. అనేక భారీ పరిశ్రమలను స్థాపించడం ద్వారా దేశంలో సాంకేతిక విప్లవానికి అంకురార్పణ చేశారని గుర్తు చేశారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వర్సిటీ డైరెక్టర్లు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

విజయనగరం అర్బన్: జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. తొలిత పట్టణ వీధుల్లో విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. స్థానిక బాలాజీ జంక్షన్ నుంచి ఎస్వీఎన్, మయూరి హోటల్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా మయూరి కూడలి వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎస్ఎస్ఎస్ఎస్ రాజు, ప్రధాన కార్యదర్శి కె.దయానంద్, సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, మాజీ కార్యదర్శి ఆర్.బాలకృష్ణ, మండల కన్వీనర్ బొడ్డు రామారావు, సంఘం నాయకులు తిరుపతిరావు, చైతన్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ అటానమస్ కళాశాలలో..

పట్టణంలోని మహారాజా అటానమస్ కళాశాల గ్రంథాలయంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి డి.ఎరుకునాయుడు వారోత్సవాల షెడ్యూల్‌ను వివరించారు.

నెల్లిమర్ల: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సోమవారం ఆమె ప్రారంభించారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.

పూసపాటిరేగ: గ్రంథాలయాలు సరస్వతి నిలయాలని గ్రంథాలయ అధికారి పువ్వల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక రాజావీధిలోని గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి కోరారు.

భోగాపురం: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ వై.మహేష్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో సరస్వతీదేవి, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలు వేసి గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు.


నెహ్రూ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, సిబ్బంది


నెల్లిమర్ల: నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సరోజిని, తదితరులు


విజయనగరం అర్బన్: పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

క్రీడల్లో మిమ్స్ విద్యార్థుల సత్తా..

నెల్లిమర్ల: ఇంటర్ మెడికల్ కళాశాలల టోర్నమెంటులో నెల్లిమర్ల మిమ్స్ వైద్య కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఏలూరు జిల్లా ఆశ్రమ మెడికల్ కళాశాలలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో వాలీబాల్‌లో ద్వితీయ, బాల్ బ్యాడ్మింటన్‌లో తృతీయ స్థానాల్లో నిలిచి, పతకాలు సాధించారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని 30 కళాశాలలు ఈ పోటీల్లో పాల్గొన్నాయని కళాశాల పీడీ కళా వెంకటరావు సోమవారం తెలిపారు. విజేతలకు షీల్డ్‌తో పాటు ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారన్నారు. విద్యార్థులను మిమ్స్ చైర్మన్ అల్లూరి సత్యనారాయణరాజు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ప్రవీణ్ వర్మ, లైఫ్ ట్రస్టీ రామకృష్ణంరాజు, డీన్ డాక్టర్ లక్ష్మీకుమార్, ఏఓ గణేశ్ తదితరులు అభినందించారు.

క్లుప్తంగా

లోన్‌యాప్‌లపై అప్రమత్తతే ప్రధానం

డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



విజయనగరం క్రైమ్: లోన్‌యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, యాప్ నిర్వాహకుల వేధింపులతో ఎవరూ ఆత్మహత్యకు పాల్పడొద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ కే రాజేంద్రనాథ్ రెడ్డి కోరారు. విజయనగరం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం పోలీస్ అధికారులతో వివిధ అంశాలపై సోమవారం ఆయన సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రుణాలు తీసుకునే క్రమంలో మొబైల్ యాప్ నిర్వాహకులు అడిగిన వాటన్నింటికీ అనుమతివ్వడం వల్ల మన ఫొటోలు, లొకేషన్, కాంటాక్టు నంబర్స్ తదితర డేటా వారి చేతుల్లోకి వెళ్లిపోతున్నదన్నారు. వాటిని దుర్వినియోగం చేస్తూ వారు అధిక వడ్డీలు వసూలు చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవినీతిని నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 14400 మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టిందని వెల్లడించారు. ఈ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటివరకు 58 కేసులు నమోదు చేశామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగులేకుండా నియంత్రించగలిగామని వివరించారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో మావోయిస్టు కార్యకలాపాలున్నాయని, వారి చర్యలను నియంత్రించేందుకు పోలీస్‌శాఖ చర్యలు చేపడుతున్నదని తెలిపారు. శాంతిభద్రతల విభాగం అదనపు డీజీ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్, విశాఖ రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ, ఎస్పీ ఎం.దీపిక పాల్గొన్నారు.

ఆప్కాస్ సేవలు ప్రశంసనీయం

సాక్షి, అమరావతి: వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యల పరిష్కారం కోసం ఆప్కాస్ చూపుతున్న చొరవ ప్రశంసనీయమని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ నివాస్ అన్నారు. మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్ఐ కార్డులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి ఆప్కాస్ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు.

సచివాలయాల సేవల్లో అంతరాయానికి స్వస్తి

వెంటనే పరిష్కరించేందుకు మాస్టర్ ట్రైనర్లు

- రాష్ట్రవ్యాప్తంగా 400 మందిని సిద్ధం చేస్తున్న గ్రామ వార్డు సచివాలయ శాఖ
- రెవెన్యూ డివిజన్‌కు ముగ్గురు, నగరానికి ఇద్దరు, మున్సిపాలిటీకి ఒకరు
- తొలి బ్యాచ్‌కి సోమవారం నుంచి శిక్షణ
- సచివాలయాల ద్వారా ఇప్పటికే ఐదు కోట్ల సేవలను సొంత గ్రామాల్లోనే పొందిన ప్రజలు



సాక్షి, అమరావతి : ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తెస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ రాష్ట్రవ్యాప్తంగా అత్యున్నత సేవలు అందిస్తోంది. వీటి ద్వారా ప్రజలకు వారి సొంత గ్రామాలు, వార్డుల్లోనే 545 రకాల సేవలు అందుతున్నాయి. ఈ సేవలు అందించే సమయంలో ఏర్పడే సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం 400 మంది మాస్టర్ ట్రైనర్లను నియమిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ముగ్గురు, పట్టణ ప్రాంతాల్లో విశాఖపట్నంలో ఏడుగురు, విజయవాడలో ఐదుగురు, ఇతర కార్పొరేషన్లలో ఇద్దరు, ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ఒకరిని నియమిస్తోంది. సచివాలయాల ఉద్యోగుల్లోనే చురుగ్గా పనిచేసే వారిని ఎంపిక చేసి, శిక్షణ ఇస్తున్నారు. గ్రామ సచివాలయాల కోసం ఎంపిక చేసిన 200 మందికి గ్రామ, వార్డు సచివాలయ శాఖ జాయింట్ డైరెక్టర్ వికాస్ మర్మాట్ ఆధ్వర్యంలో సోమవారం నుంచే గుంటూరు జిల్లా నాగార్జున విశ్వవిద్యాలయంలో శిక్షణ ప్రారంభించారు. వార్డు సచివాలయాల కోసం ఎంపిక చేసిన వారికి 16, 17 తేదీల్లో శిక్షణ ఇస్తారు.

ఇప్పటికే 5 కోట్ల సేవలు పూర్తి

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెనువెంటనే సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటుతో రాష్ట్రంలో పాలనపరమైన అంశాల్లో గణనీయమైన మార్పు వచ్చింది. అంతకు ముందు ప్రభుత్వ ఆఫీసుల్లో పని పూర్తవడం అంటే చాలా కష్టంగా ఉండేది. ప్రజలకు వ్యయ ప్రయాసలతో కూడుకొని ఉండేది. ఎన్నాళ్లు అధికారుల చుట్టూ తిరిగినా పని పూర్తవుతుందో లేదో తెలియని పరిస్థితి. సీఎం జగన్ ప్రవేశపెట్టిన నూతన వ్యవస్థలో ప్రజలకు అవస్థలు తప్పాయి. ఇప్పుడు ఏ పని అయినా వలంటీర్లే ప్రజల వద్దకే వచ్చి చేస్తారు. నగరమైనా, కుగ్రామమైనా.. ఎక్కడ నివాసం ఉండే వారైనా, వారి సొంత గ్రామంలో ఉండే సచివాలయాల్లోనే అన్ని ప్రభుత్వ పనులు జరిగిపోతున్నాయి. 2020 జనవరి 26 నుంచి ఇప్పటి వరకు దాదాపు 5 కోట్ల వినతులు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారానే పరిష్కారమైనట్టు అధికారులు వెల్లడించారు. అవినీతి, పక్షపాతానికి తావు లేకుండా పూర్తి పారదర్శకతతో సేవలు అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయాలను ప్రభుత్వం డిజిటలీకరణ చేసింది. ప్రతి సచివాలయానికి రెండు కంప్యూటర్లు, యూపీఎస్, ఇతర సౌకర్యాలను కల్పించింది. ప్రజల ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలను అందించే 2.60 లక్షల మంది వలంటీర్లకు సెల్ ఫోన్లు అందజేసింది. 33 రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కీలకమైన ఆరు ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు అందజేసే సేవల కోసం రకరకాల మొబైల్ యాప్‌లను రూపొందించింది. ఈ సేవలను ప్రజలకు అందించడంలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఏర్పడితే ఇప్పటిదాకా రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయ శాఖ నుంచి పర్యవేక్షిస్తున్నారు. దీనివల్ల కొద్ది జాప్యం జరుగుతోంది. ఈ జాప్యానికి కూడా తావు లేకుండా సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు మాస్టర్ ట్రైనర్లను సిద్ధం చేస్తోంది. వీరు స్థానికంగానే అందుబాటులో ఉంటారని, ఎక్కడ సమస్య ఉత్పన్నమైనా వెంటనే సరిదిద్దుతారని అధికారులు తెలిపారు.

గ్రామాల్లో నిత్య గ్రంథాలయం వ్యవస్థకు చర్యలు

- దేశంలో తొలిసారిగా డిజిటల్ గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నాం
- మంత్రి బొత్స సత్యనారాయణ
- ఘనంగా 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

సాక్షి, అమరావతి: ప్రతి గ్రామంలో 'నిత్య గ్రంథాలయం' వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సోమవారం ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం గ్రంథాలయ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. దేశంలోనే తొలిసారిగా డిజిటల్ గ్రంథాలయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు. అయ్యంకి వెంకటరమణయ్య స్ఫూర్తితో ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాష్ట్ర, జిల్లా గ్రంథాలయాలకు చైర్మన్లను నియమించిందన్నారు. ఈ వారోత్సవాల్లో అన్ని వర్గాల సలహాలు, సూచనలు తీసుకుని మరిన్ని మార్పులతో భవిష్యత్ తరాల విజ్ఞాన సముపార్జనకు దోహదపడేలా గ్రంథాలయాలను తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీలు కల్పలత రెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్, కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హారిక, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో ఉన్నత విద్యలో ప్రవేశాలు

రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం రికార్డు స్థాయిలో అడ్మిషన్లు జరిగాయని బొత్స సత్యనారాయణ తెలిపారు. డిగ్రీ కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియపై ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావుతో విజయవాడలో మంత్రి సోమవారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గిపోయాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఉత్తీర్ణులైన 3,37,987 మంది విద్యార్థుల్లో దాదాపు 3,15,600 మంది ఉన్నత విద్య కోర్సుల్లో చేరారని చెప్పారు. ఇప్పటి వరకు ఇంజనీరింగ్ కోర్సుల్లో 1.20 లక్షల మంది, మెడికల్, నర్సింగ్ కోర్సుల్లో 15 వేల మంది, వివిధ డిగ్రీ కోర్సుల్లో 1.48లక్షల మంది, ఐఐఐటీ, ఎన్ఐటీ, వంటి కోర్సుల్లో 5,600 మంది ప్రవేశాలు పొందారని వివరించారు.

ఏపీ వైద్య శాఖతో పనిచేయడానికి సిద్ధం

నాథ్‌హెల్త్ సదరన్ చాప్టర్ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ప్రజారోగ్య పరిరక్షణలో విప్లవాత్మక విధానాలతో ముందుకెళ్తున్న ఏపీ వైద్య, ఆరోగ్య శాఖతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రముఖ నాథ్‌హెల్త్ సదరన్ చాప్టర్ ప్రతినిధులు తెలిపారు. వీరు సోమవారం సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్య రంగంలో డిజిటలైజేషన్‌లో రాష్ట్ర వైద్య రంగం దేశంలోనే ప్రథమస్థానంలో ఉండడంపై ప్రశంసించారు. విజయవాడలో సంయుక్త సమావేశాన్ని నిర్వహించడం, క్యాన్సర్ నివారణకు సమగ్ర ప్రణాళికకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం, ఇతర అంశాలపై నాథ్ హెల్త్ ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారు. నాన్–కమ్యూనికబుల్ డిసీజెస్ విషయంలో దీర్ఘకాలిక చర్యలు చేపట్టడం ద్వారా మంచి ఫలితాలు రాబట్టవచ్చని పేర్కొన్నారు. ఐఐటీ, ఐఐఎస్ఈఆర్, టీటీడీ సహకారంతో తిరుపతిని హెల్త్‌కేర్ హబ్‌గా రూపొందించడానికి చర్యలపై చర్చించారు. నాథ్ హెల్త్ సదరన్ చాప్టర్ ప్రతినిధులు శ్రీకాంత్ శ్రీనివాసన్, మున్సి వాధ్వా తదితరులు పాల్గొన్నారు.

• తెలంగాణ

ప్రతికూల వాతావరణంలో తిరిగొచ్చిన కడప విమానం

శంషాబాద్: ప్రతికూల వాతావరణంలో కడప విమానం హైదరాబాద్‌కు తిరిగి వచ్చింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం 10.45 గంటలకు ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన 6ఈ 7254 విమానం 53 మంది ప్రయాణికులతో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి టేక్ ఆఫ్ తీసుకుని కడపకు బయల్దేరింది. అక్కడి విమానాశ్రయానికి చేరుకున్న సమయంలో అక్కడ ఏటీసీ అధికారులు ప్రతికూల వాతావరణం కారణంగా ల్యాండ్ అయ్యేందుకు అనుమతివ్వకుండా విమానాన్ని మళ్లించారు. దీంతో మధ్యాహ్నం 1.30 గంటలకు ఇండిగో విమానం తిరిగి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. విమానాన్ని రద్దు చేసినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆవుల చెంగప్ప మృతి



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రత్యేక ప్రధానకార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆవుల చెంగప్ప(82) సోమవారం మృతి చెందారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. 1979 బ్యాచ్‌కు చెందిన చెంగప్ప గుంటూరు, వరంగల్ జిల్లాల కలెక్టర్‌గా, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా, కడప చక్కెర కర్మాగారం ఎండీగా విధులు నిర్వహించి దేవాదాయశాఖ కమిషనర్‌గా పదవీ విరమణ చేశారు. అనంతరం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. చెంగప్ప వాలీబాల్, టెన్నిస్ క్రీడాకారుడు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టెన్నిస్ టోర్నమెంట్లలో రాష్ట్రానికి సారథ్యం వహించారు. సోమవారం జూబ్లీహిల్స్‌లోని శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు ముగిశాయి. ఆయన మృతిపట్ల పలువురు ఐఏఎస్ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

'ఎమ్మెల్యేలకు ఎర' కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: 'ఎమ్మెల్యేలకు ఎర'కేసు నిందితులు రామచంద్రభారతి తదితరులు దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. ఈ పిటిషన్ సోమవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ అంశంపై తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ కోర్టు విచారణ జరుపుతోందని, సాయంత్రం ఆదేశాలు వచ్చే అవకాశం ఉందని తెలంగాణ న్యాయవాది తెలిపారు. విచారణ వాయిదా వేయాలని కోరారు. అంగీకరించిన ధర్మాసనం వచ్చే సోమవారానికి విచారణ వాయిదా వేసింది.

ఇటు బెయిల్... అటు కస్టడీ

- సీబీఐ అరెస్టుపై బెయిల్ పొందిన అభిషేక్, విజయ్‌నాయర్
- తర్వాత ఐదు రోజుల ఈడీ కస్టడీకి అనుమతించిన ప్రత్యేక కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం అవకతవకలపై సీబీఐ కేసుకు సంబంధించి హైదరాబాద్ వ్యాపారవేత్త అభిషేక్ బోయినపల్లి, ఆప్ కమ్యునికేషన్ ఇంచార్జి విజయ్ నాయర్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు బెయిల్ ఇవ్వగా.. ఈడీ అభ్యర్థన మేరకు ఐదు రోజుల కస్టడీకి అనుమతించింది. అభిషేక్, విజయనాయర్‌ల బెయిల్ పిటిషన్లను విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగపాల్ రూ.2 లక్షల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేశారు. అనంతరం 14 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్ విచారణను చేపట్టి మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ నిమిత్తం ఐదు రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చారు. అభిషేక్ తరఫు న్యాయవాది సింగ్ అభ్యర్థన మేరకు ఈడీ కస్టడీ సమయంలో కుటుంబసభ్యుల సందర్శనకు న్యాయమూర్తి అనుమతించారు.

సుశీ సంస్థల్లో సోదాలు

సుశీ ఇన్‌ఫ్రా, సుశీ అరుణాచల్ హైవేస్, సుశీ చంద్రగుప్త్ కోల్‌మైన్స్‌పై దాడులు

సాక్షి, హైదరాబాద్: మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి చెందిన సుశీ ఇన్‌ఫ్రా అండ్ మైనింగ్ సంస్థపై జీఎస్టీ అధికారులు దాడులు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్డు నం.12లోని సుశీ ప్రధాన కార్యాలయంతో పాటు ఆ సంస్థ, అనుబంధ సంస్థల్లో డైరెక్టర్లుగా ఉన్న కొందరి ఇళ్లపై దాడులు జరిగాయి. సుశీ అరుణాచల్ హైవేస్ లిమిటెడ్, సుశీ చంద్రగుప్త్ కోల్‌మైన్స్ సంస్థల్లో కూడా సోదాలు నిర్వహించారు. పన్నుల శాఖ కమిషనర్ నీతూప్రసాద్ నేతృత్వంలో ఈ తనిఖీలు జరిగాయి. 100 మందికి పైగా అధికారులు 25 బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. పలు కీలక పత్రాలు, సీపీయూ, హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. పన్ను చెల్లింపు లావాదేవీలు, పన్ను ఎగవేత సంబంధిత అంశాలు పరిశీలించేందుకు తనిఖీలు నిర్వహించినట్టు అధికారులు చెబుతున్నారు. సోమవారం ప్రారంభమైన తనిఖీలు రాత్రి వరకు కొనసాగగా, మంగళవారం కూడా కొనసాగే అవకాశముంది.


18న చినమేరంగిలో జాబ్ మేళా



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఈనెల 18న చినమేరంగిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాపై కలెక్టర్ నిషాంత్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయనతోపాటు జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా మేనేజర్ వి.సాయికుమార్ తదితరులున్నారు. అర్హత ఉన్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అథ్లెటిక్స్‌లో ఎస్‌ఈబీ కానిస్టేబుల్ సత్తా..



పతకాలు అందుకుంటున్న జయరాంనాయుడు

బొబ్బిలి: స్థానిక ఎస్ఈబీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జయరామ్ నాయుడు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించినట్లు సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ స్టేడియంలో ఈనెల 12,13 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2022 పోటీల్లో 50ప్లస్ విభాగంలో రేస్ వాకింగ్ పోటీలో పాల్గొని రెండు పతకాలు సాధించినట్లు చెప్పారు. దీంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వెస్ట్ బెంగాల్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. సీఐతో పాటు స్టేషన్ సిబ్బంది సోమవారం జయరాంను ఘనంగా సత్కరించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మందస: మందస పట్టణంలో అంకరబోయిన అప్పలస్వామి(53) అనే వ్యక్తి విద్యుత్ షాక్ తగిలి సోమ వారం మృతి చెందారు. స్థానిక బోయివీధి లో నివాసముంటున్న అప్పలస్వామి(53) ఉదయాన్నే బహిర్భూమి కోసం లేచారు. రాత్రి సమయంలో మెయిన్ లైన్ విద్యుత్ వైర్లు తెగిపడి ఉండడాన్ని ఆయన గమనించకపోవడంతో ప్రమాదవశాత్తూ అవి తగిలి షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు ఓ టీ దుకాణం నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుటుంబం పెద్ద దిక్కు కోల్పోవడంతో భార్య రాధ, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

పచ్చిరాతలే పచ్చ పత్రికల నైజం

- ముఖ్యమంత్రిని విమర్శించే అర్హత వారికి లేదు
- ఒక్కసారి కళ్లుతెరచి చూస్తే ప్రజా సంక్షేమ పాలన కనిపిస్తుంది
- పింఛన్లు, ఇళ్ల మంజూరులో స్పష్టమైన మార్పు తెలుస్తుంది
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు

కొత్తవలస రూరల్: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక పచ్చపత్రికల పచ్చిరాతలను నమ్ముతూ, గాలిమాటలు చెప్పే సినీనటులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొత్తవలస మండలం ముసిరాం గ్రామంలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ 31 లక్షల ఇళ్లను నిర్మిస్తూ, సుమారు కోటి 25 లక్షల మందికి సొంతింటి భాగ్యం కల్పిస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత ప్రతిపక్ష నాయకులకు లేదన్నారు. జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని విడిచిపెట్టి అబద్ధాలను పదే పదే ప్రచారం చేస్తున్న పచ్చపత్రికల తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సచివాలయ వ్యవస్థతో సాకారం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలబెట్టి ప్రజల మన్ననలను ముఖ్యమంత్రి అందుకుంటున్నారన్నారు. గత మూడున్నరేళ్లలో ముసిరాం గ్రామంలో రూ.8.33 కోట్ల లబ్ధిని ప్రజల ఖాతాల్లో జమచేయించారన్నారు. ఒక్కో సచివాలయంలో పదుల సంఖ్యలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రతీ గడపకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. గడిచిన మూడున్నరేళ్లలో ప్రజలకు అందించిన సేవలు, చేయాల్సిన అభివృద్ధిని తెలుసుకునేందుకు శాసనసభ్యులు ప్రజల వద్దకే రావడం గతంలో ఎప్పుడైనా ఉందా అని ప్రశ్నించారు. గతంలో పింఛన్ల కోసం రోజుల తరబడి పంచాయతీ కార్యాలయాల వద్ద లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వచ్చేదని, ఇప్పుడు ప్రతీనెలా ఒకటో తేదీన ఇంటికి వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందజేస్తున్నారన్నారు. విద్యార్థులు, రైతులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, ఇళ్లు, మరుగుదొడ్ల మంజూరు కోసం జన్మభూమి కమిటీ సభ్యుల కాళ్లు పట్టుకోవాల్సి వచ్చేదని, జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ప్రజలందరికీ ప్రభుత్వ సేవలను చేరువచేశారన్నారు. గత ప్రభుత్వ పాలనకు, ఇప్పుడు పాలనకు నక్కకునాకలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీస్సులు, దేవుని దయ ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు నెక్కల శ్రీదేవి, డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, వైస్ ఎంపీపీ కర్రి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మేలాస్త్రి అప్పారావు, వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మత్స్యఎర్రయ్య రామస్వామి, గొర్లె రవి, గొరపల్లి రవి, గేదెల శ్రీనివాసరావు, మెరపల సత్యనారాయణ, చింతల పైడినాయుడు, దమ్ము రమణ, చింతల పైడిరాజు, ఐ.అనీల్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల సర్దుబాటు

- కలెక్టర్ సూర్యకుమారి



విజయనగరం అర్బన్: విలీన అంగన్‌వాడీ కేంద్రాలకు సూపర్‌వైజర్లను తాత్కాలి ప్రాతిపదికన నియమిస్తామని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక సూపర్‌వైజర్ గ్రేడ్–2 నియామకాలు చేపడతామన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల విధులకు ఆటంకం లేకుండా విలీన అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలలో ఉన్నత విద్య అభ్యసించేవారిని సూపర్‌వైజర్లుగా ఎంపిక చేస్తామన్నారు. వారికి నెలకు రూ.5 వేలు అలవెన్స్ రూపంలో చెల్లిస్తామని పేర్కొన్నారు.

కొత్త కమిటీ ఏర్పాటు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ కాలం రెండేళ్లు పూర్తయినందున పాత కమిటీ రద్దు చేసి కొత్త కమిటీని ఏర్పాటు చేసినట్టు సోషల్‌వెల్ఫేర్ డీడీ పి.రత్నం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, సోషల్ వెల్ఫేర్ డీడీ మెంబర్/కన్వీనర్‌గా, ఎస్పీ మెంబర్‌గా, విజయనగరం, విశాఖపట్నం, అరకు ఎంపీలు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు సభ్యులుగా, గెజిటెడ్ ఆఫీషియల్స్‌గా మెప్మా పీడీ వి.సుధాకర్, ఎస్‌డీసీఎల్‌ఏ (టీబీటీయూనిట్–3), మత్స్య శాఖ డీడీ ఎం.నిర్మలాకుమారి, నాన్ అఫీషియల్ మెంబర్స్‌గా రేజేటి జయరాం(రాజాం), బొంగబానుమూర్తి (విజయనగరం), చెన్న శ్రీను (విజయనగరం), గుమ్మడి రత్నావళి (విజయనగరం), ఆశయ యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ (చీపురుపల్లి), యూత్ ఫౌండేషన్ ప్రెసిడెంట్(విజయనగరం), విజయ దుర్గా యూత్‌సొసైటీ ప్రెసిడెంట్ (విజయనగరం)ను సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసినట్టు పేర్కొన్నారు.

చీటింగ్ కేసులో భార్యభర్తలకు జైలు శిక్ష

రాజాం సిటీ: రాజాం పట్టణానికి చెందిన మారుతీ చిట్‌ఫండ్స్ యజమాని గుడ్ల శ్రీనివాసరావు దంపతులకు రాజాం జూనియర్ కోర్టు ఏడాదిన్నర జైలు శిక్ష, రూ.1500లు చొప్పున అపరాధ రుసుం విధించినట్లు రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ సోమవారం తెలిపారు. గతంలో రాజాంలోని వేంకటేశ్వర కాంప్లెక్స్‌లో వీరు చిట్ ఫండ్ నడిపేవారు. 2017లో రాజాం పట్టణం సీతాలక్ష్మి కాలనీకి చెందిన ఏరోతు రుక్మిణికి రూ.4 లక్షలు, రూ.1.50 లక్షలకు సంబంధించి రెండు చీటీల నగదు ఇవ్వలేదు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.శంకరరావు కేసు నమోదు చేసి రాజాం కోర్టులో చార్జిషీట్ దాఖలుచేసినట్లు వివరించారు. నేరం రుజువుకావడంతో చిట్‌ఫండ్ యజమానులకు జైలుశిక్షతో పాటు అపరాధరుసుం విధిస్తూ జడ్జి తీర్పును వెలువరించారన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో బాలబాలికల ప్రతిభ



బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్టు సభ్యులతో అసోసియేషన్ కార్యదర్శి, పీడీలు

రాజాం సిటీ: జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు బాలబాలికలు చక్కని ప్రతిభ కనబరిచారని బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పీవీజీకే రాజు అన్నారు. సోమవారం స్థానిక తృప్తి రిసార్ట్‌లో రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ప్రకాశం జిల్లా చేవూరులో బాలబాలికల సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో బాలికలు వరుసగా మూడు జిల్లాలపై రెండేసి సెట్లతో గెలుపొందగా, బాలురు రెండు జిల్లాలపై రెండేసి సెట్లు గెలుపొందారని తెలిపారు. అనంతరం వర్షం కారణంగా ఛాంపియన్‌షిప్ అర్ధాంతరంగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. దీంతో అప్పటి వరకు జరిగిన మ్యాచ్ ఆధారంగా ప్రాబబుల్స్ ఎంపిక చేశారన్నారు. బాలబాలికలు ఆయా పోటీల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా బాలికల నుంచి ముగ్గురు, బాలురు నుంచి ముగ్గురు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. వీరిలో గతేడాది జాతీయ స్థాయి పోటీల్లో బాలికల విభాగం నుంచి గాయత్రి, నందిని ఉండగా, బాలుర నుంచి హిమంత్, బాలవర్ధన్‌లు ఉన్నారని, ఈ ఏడాది ఒక బాలిక, ఒక బాలుడును ఎంపిక చేయనున్నారని వెల్లడించారు.

నీటిశుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు స్థల పరిశీలన



మెంతిపేటలో స్థల పరిశీలనలో అధికారులు

రాజాం: పట్టణంలోని వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు 10 ఎమ్ఎస్‌టీపీ, ఎస్‌టీపీ ప్లాంట్లు మంజూరయ్యాయని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. ఒకచోట పెద్ద ప్లాంటు, రెండు చోట్ల మీడియం ప్లాంట్లను, మిగిలిన ఏడు చోట్ల చిన్నచిన్న ప్లాంట్లు ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. పట్టణంలోని గోపాలపురం, కొత్తవలస, సంతమార్కెట్, వాసవీనగర్, మెంతిపేట చెరువు, బుచ్చింపేట, పొనుగుటివలస గ్రామాల్లో డ్రైనేజీ నీరు వృథాగా వెళ్లిపోతున్న ప్రాంతాలను సోమవారం పరిశీలించిన ఆయన మొత్తం 10 చోట్ల నీటిశుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు మూడు ఎకరాల మేర స్థలం అవసరం ఉంటుందన్నారు. మురుగునీటిని కూడా ఈ ప్లాంట్ల ద్వారా శుద్ధిచేసి, రీ సైక్లింగ్ చేస్తామన్నారు. ఈకార్యక్రమలో టీపీఓ నాగలత, ఏఈ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగం బలోపేతానికి సీఎం కృషి

- డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు



సహకార జెండాను ఆవిష్కరిస్తున్న చినరామునాయుడు

విజయనగరం ఫోర్ట్: సహకార రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషిచేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు పేర్కొన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో ఆయన సహకార జెండాను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంస్థలు చిన్న, సన్నకారు రైతులకు, బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి పాటుపడుతున్నాయన్నారు. ఏటా నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు దేశమంతటా సహకార వారోత్సవాలు నిర్వహించి సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి పి. రమేష్, డీసీసీబీ సీఈఓ కె.జనార్దన, జనరల్ మేనేజర్ కె.చంద్రరావు, డీజీఎం సత్యనారాయణ, సీహెచ్.ఉమామహేశ్వరావు, ఏజీఎమ్‌లు ప్రసాద్, లక్ష్మణ్‌రావు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి

మడమ తిప్పలేదు... అడుగు ఆపలేదు

పౌరహక్కుల నుంచి పర్యావరణం వరకు ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. జాత్యహంకార బెదిరింపులు ఎన్ని ఎదురైనా ధైర్యమే వజ్రాయుధంగా ముందుకు కదిలారు. కొత్త అడుగుతో చరిత్ర సృష్టించారు. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఘన విజయం సాధించి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన మన వాళ్ల గురించి..


● అరుణా మిల్లర్

మేరీలాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా గెలిచిన అరుణా మిల్లర్ హైదరాబాద్‌లో పుట్టింది. భారత సంతతికి చెందిన వ్యక్తి లెఫ్టినెంట్ గవర్నర్ కావడం ఇదే మొదటిసారి. ఈ విషయంలో అరుణ చరిత్ర సృష్టించింది. మేరీలాండ్‌కు తొలి భారతీయ-అమెరికన్ డెలిగేట్‌గా తన ప్రత్యేకత చాటుకుంది.

మిస్సోరీ యూనివర్శిటీలో సివిల్ ఇంజనీరింగ్ చేసిన అరుణ ట్రాన్స్‌పోర్టేషన్ ప్లానర్‌గా, ట్రాఫిక్ ఇంజనీర్‌గా వివిధ ప్రాంతాలలో పనిచేసింది. మిస్సోరీ ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు పొందిన అరుణ ఆరోగ్య సంరక్షణ నుంచి పర్యావరణ పరిరక్షణ వరకు ఎన్నో కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించింది.


● పరిమళా జయపాల్

పరిమళా జయపాల్ యూఎస్ హౌజ్ ఆఫ్ రిప్రెజెంటేటివ్స్ (ప్రతినిధుల సభ)కు ఎంపికైన తొలి భారతీయ-అమెరికన్ మహిళ. తాజాగా 7వ డిస్ట్రిక్ట్(వాషింగ్టన్) నుంచి ప్రతినిధుల సభకు ఎంపికైంది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి క్లిఫ్‌మూన్‌పై విజయం సాధించింది. చెన్నైలో పుట్టిన పరిమళా జయపాల్ ఇండోనేషియా, మలేసియాలో పెరిగింది. తల్లి రచయిత్రి. తండ్రి మార్కెటింగ్ రంగంలో పనిచేశారు. పదహారు సంవత్సరాల వయసులో అమెరికాకు వెళ్లింది పరిమళ. జార్జ్‌టౌన్ యూనివర్శిటీ నుంచి బీఏ, కెలాగ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నుంచి ఎంబీఏ పట్టాలు పుచ్చుకుంది. చదువు పూర్తయిన తరువాత ఒక ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులో ఫైనాన్షియల్ ఎనలిస్ట్‌గా పనిచేసింది.

రాజకీయాల్లోకి అడుగుపెట్టడానికి ముందు పౌరహక్కుల ఉద్యమాల్లో చురుగ్గా పనిచేసింది. 'హేట్ ఫ్రీ జోన్' అనే సంస్థను ప్రారంభించి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించింది. పరిమళ మంచి రచయిత్రి కూడా. 'పిల్‌గ్రిమేజ్: వన్ వుమెన్స్ రిటర్న్ టు ఏ ఛేంజింగ్ ఇండియా' అనే పుస్తకం రాసింది.


'నువ్వు మీ దేశానికి వెళ్లి పో' అంటూ ఆమెకు ఎన్నోసార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయి. అయితే ఆమె వాటిని ఎప్పుడూ ఖాతరు చేయలేదు. వెనక్కి తగ్గలేదు.


● నబీలా సయ్యద్

అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికలలో ఇల్లినాయి జనరల్ అసెంబ్లీకి ఎన్నిక కావడం ద్వారా 23 ఏళ్ల ఇండియన్-అమెరికన్ నబీలా సయ్యద్ చరిత్ర సృష్టించింది. డెమోక్రటిక్ పార్టీకి చెందిన నబీలా 51వ డిస్ట్రిక్ట్‌లో రిపబ్లిక్ పార్టీకి చెందిన క్రిస్ బోస్‌పై ఘన విజయం సాధించింది. ఇల్లినాయి రాష్ట్రంలోని పాల్టెన్ విలేజ్‌లో పుట్టింది నబీలా. హైస్కూల్ రోజుల నుంచి ఉపన్యాస పోటీల్లో చురుగ్గా పాల్గొనేది. వాటి ద్వారా రకరకాల సామాజిక విషయాలను లోతుగా తెలుసుకునే అవకాశం వచ్చింది. కాలేజీలో ఎన్నో చర్చావేదికల్లో పాల్గొనేది. యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా నుంచి పొలిటికల్ సైన్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లలో పట్టా పుచ్చుకుంది. స్త్రీ సాధికారత, హక్కులకు సంబంధించి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనే నబీలా ఉద్యోగం కంటే ఉద్యమాలకే ప్రాధాన్యత ఇచ్చేది. ఈ క్రమంలోనే రాజకీయాలకు దగ్గరైంది. 'ఎమిలీస్ లిస్ట్'తో కలిసి పనిచేసింది. ఎమిలీస్ లిస్ట్ అనేది డెమోక్రటిక్ మహిళా అభ్యర్థులు చట్ట సభకు ఎన్నిక కావడానికి ఉపకరించే పొలిటికల్ యాక్షన్ కమిటీ.

'నా విజయానికి ప్రధాన కారణం తమ తరపున పోరాడే, బలంగా గొంతు వినిపించే వ్యక్తిని ప్రజలు తమ ప్రతినిధిగా చట్టసభకు పంపాలనుకోవడం. వారి నమ్మకాన్ని నిలబెడతాను' అంటోంది నబీలా.

ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటి తలుపు తట్టిన నబీలా తనను గెలిపించిన వారికి కృతజ్ఞతలు తెలియజేయడానికి మళ్లీ ఇంటింటికీ వెళ్లనుంది.



కుటుంబాలకు రీల్స్ గండం

33,500 మంది ఫాలోయెర్ల వల్ల ఒక గృహిణి ప్రాణం పోయింది. తమిళనాడులో తాజాగా ఈ ఘటన జరిగింది. ఫాలోయెర్లు పెరగడంతో రీల్స్ చేయడంలో పడి ఇంటిని పట్టించుకోని భార్యను క్షణికోద్రేకంలో భర్త కడతేర్చాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లో మరో మహిళ రీల్స్ వద్దన్నందుకు తన అన్నలిద్దరి మీదా దాడి చేసి పోలీస్ స్టేషన్ చేరింది. రీల్స్ అనేవి మహిళల ప్రతిభను వ్యక్తం చేసే సోషల్ మీడియా సాధనాలుగా ఉన్నాయి. కాని ఏ ప్రతిభా లేకపోయినా కేవలం ఫాలోయెర్ల కోసం వెర్రిమొర్రి రీల్స్ చేసే మహిళల వల్ల కుటుంబాలకు గండాలు వస్తున్నాయి. సోషల్ మీడియా అడిక్షన్ గురించి చైతన్యం రావాల్సిన సందర్భం వచ్చేసింది.

ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తే ఫాలోయెర్స్ వస్తారు. ఆదాయం కూడా వస్తుంది. 2000 మంది ఫాలోయెర్స్ వస్తే 'ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్'గా గుర్తింపబడతారు. వీరు చేసిన రీల్స్ నెల రోజుల్లో 1000 మంది చూస్తే వీరికి బోనస్‌లు వస్తాయి. 10వేల మంది ఫాలోయెర్స్ ఉంటే ఒక స్థాయి... లక్ష దాటితే మరో స్థాయి. ఆ తర్వాత ప్రచారకర్తలే ఈ ఇన్‌ఫ్లూయెన్సర్లతో ఉత్పత్తులకు ప్రచారం చేయించుకుంటారు. రకరకాల పద్ధతుల్లో ఆదాయం వస్తుంది కూడా.

తమ ప్రతిభతో, నైపుణ్యాలతో ఈ రీల్స్ ద్వారా గుర్తింపు, గౌరవం పొందుతున్న స్త్రీలు ఎందరో ఉన్నారు. ఫిట్‌నెస్, లైఫ్ స్టయిల్, స్టాండ్ అప్ కామెడీ, మిమిక్రీ, హెల్త్, యోగా... ఇలా అనేక రంగాల్లో నైపుణ్యం ఉండి వాటి ద్వారా రీల్స్ చేస్తూ సోషల్ మీడియా సెలబ్రిటీలుగా మారుతారు. ఈ రంగంలో కొందరు సగటు గృహిణులు, మహిళలు కూడా తమ వంటల ద్వారానో, చమత్కారమైన మాటల ద్వారానో, నృత్యాల ద్వారానో గుర్తింపు పొందుతున్నారు. అయితే తమకు ఉన్న చిన్నపాటి ప్రతిభకు కూడా కామెంట్లు, ఫాలోయెర్లు వస్తుండటంతో ఇక అదే లోకంగా మారిన వారు అవస్థలు తెచ్చుకుంటున్నారు. ఇరవై నాలుగ్గంటలు ఫోన్‌లో మునిగి, రీల్స్ తయారీలో నిమగ్నమయ్యి, కుటుంబాలలో కలతలకు కారణం అవుతున్నారు. ఇప్పుడు తమిళనాడులో జరిగింది అదే.

సాధించానని భ్రమసి

చెన్నైకి 400 కిలోమీటర్ల దూరంలో ఉండే తిరుపూరులో అమృతలింగం (38) లోకల్ మార్కెట్లో హమాలీగా పని చేస్తాడు. అతడి భార్య చిత్ర చిన్న గార్మెంట్ ఫ్యాక్టరీలో పని చేస్తుంది. ముందు టిక్ టాక్, ఆ తర్వాత ఇన్‌స్టాలో రీల్స్ చేయడం మొదలుపెట్టిన చిత్ర దాదాపు 35 వేల మంది ఫాలోయెర్స్‌ను సంపాదించుకుంది. దాంతో ఆమె అన్ని పనులు మాని ఈ రీల్స్ తయారీలో పడింది. అమృతలింగంకు ఇది నచ్చలేదు. ఇంటిని పట్టించుకోమని గొడవకు దిగేవాడు. అయితే రీల్స్ కింద వచ్చే కామెంట్స్‌లో పొగడ్తలు నిండేసరికి చిత్ర తన ప్రతిభకు సినీ పరిశ్రమే సరైనదని భర్త మాట వినకుండా మూడు నెలల క్రితం చెన్నై చేరి వేషాలకు ప్రయత్నించసాగింది. వారం క్రితం ఒక ఫంక్షన్‌కు సొంత ఊరు వచ్చి తిరిగి చెన్నై బయలుదేరుతుండేసరికి అమృతలింగం గట్టిగా అడ్డు పడ్డాడు. చెన్నై వెళ్లకూడదని పట్టు పట్టాడు. ఇద్దరికీ మాటా మాటా పెరిగింది. క్షణికావేశంలో అతను చీరతో ఆమె మెడను బిగించాడు. స్పృహ తప్పేసరికి భయపడి వదిలేశాడు. కాని అప్పటికే ఆమె చనిపోయింది.

వద్దు అంటే తిరుగుబాటు

ఉత్తర్‌ప్రదేశ్‌లో ఆర్తి రాజ్‌పుత్ అనే యువతి ఈ రీల్స్‌కు బాగా అడిక్ట్ అయ్యింది. ఆమెకు ఇంటి విషయాలే పట్టడం లేదని సోదరులు జైకిషన్, ఆకాష్ అభ్యంతరం తెలిపారు. దాంతో ఆమె ఆ ఇద్దరు సోదరులపై దాడి చేసింది. వారు భయపడి పోలీసులను పిలిస్తే స్టేషన్‌లో మళ్లీ సిబ్బంది ఎదుటే సోదరులను కొట్టింది. అంతే కాదు... అడ్డుపడ్డ మహిళా పోలీసులపై దాడి చేసింది. దాంతో ఆమె కటకటాలు లెక్కించే స్థితికి వెళ్లింది.

బతికున్నా లేనట్టే

సోషల్ మీడియా అడిక్షన్ దాదాపుగా మనిషిని జీవచ్ఛవంలా మారుస్తాయని నిపుణులైన మానసిక వైద్యులు అంటున్నారు. స్త్రీలు, పురుషులు, పిల్లలు అనే తేడా లేకుండా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్, వాట్సప్‌లకు అడిక్ట్ అవుతున్నారు. లైక్‌లు, షేర్లు, సబ్‌స్క్రయిబ్‌లలో పడి చదువు, ఇంటి పని, బాధ్యతలు, లక్ష్యాలు మర్చిపోతున్నారు. భార్యాభర్తల్లో ఎవరు ఎడిక్ట్ అయినా కాపురంలో కలతలు, జగడాలు వస్తున్నాయి. పిల్లలు చదువును నష్టపోతున్నారు. ఫోన్ చూడొద్దంటే అలిగి ఇళ్ల నుంచి పిల్లలు పారిపోతున్నారు. అపరిచితులతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. లంఖణం దివ్యౌషధం అని పెద్దలు అన్నారు. సోషల్ మీడియాకు సంబంధించిన లంఖణాలు పెట్టడం మంచిదని నిపుణులు కూడా అంటున్నారు. రోజులో కొన్ని గంటలు ఫోన్ ముట్టుకోకుండా వారంలో ఒక రోజు సోషల్ మీడియా చూడకుండా పేపర్లు, పుస్తకాలు, స్నేహితులపై ధ్యాస మళ్లించాలని నిపుణులు సూచిస్తున్నారు. కుటుంబంలో అందరి సమ్మతంతో గౌరవాన్ని, ఆదాయాన్ని ఇచ్చే విధంగా మీడియాను వాడితే కలతలు రావు. కాని కుటుంబ సభ్యుల విముఖతను లెక్క చేయకుండా సోషల్ మీడియాకే ప్రాధాన్యం ఇస్తుంటే ఇబ్బందులు తప్పవు. తస్మాత్ జాగ్రత్త.

సాగుబడి
విశాఖ కార్తె: నవంబర్ 18 వరకు
అనూరాధ కార్తె: నవంబర్ 19 నుంచి

డ్రోన్లతో సాగు భలే బాగు!



- సేద్యంలో డ్రోన్ల వాడకంతో ప్రయోజనాలెన్నో
- తగ్గనున్న కూలీలు, ఎరువులు, పురుగుమందుల ఖర్చు
- గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు దోహదం
- డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇవ్వనున్న ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ


వ్యవసాయంలో ద్వారా పెట్టుబడిని తగ్గించి, సమయాన్ని ఆదా చేయటం, కూలీల కొరత సమస్యను అధిగమించి ఆదాయాన్ని మెరుగుపర్చుకునేందుకు డ్రోన్లు ఉపయోగపడతాయని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఆంగ్రూ) చెబుతోంది. ఖచ్చితత్వం కలిగిన వ్యవసాయం వైపు రైతును మళ్లించేందుకు డ్రోన్లు ఉపయోగపడతాయని ఆశిస్తున్నారు.

పెళ్లిళ్లు, ఫంక్షన్ల చిత్రీకరణ వంటి సాధారణ పనుల కోసం డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చేందుకు దేశవ్యాప్తంగా 35 సంస్థలకు కేంద్ర ప్రభుత్వ అనుమతి ఉంది. పెళ్లిళ్లు ఇతర కార్యక్రమాలకు వినియోగించే డ్రోన్‌లకు వ్యవసాయంలో వినియోగించే డ్రోన్‌లకు ఎంతో తేడా ఉంది. వ్యవసాయ పనుల్లో డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చేందుకు మొట్టమొదటిగా 'ఆంగ్రూ'కి డిజీసీఏ ఇటీవల అనుమతి ఇచ్చింది. సేద్యంలో డ్రోన్ సాంకేతికత వినియోగించటం, శిక్షణ ఇచ్చేందుకు పాఠ్యాంశాలను రూపొందించడంలో వర్సిటీ విశేష కృషి చేసింది. డిప్లమో విద్యార్థులు 75 మందికి 15 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ ఒక డ్రోన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఏపీ ప్రభుత్వం సుముఖంగా ఉన్న నేపథ్యంలో వేలాది మంది డ్రోన్ పైలట్ల ఆవశ్యకత ఏర్పడింది. విద్యావంతులైన గ్రామీణ యువతీ యువకులకు డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇచ్చేందుకు విశ్వవిద్యాలయం సంసిద్ధమవుతోంది. ఏపీలో సుమారు 40 వేలకుపైగా డ్రోన్లు అవసరమవుతాయని అంచనా. డ్రోన్ల వాడకం ద్వారా 25 శాతానికి పైగా ఎరువులు, పురుగుమందులను ఆదా చేయవచ్చని చెబుతున్నారు.

మార్కెట్‌లో సుమారు 5 లీటర్ల సామర్థ్యం నుంచి 40 లీటర్ల సామర్థ్యం కలిగిన డ్రోన్‌లు అందుబాటులో ఉన్నాయి. ధర రూ. 6-15 లక్షల వరకూ ఉన్నాయి. ఏదేమైనప్పటికీ శాస్త్రీయంగా శిక్షణ పొందిన పైలట్ల అవసరం ఉంది.

– దాళా రమేష్‌బాబు/తాళ్లపల్లి మల్లేశ్వరరావు, సాక్షి, గుంటూరు



వ్యవసాయంలో డ్రోన్ల ప్రయోజనాలెన్నో..

ద్రవ ఎరువులు/నీటకరిగే ఎరువుల పిచికారీ, పురుగు, తెగుళ్ళు, కలుపు మందుల పిచికారీ, విత్తనాలు వెదజల్లటం, పొలాల సర్వే, పంటల నమూనాల సేకరణ, పంటలు/తోటల్లో చీడపీడల పరిస్థితిపై సర్వే వంటి 22 రకాల పనులకు డ్రోన్ టెక్నాలజీని వినియోగించవచ్చని విశ్వవిద్యాలయం చెబుతోంది. ● డ్రోన్ల ద్వారా ఎకరానికి సుమారు 6 నిమిషాలలో పురుగుమందులు, ఎరువులు అందించవచ్చు. కూలీల ద్వారా పురుగుమందులు పిచికారీ చేసేందుకు ఎకరానికి 200 లీటర్ల నీరు, గంటకుపైగా సమయం, సుమారు వెయ్యి వరకూ ఖర్చవుతోంది. కానీ, డ్రోన్ ద్వారా 10 లీటర్ల నీటితో 6 నిమిషాల్లో రూ.350 ఖర్చుతో ఎకరానికి పురుగుమందులు, ఎరువులు అందించవచ్చు. ● డ్రోన్ల ద్వారా ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేస్తే అవి పొలం అంతటా సమానంగా పంటకు అందుతాయి. పురుగుమందులు చల్లేటప్పుడు డ్రోన్ నుంచి వచ్చే గాలి వల్ల పంట మొక్కల ఆకుల ముందు, వెనుక భాగాల్లో పురుగుమందులు పడి మంచి ఫలితాలు వస్తాయి.
● పంటలు, నేలల స్వభావం, వాతావరణం, తక్కువ ఎత్తులో రిమోట్ సెన్సింగ్ నిర్వహించేదుకు అధునాతన కెమేరాలను డ్రోన్లు కలిగి ఉంటాయి. పంట స్థితిగతుల గురించి ఖచ్చితమైన సమాచారాన్ని డ్రోన్ సత్వరమే రైతుకు అందిస్తుంది.

రైతు ఆదాయం మెరుగవుతుంది



వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ ద్వారా తక్కువ సమయంలో, తక్కువ నీటితో, తక్కువ ఖర్చుతో వ్యవసాయ యాజమాన్య పద్ధతులు చేపట్టవచ్చు. 20 రకాల వ్యవసాయ పనులకు డ్రోన్లను వినియోగించుకోవచ్చు. తద్వారా రైతుకు ఆదాయం మెరుగవుతుంది.

– డా. ఎల్. ప్రశాంతి, ఆచార్య ఎన్జీరంగా వర్సిటీ విస్తరణ, పరిశోధనా సంచాలకులు

గ్రామీణ విద్యావంతులకు డ్రోన్ పైలట్ శిక్షణ



గ్రామీణ ప్రాంతాల్లో విద్యావంతులైన నిరుద్యోగ యువతకు డ్రోన్ పైలట్ శిక్షణ ఇవ్వటం ద్వారా ఉపాధి చూపించాలనుకుంటున్నాం. డ్రోన్ నుంచి వచ్చే సంకేతాలు, మెసేజ్‌లు చదువుకొని దానికి అనుగుణంగా డ్రోన్లతో పనిచేయాల్సి ఉంటుంది. కాబట్టి డ్రోన్ పైలట్లకు కనీస చదువు అవసరం. కనీస విద్యార్హత కలిగిన గ్రామీణ యువతీ యువకులకు డ్రోన్ పైలట్ శిక్షణలో ప్రాధాన్యం ఉంటుంది.

– డా. ఏ. సాంబయ్య, సీనియర్ శాస్త్రవేత్త, డ్రోన్ నిపుణులు, ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం

తక్కువ ఖర్చుకే వ్యవసాయ డ్రోన్లు!



గత పదేళ్ళుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నేషనల్ డ్రోన్ పాలసీలో వ్యవసాయానికి సంబంధించిన సలహాలు అందిస్తున్నాం. రైతులకు ఎటువంటి అవసరాలు ఉన్నాయి? ఏ విధంగా ఖర్చులు తగ్గించుకోవచ్చు? సమయాన్ని /ఖర్చును ఆదా చేయటం ఎలా? కూలీల ఇబ్బందులు తొలగించుకోవటం ఎలా? వంటి విషయాలపై పరిశోధనలు చేశాం. తక్కువ ఖర్చులోనే డ్రోన్లను అందుబాటులోకి తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

– డా. ఎ.విష్ణువర్ధన్ రెడ్డి, కులపతి, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు.

చిరుధాన్యాలపై డా. ఖాదర్ సదస్సులు

పాత పశ్చిమగోదావరి జిల్లాలో ఈ నెల 19, 20, 21 తేదీల్లో చిరుధాన్యాలు–పోషక విలువలు– ఆరోగ్యం అనే అంశంపై జరిగే సదస్సుల్లో స్వతంత్ర శాస్త్రవేత్త డా. ఖాదర్ వలి ప్రసంగిస్తారని నిర్వాహకులు హార్ట్ ట్రస్టు వ్యవస్థాపకులు ఎం.ఎస్.సుబ్రహ్మణ్యరాజు చెప్పారు. 19(శనివారం)న మ. 2 గం. నుంచి చిరుధాన్యాల వంటకాల తయారీ, సేంద్రియ సేద్యం, ఇంటిపంటల సాగు అంశాలపై జంగారెడ్డిగూడెంలోని శేషాద్రినగర్‌లోలో గౌరి సుభద్ర పిరమిడ్ ధాన్యకేంద్ర అనుబంధ మేత్రేయ మందిరంలో సదస్సు జరుగుతుంది. ఆహార శాస్త్రవేత్త మిల్లెట్స్ రాంబాబు, ఎం.ఎస్. సుబ్రహ్మణ్యరాజు తదితరులు ప్రసంగిస్తారు. 20(ఆదివారం)న సా. 4 గం. నుంచి భీమవరంలోని ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జరిగే సదస్సులో సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై డా. ఖాదర్ వలితో పాటు కలెక్టర్ పి. ప్రశాంతి, ఫుడ్‌సేఫ్టీ మూవ్‌మెంట్ వ్యవస్థాపకులు డా. పి.బి.ప్రతాప్‌కుమార్, ఎం.ఎస్. సుబ్రహ్మణ్యరాజు ప్రసంగిస్తారు. 21 (సోమవారం)న ఉ. 10 గం. కు తాడేపల్లిగూడెంలోని వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే సదస్సులో డా. ఖాదర్‌వలి తదితరులు ప్రసంగిస్తారు. అందరూ ఆహ్వానితులే. వివరాలకు.. సుబ్రహ్మణ్యరాజు – 76598 55588.

ముళ్లు లేని బ్రహ్మజెముడు

వేసవి పశుగ్రాసపు పంట!


తన పొలంలోని బ్రహ్మజెముడు మొక్కల మధ్య రైతు వెంకటేశ్వరరెడ్డి

ముళ్లలేని బ్రహ్మజెముడు కరువు ప్రాంతాల్లో వేసవి పశుగ్రాస పంటగా ఉపయోగపడుతోంది. అతి తక్కువ నీటితోనే బ్రహ్మజెముడు మొక్క బతుకుతుంది. ఇతర ఏ ఇతర పశుగ్రాస పంటల కన్నా తక్కువ నీటితోనే బతకగలదు. మెక్సికో, జోర్డాన్ వంటి దేశాల్లో కరువు/ఎడారి ప్రాంతాల వ్యవసాయ ఆర్థిక వ్యవస్థల్లో అంతర్భాగంగా మారిన ఈ పంట ఇప్పుడు మన దేశంలోనూ అందుబాటులోకి వచ్చింది. అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలతో పాటు పుణే కేంద్రంగా పనిచేస్తున్న బీఎఐఎఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఫౌండేషన్ ఇందుకోసం విశేష కృషి చేస్తుండటం విశేషం. ఒక్కసారి నాటుకుంటే దశాబ్దాల తరబడి నిరంతరం పశుగ్రాసం అందుబాటులో ఉంటుంది. గుజరాత్, రాజస్థాన్‌లలో ప్రయోగాత్మకంగా సాగు చేసిన తర్వాత అనంతపురం జిల్లాలో రైతులకు ఈ పంటను 'సెర్ప్' సహాయంతో నాలుగేళ్ల క్రితం పరిచయం చేశారు. బ్రహ్మజెముడు పశుగ్రాస పంట మాత్రమే కాదు, ఆహార పంట కూడా. దీని ఆకులను కూరగా వండుకొని కూడా తింటారు.

ముళ్లు లేని బ్రహ్మజెముడు సాగు ఇలా..

- **నాటే కాలం:** వర్షాకాలం తర్వాత అక్టోబర్ నుంచి మార్చి వరకు.
- **స్థల ఎంపిక:** నీరు నిలవని తేలికపాటి నేలలు అనుకూలం. ఏ ఇతర పంటలు పండని నిస్సారమైన సాగు భూములు, బంజరు భూములు, రాళ్ల భూములు, ఇసుక భూముల్లోనూ ముళ్ల లేని బ్రహ్మజెముడు పెరుగుతుంది. 2 అడుగుల వెడల్పు, 1 అడుగు ఎత్తులో మడుల (బెడ్స్)ను సిద్ధం చేసి ముళ్ల లేని బ్రహ్మజెముడు ఆకులు నాటాలి.
- **ఆకులను నాటడానికి సిద్ధం చేయటం:** కనీసం ఒక సంవత్సరం వయసున్న ముళ్లలేని బ్రహ్మజెముడు మొక్కల ఆకులనే కోసి, నాటుకోవచ్చు. నాటడానికి ముందు వాటిని నీడలో 15 రోజులు ఉంచాలి. కోసిన వెంటనే నాటకూడదు. వడపడి తేమ తగ్గిన తర్వాత నాటాలి.
- **శుద్ధి చేసి నాటాలి:** శిలీంధ్ర తెగుళ్ల నివారించడానికి జాగ్రత్తవహించాలి. నాటడానికి ముందు ట్రైకోడెర్మా విరిడి ద్రావణంలోద్రావణంలో ఆకులను ముంచిన తర్వాత నాటాలి.
- **నాటే దూరం:** సాళ్ల మధ్య 3 మీటర్లు, మొక్కల మధ్య 2 మీటర్ల (667 మొక్కలు/ఎకరం) దూరంలో నాటాలి. ఆకును చెట్టు నుంచి కోసిన భాగం మట్టిలోకి వెళ్లేలా నాటాలి. ఎత్తు మడిపై ఈ ఆకుపై ఎండపడే విధంగా తూర్పు వైపు తిప్పి నిటారుగా ఉండేలా నాటండి.
- **ఎరువు:** నాటేటప్పుడు ఎకరానికి 2 టన్నుల చొప్పున బాగా కుళ్ళిన పశువుల ఎరువుతో పాటు 60:30:30 ఎరువులు వేయండి. నాటిన ఏడాది తర్వాత నుంచి ఆకులు కోసుకొని పశువులకు మేపవచ్చు లేదా తిరిగి నాటుకోవచ్చు.
- **నీటి నిర్వహణ:** మొక్కలు (ఆకులు) నాటిన 10 రోజుల వరకు మొక్కలకు నీరు పెట్టవద్దు. తర్వాత 15 రోజుల వ్యవధిలో మొక్కకు 1-2 లీటర్ల నీరు పోయాలి. మొదటి ఏడాది కలుపు తీసెయ్యాలి.
- **ఆకుల దిగుబడి:** నాటిన తర్వాత ఏడాది తర్వాత నుంచి ఆకులు కోసుకోవచ్చు. కింది వైపు ఉండే రెండు, మూడు ఆకులు అలాగే ఉంచి ఆ పైన పెరిగిన ఆకులను చాకుతో కోయాలి.
- **మేపటం:** ముళ్ల లేని బ్రహ్మజెముడు ఆకులను చిన్న ముక్కలుగా కోసి మేకలు/గొర్రెలు/పశువులకు ఇతర పచ్చి మేతకు బదులుగా 30% మేరకు తినిపించవచ్చు.

– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

చౌడు, నల్ల భూములు పనికిరావు!

పశుగ్రాసం కొరతను అధిగమించడానికి పశువులు, గొర్రెలు, మేకలు పెంచుకునే కరువు ప్రాంతాల్లోని చిన్న, సన్నకారు రైతులతో ముళ్లలేని బ్రహ్మజెముడు సాగు చేయిస్తున్నాం. నీటి ఎద్దడి ఉండే ప్రాంత భూముల్లో ఈ మొక్కలు నిశ్చింతగా పెరుగుతాయి. నీరు నిల్వ ఉండే నల్ల నేలలు, చౌడు భూముల్లో ఈ మొక్కలు పెరగవు. 2018 నుంచి అనంతపురం జిల్లాలో 82 మంది రైతులకు ముళ్లు లేని బ్రహ్మజెముడు నాటిస్తున్నాం. వీటి ఆకులు నాటితే చాలు. పుణే లోని బిఎఐఎఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఫౌండేషన్ నుంచి 4 రకాల ముళ్లలేని బ్రహ్మజెముడు ఆకులను తెప్పించి 'సెర్ప్' ఆధ్వర్యంలో రైతులకు పంచాం. ముళ్లు లేని బ్రహ్మజెముడును మార్చి వరకు నాటుకోవచ్చు. నాటుకోవడానికి ఆకులు కావాలనుకునే రైతులు సంప్రదించవచ్చు. టిష్యూకల్చర్ పద్ధతిలో నర్సరీ పెంచుకునే ఆసక్తి ఉన్న వాళ్లకు శిక్షణ ఇస్తాం.

– సురేష్ (99892 04816), బిఎఐఎఫ్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రతినిధి, అనంతపురం

ఎండాకాలంలో ఏపుగా పెరుగుతుంది

ముళ్లలేని బ్రహ్మజెముడును మూడేళ్ల క్రితం వేసవిలో నాటాను. ఒక ఎకరంలో ఎత్తుమడులు నాటాను. 5 ఎకరాల జామ తోట చుట్టూతా అడుగు ఎత్తున సరిహద్దు గట్టు వేసి దానిపైన కూడా నాటాము. ఒక సంవత్సరం పాటు 15 రోజులకు ఒకసారి నీరు పోశాం. తర్వాత నుంచి నీరు పోయటం లేదు. మూడేళ్లకు ఇప్పుడు 6 నుంచి 8 అడుగుల ఎత్తు పెరిగాయి. ఈ మొక్కలు వర్షాకాలంలో పెద్దగా పెరగవు. ఎండాకాలంలో ఏపుగా పెరుగుతాయి. నీరు నిల్వ ఉండకూడదు. ఎంత ఎత్తు మీద అంత మంచిది. ఒక సంవత్సరం పెరిగిన తర్వాత నుంచి బ్రహ్మజెముడు ఆకులు కోసి, ముక్కలు చేసి.. ఆవులు, గేదెలతో పాటు 100 పొట్టేళ్లకు కూడా ఇతర పశుగ్రాసం లేనప్పుడు మేతగా వేసేవాళ్లం. ముళ్లలేని బ్రహ్మజెముడు ఆకులు మంచి పశుగ్రాసం. పశువులు ఏవైనా ఇష్టంగా తింటాయి. ఆవుల పాలలో వెన్న 1-2% వరకు పెరిగింది. రైతులు కొందరు ఇంతకు ముందే ఈ ఆకులను తీసుకెళ్లి నాటుకున్నారు. ఆకును రూ. 20కి ఇస్తున్నాను.

– అలవల వెంకటేశ్వర రెడ్డి, ఫోన్: 90006 16717, ముళ్లలేని బ్రహ్మజెముడు రైతు, గుత్తి, అనంతపురం జిల్లా



తొలి లీగ్ మ్యాచ్‌లో ఓడిన రాఫెల్ నాదల్

పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ ఏటీపీ ఫైనల్స్‌లో రెండో ర్యాంకర్ రాఫెల్ నాదల్‌కు తొలి లీగ్ మ్యాచ్‌లో చుక్కెదురైంది. ఇటలీలో జరుగుతున్న ఈ టోర్నీలో గ్రీన్ గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో తొమ్మిదో ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 7-6 (7/3), 6-1తో నాదల్ (స్పెయిన్)ను ఓడించి శుభారంభం చేశాడు. 97 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఫ్రిట్జ్ ఎనిమిది ఏస్‌లు సంధించడంతోపాటు నాదల్ సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. మళ్లీ నంబర్ వన్ ర్యాంక్ అందుకోవాలంటే నాదల్ ఈ టోర్నీలో విజేతగా నిలవాల్సి ఉంటుంది.

ఐసీసీ టి20 జట్టులో కోహ్లి, సూర్య



టి20 ప్రపంచకప్ టోర్నీలో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా ఆరు దేశాలకు చెందిన ఆటగాళ్లను 'మోస్ట్ వాల్యుబుల్ టీమ్ ఆఫ్ ద ఐసీసీ టి20 వరల్డ్‌కప్' జట్టుకు ఎంపిక చేశారు. భారత స్టార్స్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్‌లకు ఈ జట్టులో చోటు దక్కింది. కోహ్లి 296 పరుగులతో టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. సూర్య 239 పరుగులతో మూడో స్థానంలో నిలిచాడు. హార్దిక్ పాండ్యా జట్టులో 12వ ఆటగాడిగా ఎంపికయ్యాడు.

ఐఓఏ అథ్లెట్స్ కమిషన్‌లో సింధు



న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్, ఒలింపిక్ పతకాల విజేత పీవీ సింధు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్‌కు ఎన్నికైంది. ఈ కమిషన్‌లో పది మంది క్రీడాకారులుంటారు. ఇందులో ఐదుసార్లు ప్రపంచ మహిళా బాక్సింగ్ విజేత మేరీకోమ్, వింటర్ ఒలింపియన్ శివ కేశవన్, మీరాబాయి చాను (వెయిట్‌లిఫ్టింగ్), గగన్ నారంగ్ (షూటింగ్), వెటరన్ ప్లేయర్ శరత్ కమల్ (టేబుల్ టెన్నిస్), రాణి రాంపాల్ (మహిళా హాకీ), భవాని దేవి (ఫెన్సింగ్), భజరంగ్ లాల్ (రోయింగ్), ఓం కర్హన (షాట్‌పుట్)లు ఉన్నారు. లింగ వివక్షకు తావులేకుండా ఐదుగురు చొప్పున మహిళా, పురుష ప్లేయర్లకు ఐఓఏ కమిషన్‌లో సమ ప్రాధాన్యత ఇచ్చారు. పది మంది సభ్యులకు గాను సరిపడా నామినేషన్లు వేయడంతో వాళ్లంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఐఓఏ వెల్లడించింది. కొత్త ఐఓఏ నియమావళి ప్రకారం ఈ కమిషన్ నుంచి ఇద్దరు సభ్యులు (పురుషుడు, మహిళ) ఐఓఏకు సంబంధించిన వ్యవహారాల్లో క్రియాశీలక పాత్ర పోషించాలి. ఐఓఏలోని సభ్యులకు ఉన్న ఓటింగ్ హక్కులు కమిషన్‌లోని ఇద్దరు సభ్యులకు ఉంటాయని ఐఓఏ వర్గాలు వెల్లడించాయి.

కోల్‌కతాకు మారిన శార్దుల్



ముంబై: భారత ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీకి మారాడు. ఈ సీజన్‌లో ఢిల్లీకి ఆడిన శార్దుల్ 14 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. 120 పరుగులు చేశాడు. క్యాపిటల్స్ జట్టు మెగా వేలంలో అతన్ని రూ.10.75 కోట్లు వెచ్చించి కొనుగోలు చేసింది. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న శార్దుల్‌ను ఫ్రాంచైజీల మధ్య ట్రేడింగ్‌లో భాగంగా కోల్‌కతా తీసుకుంది. ఫ్రాంచైజీలకు రిటెయిన్ (అట్టిపెట్టుకోవడం), రిలీజ్ (విడుదల) లేదంటే ట్రేడింగ్ (కొనుగోలు) గడువు మంగళవారంతో ముగియనుంది. ఇంగ్లండ్ వికెట్ కీపర్ సామ్ బిల్లింగ్స్ వచ్చే సీజన్ ఐపీఎల్‌కు గైర్హాజరవుతానని ప్రకటించాడు. కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆటగాడు సంప్రదాయ ఫార్మాట్ (టెస్టు)పై మరింత దృష్టిపెట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పాడు. ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ మాత్రం ఐపీఎల్ ఆడేందుకు ఆటగాళ్ల వేలానికి అందుబాటులో ఉంటానన్నాడు.

'ఫ్రెంచ్ కిక్' అదిరేనా!

- గ్రూప్ 'డి'లో డిఫెండింగ్ చాంపియన్
- స్టార్ ఆటగాళ్లతో కళకళ
- తొలి దశ దాటాకే అసలు పరీక్ష



తొమ్మిది దశాబ్దాల ఫుట్‌బాల్ ప్రపంచకప్ చరిత్రలో డిఫెండింగ్ చాంపియన్ జట్టు టైటిల్ నిలబెట్టుకొని 60 ఏళ్లు గడిచాయి. చివరిసారి బ్రెజిల్ జట్టు ఈ ఘనత సాధించింది. బ్రెజిల్ వరుసగా 1958, 1962 ప్రపంచకప్‌లలో చాంపియన్‌గా నిలిచింది. ఆ తర్వాత మరో విజేత జట్టు తదుపరి ప్రపంచకప్‌లో టైటిల్ సాధించలేకపోయింది. 1994 తర్వాత ప్రపంచకప్ చాంపియన్‌గా నిలిచిన యూరోప్ జట్టు తదుపరి వరల్డ్‌కప్‌లో గ్రూప్ దశ దాటడంలో విఫలమవుతోంది. చరిత్రపరంగా చూస్తే ప్రస్తుత విజేత ఫ్రాన్స్ జట్టుకు ప్రతికూలాంశాలు ఉన్నాయనుకోవాలి. కానీ ఎంతోమంది స్టార్ ఆటగాళ్లతో కళకళలాడుతున్న ఫ్రాన్స్ జట్టు ఖతర్‌లో చరిత్రను తిరగరాస్తుందా? 60 ఏళ్ల తర్వాత ప్రపంచకప్ టైటిల్ నిలబెట్టుకున్న తొలి జట్టుగా నిలుస్తుందా వేచి చూడాలి. ఫ్రాన్స్ బలగాన్ని చూస్తే మాత్రం గ్రూప్ 'డి'లో ఉన్న మిగతా జట్లు డెన్మార్క్, ఆస్ట్రేలియా, ట్యునీషియాలను దాటుకొని నాకౌట్ దశకు చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. మరో అవకాశం ఉందని నాకౌట్ దశ నుంచి ఆ జట్టుకు అసలు సవాళ్లు ఎదురవుతాయి. -సాక్షి క్రీడా విభాగం



థియో హెర్నాండెజ్
కరీమ్ బెంజెమా

ఫ్రాన్స్

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: విజేత (1998, 2018). **'ఫిఫా' ర్యాంక్:** 4. **అర్హత ఎలా:** యూరోపియన్ క్వాలిఫయింగ్ గ్రూప్ 'డి' విన్నర్.

ప్రపంచకప్‌లో 16వసారి బరిలోకి దిగుతున్న ఫ్రాన్స్ జట్టు క్వాలిఫయింగ్ పోటీల్లో అజేయంగా నిలిచింది. యూరో టోర్నీలో వైఫల్యం తర్వాత గత ఏడాది నేషన్స్ లీగ్ టైటిల్‌ను సాధించి 'ది బ్లూస్' జట్టు ఫామ్‌లోకి వచ్చింది. వ్యక్తిగత వివాదాల్లో ఇరుక్కొని 2018 ప్రపంచకప్‌నకు దూరమైన 34 ఏళ్ల స్టార్ స్ట్రయికర్ కరీమ్ బెంజెమా ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ ప్రపంచకప్ ఆడనుండటం శుభసూచకం. ఈ ఏడాది యూరోప్ ప్రొఫెషనల్ లీగ్స్ చాంపియన్స్ లీగ్, లా లీగాలో రియల్ మాడ్రిడ్ క్లబ్ జట్టుకు టైటిల్ దక్కడంలో కరీమ్ బెంజెమా కీలక పాత్ర పోషించాడు. కరీమ్ బెంజెమాతోపాటు ఇతర స్టార్ ఆటగాళ్లు కిలియాన్ ఎంబాపె, గ్రీజ్‌మన్, థియో హెర్నాండెజ్ రాణిస్తే మాత్రం ఫ్రాన్స్ జట్టు ఈసారీ ప్రపంచకప్ టైటిల్ సాధించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. గ్రూప్ దశలో ఒక్క డెన్మార్క్ తప్ప ఇతర జట్ల నుంచి ఫ్రాన్స్‌కు గట్టిపోటీ లభించే అవకాశాలు స్వల్పంగా ఉన్నాయి. గ్రూప్ దశ దాటి నాకౌట్ మ్యాచ్‌లకు అర్హత పొందాకే ఫ్రాన్స్ జట్టుకు అసలు సవాళ్లు ఎదురవుతాయి.

డెన్మార్క్

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: క్వార్టర్ ఫైనల్స్ (1998). **'ఫిఫా' ర్యాంక్:** 10. **అర్హత ఎలా:** యూరోపియన్ క్వాలిఫయింగ్ గ్రూప్ 'ఎఫ్' విన్నర్.

ఆరోసారి ప్రపంచకప్‌లో పాల్గొంటున్న డెన్మార్క్ క్వాలిఫయింగ్‌లో అదరగొట్టే ప్రదర్శన చేసింది. ఆడిన పది మ్యాచ్‌ల్లో తొమ్మిదింట గెలిచి, కేవలం ఒక మ్యాచ్‌లో ఓడింది. 30 గోల్స్ సాధించి, కేవలం మూడు గోల్స్ ప్రత్యర్థి జట్లకు ఇచ్చింది. స్టార్ ప్లేయర్ క్రిస్టియన్ ఎరిక్సన్‌పైనే అందరి దృష్టి ఉంది. ఒకరిద్దరిపైనే ఆధారపడకుండా సమష్టిగా రాణించడం డెన్మార్క్ జట్టు ప్రత్యేకత. తమ గ్రూప్‌లో ఫ్రాన్స్ జట్టుతో మ్యాచ్‌ను మినహాయిస్తే మిగతా రెండు మ్యాచ్‌ల్లో డెన్మార్క్ జట్టుకు విజయాలు దక్కే అవకాశాలున్నాయి. తాము ఆడిన గత నాలుగు ప్రపంచకప్‌లలో డెన్మార్క్ గ్రూప్ దశను దాటి నాకౌట్ రౌండ్ మ్యాచ్‌లకు అర్హత సాధించింది. ఈసారి ఆ జట్టు ప్రస్థానం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగుస్తుందో ముందుకు సాగుతుందో చూడాలి.

ఆస్ట్రేలియా

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: ప్రిక్వార్టర్ ఫైనల్ (2006). **'ఫిఫా' ర్యాంక్:** 38. **అర్హత ఎలా:** ఆసియా–దక్షిణ అమెరికా మధ్య ప్లే ఆఫ్ మ్యాచ్ విజేత.

ఆరోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న ఆస్ట్రేలియా నాకౌట్ దశకు చేరాలంటే విశేషంగా ఆడాల్సి ఉంటుంది. ట్యునీషియాపై ఆ జట్టుకు గెలిచే అవకాశాలున్నా... ఫ్రాన్స్, డెన్మార్క్ జట్ల మ్యాచ్‌ల ఫలితాలే ఆ జట్టుకు కీలకం కానున్నాయి. యూరోపియన్ లీగ్స్‌లో పలు మేటి జట్లకు ఆడిన స్ట్రయికర్ అజ్దిన్ రుస్టిక్‌పై ఆసీస్ జట్టు భారీ ఆశలు పెట్టుకుంది. గత రెండు ప్రపంచకప్‌లలో ఆసీస్ ఆరు మ్యాచ్‌లు ఆడి ఐదింటిలో ఓడి, ఒక మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. ఈసారి తొలి మ్యాచ్ డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్‌తో ఆడనున్న ఆస్ట్రేలియా కనీసం 'డ్రా'తో గట్టెక్కినా అది విజయంతో సమానమే.

ట్యునీషియా

ప్రపంచకప్‌లో ఉత్తమ ప్రదర్శన: గ్రూప్ దశ (2018). **'ఫిఫా' ర్యాంక్:** 30. **అర్హత ఎలా:** ఆఫ్రికా క్వాలిఫయింగ్‌లో మూడో రౌండ్ విన్నర్.

ఆరోసారి ప్రపంచకప్ ఆడుతున్న ట్యునీషియా జట్టుపై పెద్దగా అంచనాలు లేవు. ఎక్కువగా రక్షణాత్మకంగా ఆడే అలవాటున్న ట్యునీషియా ఈ ఏడాది 12 మ్యాచ్‌లు ఆడి కేవలం మూడు గోల్స్ మాత్రమే తమ ప్రత్యర్థి జట్లకు కోల్పోయింది. వాబి ఖాజ్రి, యూసెఫ్ మసాక్ని, నయీమ్ జట్టులోని కీలక ఆటగాళ్లు. పటిష్ట జట్లయిన ఫ్రాన్స్, డెన్మార్క్‌లతో జరిగే మ్యాచ్‌లే ఈ మెగా ఈవెంట్‌లో ట్యునీషియా ప్రస్థానాన్ని నిర్ణయిస్తాయి.

శ్రీజ, నిఖత్‌లకు 'అర్జున'


శరత్ కమల్‌కు 'ఖేల్‌రత్న' • 30న జాతీయ క్రీడాపురస్కారాల వేడుక



నిఖత్



శ్రీజ



శరత్ కమల్

న్యూఢిల్లీ: తెలంగాణ క్రీడాకారిణులు నిఖత్ జరీన్, ఆకుల శ్రీజ 'అర్జున' విజేతలయ్యారు. అంతర్జాతీయ మెగా ఈవెంట్లలో పతకాలతో సత్తా చాటుకుంటున్న తెలంగాణ మహిళా చాంపియన్లను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. జాతీయ క్రీడా పురస్కారాల్లో భాగంగా బాక్సర్ నిఖత్, టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్ శ్రీజలను 'అర్జున' అవార్డుకు ఎంపిక చేసింది. శ్రీజ 'మిక్స్‌డ్' భాగస్వామి, స్టార్ టీటీ ప్లేయర్ అచంట శరత్ కమల్‌కు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' లభించింది. ఈ నెల 30న రాష్ట్రపతి భవన్‌లో జరిగే వేడుకలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డుల్ని అందజేయనున్నారు. కొన్నేళ్లుగా 'ఖేల్ రత్న' అవార్డుకు ముగ్గురు, నలుగురేసి క్రీడాకారులను ఎంపిక చేస్తున్నారు. కానీ ఈసారి శరత్ మాత్రమే ఆ అవార్డుకు ఎంపికయ్యాడు.

తమిళనాడుకు చెందిన 40 ఏళ్ల శరత్ కమల్ నాలుగు ఒలింపిక్స్ క్రీడల్లో (204 ఏథెన్స్, 2008 బీజింగ్, 2016 రియో, 2020 టోక్యో) భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఐదుసార్లు కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొని ఏడు స్వర్ణాలు, మూడు రజతాలు, మూడు కాంస్య పతకాలు సాధించాడు. ఆసియా క్రీడల్లో రెండు కాంస్యాలు, ఆసియా చాంపియన్‌షిప్‌లో రెండు కాంస్యాలు గెల్చుకున్నాడు.

మొత్తం 25 మంది క్రీడాకారులకు 'అర్జున' దక్కింది. ఇందులో నలుగురు పారాథ్లెట్లున్నారు కానీ ఒక్క భారత మహిళా, పురుష క్రికెటర్ లేడు. ఆటగాళ్లను తీర్చిదిద్దే కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య రెగ్యులర్ అవార్డుకు జీవన్‌జోత్ సింగ్ తేజ (ఆర్చరీ), మొహమ్మద్ అలీ ఖమర్ (బాక్సింగ్), సుమ షిరూర్ (పారా షూటింగ్), సుజీత్ మాన్ (రెజ్లింగ్)... ద్రోణాచార్య 'లైఫ్ టైమ్' అవార్డుకు దినేశ్ లాడ్ (క్రికెట్), బిమల్ ఘోష్ (ఫుట్‌బాల్), రాజ్ సింగ్ (రెజ్లింగ్) ఎంపికయ్యారు. అశ్విని అకుంజీ (అథ్లెటిక్స్), ధరమ్‌వీర్ (హాకీ), సురేశ్ (కబడ్డీ), నీర్ బహదూర్ (పారాథ్లెటిక్స్) ధ్యాన్‌చంద్ జీవిత సాఫల్య పురస్కారం అందుకోనున్నారు.

తెలంగాణ స్టార్లకు...

ఇంటాబయటా అంతర్జాతీయ టోర్నీల్లో పతకాలతో మెరిసిన ఆకుల శ్రీజ ఈ ఏడాది కెరీర్‌లోనే అత్యుత్తమ సాఫల్యాన్ని బర్మింగ్‌హామ్‌లో సాకారం చేసుకొంది. ఈ ఏడాది అక్కడ జరిగిన ప్రతిష్ఠాత్మక కామన్వెల్త్ గేమ్స్‌లో వెటరన్ స్టార్ శరత్ కమల్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో బంగారు పతకం సాధించింది. 2019లో జరిగిన దక్షిణాసియా క్రీడల్లో ఆమె మహిళల డబుల్స్, టీమ్ ఈవెంట్లలో పసిడి పతకాలు నెగ్గింది. నిఖత్ ఈ ఏడాది ఇస్తాంబుల్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, బర్మింగ్‌హమ్ కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకాలు సాధించింది. 2019లో బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో మెరిసింది.

అవార్డీల జాబితా

మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న: శరత్ కమల్ (టేబుల్ టెన్నిస్). **అర్జున:** నిఖత్ జరీన్, అమిత్ (బాక్సింగ్), శ్రీజ (టేబుల్ టెన్నిస్), సీమా పూనియా, ఎల్డోస్ పాల్, అవినాశ్ సాబ్లే (అథ్లెటిక్స్), లక్ష్య సేన్, ప్రణయ్ (బ్యాడ్మింటన్), భక్తి కులకర్ణి, ప్రజ్ఞానంద (చెస్), దీప్‌గ్రేస్ ఎక్కా (హాకీ), సుశీలా దేవి (జూడో), సాక్షి కుమారి (కబడ్డీ), నయన్ మోని సైకియా (లాన్ బౌల్), సాగర్ కైలాస్ (మల్లకంబ), ఇలవేనిల్ వలరివన్, ఓంప్రకాశ్ మిథర్వాల్ (షూటింగ్), వికాస్ ఠాకూర్ (వెయిట్‌లిఫ్టింగ్), అన్షు, సరిత (రెజ్లింగ్), పర్వీన్ (వుషు), మానసి జోషి, తరుణ్ ఢిల్లాన్, జెర్లిన్ అనిక (పారా బ్యాడ్మింటన్), స్వప్నిల్ పాటిల్ (పారా స్విమ్మింగ్).

సినిమా

సూపర్ స్టార్ కృష్ణకు గుండెపోటు

- వెంటిలేటర్‌పై చికిత్స

సూపర్ స్టార్ కృష్ణ ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుకు గురయ్యారు. హైదరాబాద్‌లోని నానక్‌రామ్‌గూడలో నివాసం ఉంటున్న ఆయనకు హఠాత్తుగా గుండెపోటు రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను కాంటినెంటల్ హాస్పిటల్‌లో చేర్పించగా, వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. కృష్ణ సోదరుడు జి.ఆదిశేషగిరి రావు, కుమారుడు మహేశ్‌బాబు, కోడలు నమ్రత, కూతురు మంజుల, అల్లుడు సంజయ్, వీకే నరేశ్, ఇతర కుటుంబ సభ్యులతో పాటు సినీ ప్రముఖులు తమ్మారెడ్డి భరద్వాజ, సి. కల్యాణ్ ఆస్పత్రికి చేరుకుని కృష్ణ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.



• కృష్ణ

అప్పుడే అంచనాకు రాగలం

సూపర్‌స్టార్ కృష్ణ ఆరోగ్య పరిస్థితిపై కాంటినెంటల్ హాస్పిటల్ సీఎండీ డాక్టర్ గురు ఎన్. రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ–''కార్డియాక్ అరెస్ట్‌తో అర్ధరాత్రి 2గంటల సమయంలో కృష్ణగారిని ఆస్పత్రికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన డాక్టర్లు ఆయనకు 20 నిమిషాల పాటు సీపీఆర్ చేసి కార్డియాక్ అరెస్ట్ నుంచి బయటకు తీసుకొచ్చారు. కార్డియాక్ అరెస్ట్‌తో ఇతరత్రా సమస్యలు వస్తుంటాయి. కొంతమందికి యాంటీబయాటిక్స్ ఇస్తుంటాం.. మరికొందరికి బీపీ అదుపు చేసేందుకు మందులు అవసరమవుతాయి. కృష్ణగారి విషయంలో గుండె పనితీరులో మార్పుల వల్ల కిడ్నీలు, ఊపిరితిత్తులు ప్రభావితమైనట్టు కనిపిస్తున్నాయి. బ్రెయిన్‌లో చాలా వరకూ ఎఫెక్ట్ అయింది. ఎనిమిది మంది డాక్టర్ల బృందం ఆయనకు అంతర్జాతీయ స్థాయి చికిత్స అందిస్తోంది. ప్రస్తుతం డయాలసిస్ కూడా జరుగుతోంది. 24 గంటల నుంచి 48 గంటలు పర్యవేక్షణ తర్వాతే ఒక అంచనాకు రాగలం'' అన్నారు.

మా నాన్న త్వరగా కోలుకుంటారు...

నటుడు వీకే నరేశ్ కాంటినెంటల్ హాస్పిటల్ వైద్యులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ–''మా నాన్నగారు ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండేవారు. ఆయనకు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవు. వయస్సు రీత్యా ఏవైనా సమస్యలు ఉండొచ్చు.. కానీ నిన్నటి వరకు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారు. మా నాన్నగారి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉంది. శ్వాస కూడా తీసుకుంటున్నారు. అయితే 48 గంటలు గడిస్తే తప్ప ఏమీ చెప్పలేమని డాక్టర్లు చెప్పారు'' అన్నారు.

జపాన్ : మేడ్ ఇన్ ఇండియా!

బంగారు చొక్కా, మెడలో బంగారు గొలుసు, ఒక చేతిలో బంగారు తుపాకీ, మరో చేతిలో గోల్డెన్ గ్లోబ్... ఇదీ హీరో కార్తీ కొత్త గెటప్. ఇదంతా 'జపాన్' సినిమా కోసమే. కార్తీ కెరీర్‌లో 25వ సినిమాగా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. రాజు మురుగన్ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాష్‌బాబు, ఎస్ఆర్ ప్రభు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సునీల్, విజయ్ మిల్టన్ నటిస్తున్నారు. సోమవారం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్ర యూనిట్. అయితే ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కార్తీ రెండు గెటప్‌లతో కనిపిస్తుండటం విశేషం. ''ఓ చమత్కారమైన వ్యక్తి పాత్రలో నటిస్తూ ఓ కొత్త సినిమా జర్నీని స్టార్ట్ చేయడం ఆసక్తికరంగా ఉంది. జపాన్: మేడ్ ఇన్ ఇండియా'' అని పేర్కొన్నారు కార్తీ. ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, డీవోపీ: రవివర్మన్.



• కార్తీ

రాజమౌళి అంత సక్సెస్ విశాల్ అందుకోవాలి

- విజయేంద్ర ప్రసాద్



• యువన్‌శంకర్, వినోద్‌కుమార్, విజయేంద్ర ప్రసాద్, విశాల్, సునయన

''సినిమా కథకి ఎంత బడ్జెట్ అయినా, షూటింగ్‌కి ఎన్ని రోజులు పట్టినా చేయాలనే జబ్బు విశాల్‌కి ఉంది. ఆ జబ్బు మా అబ్బాయి రాజమౌళి నుంచి విశాల్‌కి అంటుకుంది (నవ్వుతూ). రాజమౌళి ఎంత సక్సెస్ అందుకున్నాడో మంచి మనసున్న విశాల్ కూడా అంతే సక్సెస్ అందుకోవాలి'' అని ప్రముఖ రచయిత–దర్శకుడు, రాజ్యసభ ఎంపీ విజయేంద్ర ప్రసాద్ అన్నారు. విశాల్, సునయన జంటగా ఎ.వినోద్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'లాఠీ'. రానా ప్రొడక్షన్స్‌పై రమణ, నంద నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో డిసెంబర్ 22న విడుదల కానుంది. ఈ చిత్రం టీజర్‌ని విజయేంద్ర ప్రసాద్ రిలీజ్ చేశారు. విశాల్ మాట్లాడుతూ– ''వినోద్ కుమార్ గురించి 'లాఠీ' విడుదలయ్యాక సిల్వర్ స్క్రీనే చెబుతుంది. రమణ, నంద చాలా ప్యాషన్‌తో ఈ సినిమా చేశారు. నా ప్రతి సినిమాలానే 'లాఠీ'ని ఎంత మంది చూస్తారో టికెట్‌కి రూపాయి చొప్పున రైతులకు ఇస్తాను'' అన్నారు. ''లాఠీ' యాక్షన్ అడ్వంచర్ సర్వైవల్ థ్రిల్లర్ మూవీ'' అన్నారు వినోద్ కుమార్. ''ఈ సినిమాతో విశాల్‌కి జాతీయ అవార్డు వస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు రమణ. మాటల రచయిత రాజేష్ ఎ.మూర్తి, పాటల రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

నాగశౌర్యకు అస్వస్థత

హీరో నాగశౌర్య అస్వస్థతకు గురయ్యారు. పవన్ బాసంశెట్టి దర్శకత్వంలో నాగశౌర్య హీరోగా సుధాకర్ చెరుకూరి ఓ సినిమా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రస్తుతం ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. అయితే ఈ యాక్షన్ సీన్ చేస్తున్నప్పుడు నాగశౌర్య అస్వస్థతకు లోనయ్యారు. దీంతో వెంటనే ఆయన్ని హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. డీ హైడ్రేషన్ కారణంగా నాగశౌర్య అస్వస్థతకు లోనైనట్లు తెలిసింది. ఇదిలా ఉంటే.. ఈ నెల 20న బెంగళూరులో నాగశౌర్య వివాహం జరగనుంది. అనూష శెట్టితో నాగశౌర్య ఏడడుగులు వేయనున్న సంగతి తెలిసిందే.



ఒక మాతృభాష కథ



• ఆర్పీ చౌదరి, యష్ పూరి, స్టెఫీ పటేల్, అరుణ్ భారతి, అంజన్

''సూపర్ గుడ్ ఫిల్మ్స్‌లో చాలామంది నటీనటులు, సాంకేతిక నిపుణులను పరిచయం చేశాం. ఇప్పుడు 'చెప్పాలని ఉంది' తో యష్‌ని హీరోగా పరిచయం చేస్తున్నాం. యూనిక్ సబ్జెక్ట్‌తో రూపొందిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది'' అని నిర్మాత ఆర్పీ చౌదరి అన్నారు. యష్ పూరి, స్టెఫీ పటేల్ ప్రధాన పాత్రల్లో అరుణ్ భారతి ఎల్.దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'చెప్పాలని ఉంది'. 'ఒక మాతృభాష కథ' అనేది ఉపశీర్షిక. ఆర్పీ చౌదరి సమర్పణలో సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందిన చిత్రం 'చెప్పాలని ఉంది'. వాకాడ అంజన్ కుమార్, యోగేష్ కుమార్ నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 9న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదలలో ఆర్పీ చౌదరి మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథలని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. అందుకే ఈ చిత్రాన్ని ముందుగా తెలుగులోనే తీశాం. ఆ తర్వాత తమిళ్‌తో పాటు మిగతా భాషల్లో రీమేక్ చేస్తాం'' అన్నారు. ''యాక్షన్, రొమాన్స్, కామెడీ అంశాలున్న చిత్రమిది'' అన్నారు యష్ పూరి. ''ఈ సినిమా చూశాను.. చాలా బాగుంది'' అన్నారు నిర్మాత వాకాడ అప్పారావు. ''చెప్పాలని ఉంది' కి ప్రేక్షకుల సహకారం ఇవ్వాలి'' అన్నారు అరుణ్ భారతి. ఈ వేడుకలో హమ్స్ టెక్ ఫిలిమ్స్ యోగేష్, మాటల రచయిత విజయ్ చిట్నీడి మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: ఆర్పీ డీఎఫ్టీ, సంగీతం: అస్లాంకీ.

వారాహి అమ్మవారి నేపథ్యంతో...



• సంతోష్, వీవీ వినాయక్, సుమంత్, రమాదేవి

'సుబ్రహ్మణ్యపురం' వంటి హిట్ చిత్రం తర్వాత హీరో సుమంత్, దర్శకుడు సంతోష్ జాగర్లపూడి కాంబినేషన్‌లో 'వారాహి' మూవీ షురూ అయింది. జీకే మూవీ మేకర్స్ పతాకంపై రమాదేవి నారగాని నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభమైంది. తొలి సీన్‌కి నిర్మాత సురేష్‌బాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ ఇచ్చారు. సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ– ''ఏడుగురు దేవతామూర్తుల్లో వారాహి అమ్మవారు ఒకరు. వరాహ స్వామి శక్తి నుండి ఉద్భవించిన వారాహి అమ్మవారి ఆలయ నేపథ్యంలో డివోషనల్ మిస్టీరియస్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం'' అన్నారు. సుమంత్ మాట్లాడుతూ– ''సంతోష్ ఈ కథ చెప్పగానే చప్పట్లు కొట్టాను. మా కాంబినేషన్‌లో వచ్చిన 'సుబ్రహ్మణ్యపురం' కంటే చాలా మంచి స్క్రిప్ట్ ఇది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఈశ్వర్ చంద్, సహనిర్మాత: కేఆర్ ప్రదీప్.

అలాంటి ఐటమ్ సాంగ్ అయితే చేస్తా!

- గెహ్నా సిప్పీ

''ఓ కాలేజ్ గర్ల్, మాస్ అబ్బాయి మధ్య జరిగే ప్రేమ కథ 'గాలోడు'. ఇద్దరి మధ్య ప్రేమ ఎలా మొదలైంది? ఆ తర్వాత ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారు? అనేది ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు హీరోయిన్ గెహ్నా సిప్పీ. 'సుడిగాలి' సుధీర్ హీరోగా రాజశేఖర్ రెడ్డి పులిచర్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గాలోడు'. ప్రకృతి సమర్పణలో సంస్కృతి ఫిలింస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా గెహ్నా సిప్పీ మాట్లాడుతూ– ''నేను ముంబైలో పుట్టి పెరిగాను. నా ఫొటోలు, వీడియోలు చూసి, 'గాలోడు'కి అవకాశం ఇచ్చారు. ఈ సినిమాలో క్యూట్ కాలేజ్ గర్ల్‌గా కనిపిస్తాను. సెట్‌లో అందరూ తెలుగులోనే మాట్లాడేవారు. అందుకే నాకు తెలుగు డైలాగ్స్ చెప్పడం ఈజీగా అనిపించింది.. అయితే నా పాత్రకి నేను డబ్బింగ్ చెప్పలేదు. నాకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్, సంగీతం అంటే చాలా ఇష్టం. డీసెంట్‌గా ఉండే ఐటమ్ సాంగ్స్ చేస్తాను. హీరోల్లో రామ్‌చరణ్, నాగచైతన్య, ధనుష్‌గార్లు చాలా ఇష్టం. శేఖర్ కమ్ముల గారితో సినిమా చేయాలని ఉంది. సుకుమార్‌గారంటే ఇష్టం. నా తర్వాతి చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి'' అన్నారు.



వైవిధ్యం.. వినోదం...



• సాందీప్, జెస్సీ, ఆకాష్ పూరి

జస్వంత్ పడాల (జెస్సీ), నక్షత్ర త్రినయని ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఎర్రర్ 500'. సాందీప్ మైత్రేయ.ఎస్ దర్శకత్వంలో యు.బాలరెడ్డి (ఇన్ఫోసిటీ బిల్డర్స్) నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథులుగా దర్శకుడు వీఎస్ ఆదిత్య, హీరో ఆకాష్ పూరి పాల్గొన్నారు. వీఎస్ ఆదిత్య మాట్లాడుతూ–''ట్రైలర్ బ్రిలియంట్‌గా ఉంది. అలాగే 'ఎర్రర్ 500' అనేది జెస్సీకి యాప్ట్ టైటిల్. ఈ సినిమా రిలీజ్ ప్లాన్ గురించి సాందీప్‌ని అడిగినప్పుడు సంతోషం సురేష్‌గారు చూశారని చెప్పారు. వెంటనే సినిమా సేఫ్ హ్యాండ్స్‌లో ఉందని చెప్పాను'' అన్నారు. ''ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశాం. సినిమా అద్భుతంగా వచ్చింది. ఫణి కల్యాణ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు'' అన్నారు జెస్సీ. ''ట్రైలర్‌లానే సినిమా కూడా చాలా వైవిధ్యంగా ఉంటుంది. జెస్సీ చాలా అంకితభావంతో ఈ సినిమా చేశాడు'' అన్నారు సాందీప్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
171	21
61,624	18,329

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	11,282	▽	41
డోజోన్స్	33,837	△	89
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,385	△	67
డాక్స్	14,313	△	88
షాంఘై	3,083	▽	4
నికాయ్	27,963	▽	300

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	52,430
బంగారం (99.5 స్వచ్ఛత)	52,220
వెండి (కిలో)	61,583

బ్యాంక్ ఆఫ్ బరోడా ఎఫ్‌డీ రేట్ల పెంపు



న్యూఢిల్లీ: రిటైల్ టర్మ్ డిపాజిట్ రేట్లను బ్యాంక్ ఆఫ్ బరోడా ఒక శాతం మేర పెంచింది. 1-2 ఏళ్ల డిపాజిట్లపై రేటు 5.50 శాతం నుంచి 6.10 శాతానికి చేరింది. 2-3 ఏళ్ల డిపాజిట్లపై 0.70 శాతం పెరిగి 6.25 శాతంగా ఉంది. 3-10 ఏళ్ల డిపాజిట్ల రేటు 0.45 శాతం పెరిగి 6.10 శాతానికి చేరింది. 46-180 రోజుల డిపాజిట్లపై రేటు అర శాతం పెరిగి 4.50 శాతానికి చేరింది. అలాగే, రూ.50-200 కోట్ల మధ్య డిపాజిట్లపై బ్యాంక్ ఆఫ్ బరోడా పావు శాతం మేర రేట్లను పెంచింది. ఎన్‌ఆర్‌వో టర్మ్ డిపాజిట్‌పై ఒక శాతం పెరిగి 6.10 శాతానికి చేరింది. 60 ఏళ్లు నిండిన వృద్ధులకు అరశాతం అదనపు రేటును బ్యాంక్ ఆఫర్ చేస్తోంది.

ఐదు పతంజలి ఔషధాలపై నిషేధం ఎత్తివేత

ఉత్తరాఖండ్ ప్రభుత్వ నిర్ణయం



డెహ్రాడూన్: పతంజలి ఔషధాలు ఐదింటిపై విధించిన నిషేధాన్ని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ మేరకు రాష్ట్ర ఆయుర్వేద, యునాని సర్వీసెస్ లైసెన్సింగ్ అధికారి పతంజలి ఔషధ ఉత్పత్తి సంస్థ దివ్య ఫార్మసీకి ఒక లేఖ రాస్తూ, 'పొరపాటున ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది' అని వివరించారు. గత వారం లైసెన్సింగ్ అథారిటీ 'తప్పుదోవ పట్టించే ప్రకటనలు' కారణంగా చూపుతూ ఐదు ఔషధాల ఉత్పత్తిని నిలిపివేయాలని పతంజలి ఉత్పత్తులను తయారు చేసే దివ్య ఫార్మసీని ఆదేశించింది. బీపీగ్రిట్, మధుగ్రిట్, థైరోగ్రిట్, లిపిడొమో, ఐగ్రిట్ గోల్డ్ ట్యాబ్లెట్లు ఇందులో ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-11-2022	
విశాఖ	520-00
చిత్తూరు	548-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	517-00
విజయవాడ	517-00
రిటైల్ ధర (డజను)	78.00
14-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	510-00
వరంగల్	503-00
రిటైల్ ధర	5.60

వంట నూనెల దిగుమతులు పెరిగాయ్

న్యూఢిల్లీ: వంట నూనెల దిగుమతుల విలువ అక్టోబర్‌తో ముగిసిన సంవత్సరంలో రూ.1.57 లక్షల కోట్లకు చేరుకుంది. అంత క్రితం ఏడాదితో పోలిస్తే ఇది 34.18 శాతం అధికం కావడం గమనార్హం. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఈఏ) ప్రకారం.. విదేశాల నుంచి భారత్‌కు దిగుమతి అయిన వంట నూనెల పరిమాణం 6.85 శాతం అధికమై 140.3 లక్షల టన్నులుగా ఉంది. 2020-21 నవంబర్-అక్టోబర్‌లో 131.3 లక్షల టన్నుల నూనెలు భారత్‌కు వచ్చి చేరాయి. వీటి విలువ రూ.1.17 లక్షల కోట్లు. 2021-22 నవంబర్-అక్టోబర్ కాలానికి పామ్ ఆయిల్ దిగుమతులు 4 లక్షల టన్నులు తగ్గి 79 లక్షల టన్నులుగా ఉంది. ధరల అధిక అస్థిరత ఈ తగ్గుదలకు కారణం. ఆర్‌బీడీ పామోలిన్ దాదాపు మూడింతలై 18.4 లక్షల టన్నులకు చేరింది. ముడి పామాయిల్ 20 శాతం క్షీణించి 59.94 లక్షల



టన్నులు నమోదైంది. సాఫ్ట్ ఆయిల్స్ 48.12 లక్షల టన్నుల నుంచి 61.15 లక్షల టన్నులకు ఎగసింది. సాఫ్ట్ ఆయిల్స్‌లో సోయాబీన్ 28.66 లక్షల టన్నుల నుంచి 41.71 లక్షల టన్నులు, సన్‌ఫ్లవర్ స్వల్పంగా అధికమై 19.44 లక్షల టన్నులకు చేరింది. నవంబర్ 1 నాటికి దేశంలో 24.55 లక్షల టన్నుల వంట నూనెల నిల్వలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా నెలకు 19 లక్షల టన్నుల నూనె వినియోగం అవుతోంది. ముడి పామాయిల్, ఆర్‌బీడీ పామోలిన్ అధికంగా ఇండోనేషియా, మలేషియా నుంచి సరఫరా అవుతోంది.

పిల్లలకు ఇక ఆర్థిక పాఠాలు


ఆర్‌బీఐ కార్యక్రమానికి రాష్ట్రాల ఆమోదం



న్యూఢిల్లీ: దేశంలో మూడు రాష్ట్రాలు మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు ఆర్‌బీఐ సూచించే ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని పాఠ్యాంశాల్లో చేర్చడానికి అంగీకరించాయి. ఆర్‌బీఐ, ఇతర నియంత్రణ సంస్థలు సంయుక్తంగా ఆర్థిక అక్షరాస్యత అంశాలను రూపొందించాయి. దీంతో స్కూల్ పాఠ్యాంశాల్లో ప్రాథమిక ఆర్థిక అంశాలకు చోటు లభించనుంది. ''పాఠశాల విద్యలో ఆర్థిక అక్షరాస్యతను మనం చేర్చితే, దేశంలో ఆర్థిక జ్ఞానం విస్తరించేందుకు తోడ్పడుతుంది. 6-10 తరగతుల పాఠాల్లో దీన్ని చేర్చనున్నా''అని ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్ కుమార్ శర్మ అన్నారు.

ధరలు దిగొచ్చాయ్!

- 19 నెలల కనిష్టానికి టోకు ద్రవ్యోల్బణం
- అక్టోబర్‌లో 8.39 శాతంగా నమోదు
- తగ్గిన కూరగాయల ధరలు
- రిటైల్ ద్రవ్యోల్బణం 6.77 శాతం



న్యూఢిల్లీ: వినియోగదారునిపై ధరల మంట కొంత తగ్గింది. రిటైల్, టోకు ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) శాంతించాయి. రిటైల్ ద్రవ్యోల్బణం మూడు నెలల కనిష్ట స్థాయి 6.77 శాతానికి దిగి రాగా, టోకు ద్రవ్యోల్బణం 19 నెలల కనిష్ట స్థాయి అయిన 8.39 శాతానికి అక్టోబర్‌లో క్షీణించింది. ఆహారం, ఇంధనం, వస్తు తయారీ ధరలు తగ్గడం ఇందుకు అనుకూలించింది. డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం వరుసగా ఐదో నెలలోనూ తగ్గినట్టయింది. ముఖ్యంగా ఏడాదిన్నర విరామం తర్వాత ఒక అంకెకు దిగొచ్చింది. మినరల్ ఆయిల్స్, బేసిక్ మెటల్స్, ఫ్యాబ్రికేటెడ్ మెటల్ ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్, తదితర ఉత్పత్తుల ధరలు తగ్గడం టోకు ద్రవ్యోల్బణం ఉపశమించడానికి అనుకూలించినట్టు కేంద్ర వాణిజ్య శాఖ పేర్కొంది. ఇప్పటికీ రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ గరిష్ట నియంత్రిత స్థాయి 6 శాతానికి పైనే ఉండడాన్ని గమనించాలి. దీన్ని బట్టి చూస్తుంటే తదుపరి సమీక్షలో రేట్ల పెంపు ఖాయమే అని తెలుస్తోంది. రిటైల్ ద్రవ్యోల్బణం అక్టోబర్ నెలకు 7 శాతంలోపునకు దిగొస్తుందన్న ఆశాభావాన్ని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ గత శనివారం వ్యక్తం చేయడం గమనార్హం. ముఖ్యంగా గరిష్ట పరిమితి 6 శాతంపైన 9 నెలలపాటు చలిస్తుండడంతో, ఆర్‌బీఐ తన చర్యల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి వివరణ కూడా ఇవ్వాల్సి వచ్చింది.

రిటైల్ ధరలు ఇలా...


- సెప్టెంబర్ నెలకు రిటైల్ ద్రవ్యోల్బణం 7.41 శాతంగా ఉండగా, అక్టోబర్‌లో 6.77 శాతంగా నమోదైంది. అంతకుముందు ఆగస్ట్ నెలలో 6.71 శాతంగా ఉండడం గమనార్హం.
- ఆర్‌బీఐ గరిష్ట పరిమితి 6 శాతానికి పైన రిటైల్ ద్రవ్యోల్బణం నమోదు కావడం వరుసగా పదో నెలలోనూ (ఈ ఏడాది జనవరి నుంచి) జరిగింది.
- ఆహార ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 8.6 శాతంగా ఉంటే, అక్టోబర్‌కు 7.01గా నమోదైంది.
- కూరగాయలకు సంబంధించి 7.7 శాతానికి దిగొచ్చింది.
- ఇంధన ద్రవ్యోల్బణం 9.93 శాతంగా ఉంది.
- డిసెంబర్ త్రైమాసికంలో 6.5 శాతం, మార్చి త్రైమాసికంలో 5.8 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుతుందని ఆర్‌బీఐ అంచనాగా ఉంది.

టోకు ద్రవ్యోల్బణం – 8.39 శాతం

- ఆహారోత్పత్తుల టోకు ద్రవ్యోల్బణం 11.03 శాతం నుంచి 8.33 శాతానికి తగ్గింది.
- కూరగాయలు, ఆలుగడ్డ, ఉల్లిగడ్డ, పండ్లు, గుడ్లు, మాంసం, చేపల టోకు ధరలు తగ్గాయి. సెప్టెంబర్‌లో కూరగాయలపై ద్రవ్యోల్బణం 39.66 శాతంగా ఉంటే, అక్టోబర్‌కు 17.61 శాతానికి తగ్గింది.
- వరి, గోధుమ, ఇతర ధాన్యాల ధరలు పెరిగాయి.
- నూనె గింజలకు సంబంధించి ద్రవ్యోల్బణం మైనస్ 5.36 శాతంగా, మినరల్స్‌కు సంబంధించి 3.86 శాతంగా ఉంది.
- ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం 23.17 శాతానికి పరిమితం కాగా, తయారీ ఉత్పత్తులపై టోకు ద్రవ్యోల్బణం 4.42 శాతంగా ఉంది.

సూచీలకు స్వల్ప నష్టాలు

- పరిమిత శ్రేణి ట్రేడింగ్
- తీవ్ర ఒడిదుడుకులు



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప నష్టంతో ముగిశాయి. అధిక వెయిటేజీ ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు పతనంతో పాటు ఆసియా మార్కెట్లలోని బలహీనతలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఆర్‌బీఐ ద్రవ్య విధాన వైఖరి, వడ్డీ రేట్ల పెంపు/తగ్గుదలను నిర్ణయించే ద్రవ్యోల్బణ డేటా వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. దేశీయంగా ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడాయి. సెన్సెక్స్ ఉదయం 29 పాయింట్ల నష్టంతో 61,766 మొదలైంది. ట్రేడింగ్‌లో 121 పాయింట్లు బలపడి 61,916 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. అలాగే 61,572 పాయింట్ల వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 171 పాయింట్లు పతనమైన 61,624 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 26 పాయింట్ల లాభంతో 18,376 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. నిఫ్టీ రోజంతా 88 పాయింట్ల పరిధిలో 18,311 – 18,399 శ్రేణిలో ఊగిసలాడింది. మార్కెట్ ముగిసే సరికి 21 పాయింట్లు నష్టపోయి 18,329 వద్ద ముగిసింది. ఆర్థిక, బ్యాంక్స్, ఎఫ్‌ఎంసీజీ, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మెటల్, ఆటో, ఐటీ, రియల్టీ, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఆసియాలో చైనా, జపాన్, కొరియా, థాయిలాండ్, ఇండోనేషియా స్టాక్ సూచీలు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు, యూఎస్ స్టాక్ ఫ్యూచర్లు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి. ''స్వల్పకాలంలో నిఫ్టీకి 18,202-18,259 శ్రేణిలో తక్షణ మద్దతు లభించనుంది. ఎగువ స్థాయిలో 18,399 పాయింట్ల వద్ద నిరోధాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది'' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ రిటైల్ రీసెర్చ్ హెడ్ దీపక్ జసానీ తెలిపారు.

హైదరాబాద్‌లో డార్విన్‌బాక్స్ కొత్త హెడ్‌క్వార్టర్స్

మూడేళ్లలో పబ్లిక్ ఇష్యూ యోచన

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మానవ వనరుల టెక్నాలజీ సేవల సంస్థ డార్విన్‌బాక్స్ హైదరాబాద్‌లో తమ కొత్త గ్లోబల్ హెడ్‌క్వార్టర్స్‌ను ప్రారంభించింది. వచ్చే ఆరు నెలల్లో ఇక్కడి ఉద్యోగుల సంఖ్యను 1,000కి పెంచుకోనున్నట్లు ఈ సందర్భంగా సంస్థ సహ వ్యవస్థాపకుడు రోహిత్ చెన్నమనేని సోమవారం తెలిపారు. ప్రస్తుతం ఈ సంఖ్య 700గా ఉండగా, అంతర్జాతీయంగా అన్ని మార్కెట్లలో కలిపి దాదాపు 1,200 మంది ఉన్నట్లు ఆయన వివరించారు. కొత్తగా ఇంజినీరింగ్, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ తదితర విభాగాల్లో సిబ్బందిని తీసుకోనున్నట్లు చెప్పారు. మరోవైపు, రాబోయే మూడేళ్లలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే యోచనలో ఉన్నట్లు రోహిత్ వివరించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశీ విభాగం లాభాలు నమోదు చేయడంపై దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. యూరప్, అమెరికా తదితర మార్కెట్లలో కార్యకలాపాలు మరింతగా విస్తరించనున్నట్లు వివరించారు. 2015లో చైతన్య పెద్ది, జయంత్ పాలేటి, రోహిత్ చెన్నమనేని ప్రారంభించిన డార్విన్‌బాక్స్‌కు 700 పైచిలుకు క్లయింట్లు, దాదాపు 20 లక్షల మంది యూజర్లు ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో సమీకరించిన 72 మిలియన్ డాలర్ల నిధులతో యూనికార్న్ హోదా (బిలియన్ డాలర్ల వేల్యుయేషన్) దక్కించుకుంది.



ఎన్‌ఎండీసీ లాభం డౌన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ రంగ దిగ్గజం ఎన్‌ఎండీసీ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 62 శాతం తగ్గి రూ.886 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ రూ.6,882 కోట్ల నుంచి రూ.3,755 కోట్లకు పడిపోయింది. వ్యయాలు రూ.3,743 కోట్ల నుంచి రూ.2,570 కోట్లకు వచ్చి చేరాయి. క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో ఎన్‌ఎండీసీ షేరు ధర సోమవారం 0.26 శాతం పడిపోయి రూ.113.35 వద్ద స్థిరపడింది.

భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, చెన్నైలో 25 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

చెన్నైలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్..ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ,డిజిటల్ బ్యాంకింగ్ విభాగాల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 25
- » విభాగాలు: బిజినెస్ అనలిస్ట్, డేటా ఇంజనీర్, క్లౌడ్ ఇంజనీర్, డేటా సైంటిస్ట్, నెట్‌వర్క్ సెక్యూరిటీ ఇంజనీర్, ఒరాకిల్ డీబీఏ, మిడిల్‌వేర్ ఇంజనీర్, సర్వర్ అడ్మినిస్ట్రేటర్, రూటింగ్-స్విచింగ్ ఇంజనీర్, హార్డ్‌వేర్ ఇంజనీర్, సొల్యూషన్ ఆర్కిటెక్ట్, డిజిటల్ బ్యాంకింగ్, ఏటీఎం మేనేజ్డ్ సర్వీసెస్-ఏటీఎం స్విచ్, మర్చంట్ అక్విజిషన్, కంప్లైన్స్-ఆడిట్. » అర్హత: బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్,ఎంఎస్సీ,ఎంబీఏ, ఎంసీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: 25 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- » జీతం: నెలకు రూ.48,170 నుంచి రూ.69,810 చెల్లిస్తారు.
- » ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది: 30.11.2022
- » వెబ్‌సైట్: www.iob.in

ఎన్‌ఎండీసీ, హైదరాబాద్‌లో 11 పోస్టులు

హైదరాబాద్‌లోని ఎన్‌ఎండీసీ లిమిటెడ్.. వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 11
- » పోస్టుల వివరాలు: జాయింట్ కంపెనీ సెక్రటరీ-01, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(లా)-01, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(పర్సనల్)-03, జూనియర్ మేనేజర్(కెమికల్)-01, జూనియర్ మేనేజర్(ఇన్విరాన్‌మెంట్)-03, జూనియర్ మేనేజర్ (రాజభాష)-2.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో 10+2, గ్రాడ్యుయేషన్ /పీజీ డిగ్రీ/ పీజీ డిప్లొమా/ఎంఎస్సీ/ఎంఏ ఉత్తీర్ణులవ్వాలి.
- » వయసు: 30 నుంచి 45 ఏళ్లు మించకూడదు.
- » జీతం: నెలకు రూ.50,000 నుంచి రూ.2.6 లక్షలు చెల్లిస్తారు.
- » ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష/రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 25.11.2022
- » వెబ్‌సైట్: www.nmdc.co.in

పదితోనే ఐబీలో కొలువు

జాబ్స్ ఇన్ఫో

1671 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల

దేశంలోని అత్యంత కీలక విభాగమైన ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ పరిధిలో ఈ సంస్థ పనిచేస్తుంది. ప్రస్తుతం నోటిఫికేషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న సబ్సిడరీ ఇంటిలిజెన్స్ బ్యూరోల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 1,671 సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్, మల్టీటాస్కింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీ చేపట్టనుంది. పదోతరగతి విద్యార్హతతో ఈ ఉద్యోగాలను సొంతం చేసుకోవచ్చు.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 1671
- » విభాగాలు: సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ -1521 పోస్టులు; మల్టీటాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్): 150 పోస్టులు.
- » అర్హతలు: గుర్తింపు పొందిన బోర్డ్ నుంచి మెట్రిక్యులేషన్(పదోతరగతి) లేదా తత్సమాన విద్యార్హత ఉండాలి. అలాగే అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న రాష్ట్ర నివాస ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. స్థానిక భాషపై అవగాహన ఉండాలి.
- » వయసు: 25.11.2022 నాటికి ఎస్ఏ/ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 25ఏళ్లు, ఎంటీఎస్ పోస్టులకు 27ఏళ్లు మించకుండా ఉండాలి. రిజర్వ్‌డ్ అభ్యర్థులకు వయోసడలింపు వర్తిస్తుంది.
- » ఎంపిక ఇలా:టైర్-1(ఆన్‌లైన్ రాతపరీక్ష), టైర్-2(ఆఫ్‌లైన్ డిస్క్రిప్టివ్ టెస్ట్),టైర్-3 (ఇంటర్వ్యూ)ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- » రాత పరీక్ష: సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్, ఎంటీఎస్ ఉద్యోగాలకు పరీక్ష ఒకటే ఉంటుంది.
- » టైర్-1: ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షను నిర్వహిస్తారు. మొత్తం 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, న్యూమరికల్ ఎబిలిటీ (అనలిటికల్ /లాజికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్), ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ స్టడీస్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. ఒక్కో విభాగం నుంచి 20 చొప్పున ప్రశ్నలను అడుగుతారు.
- » టైర్-2: ఆఫ్‌లైన్ విధానంలో 40 మార్కులకు గంట సమయంతో పరీక్ష ఉంటుంది. డిస్క్రిప్టివ్ రూపంలో ప్రశ్నలుంటాయి.ట్రాన్స్‌లేషన్,వాయిస్ వైస్ వెర్సాల నుంచి ప్రశ్నలుంటాయి. స్పోకెన్ ఎబిలిటీ నుంచి 10మార్కులకు పరీక్ష ఉంటుంది (ఇది సెక్యూరిటీ అసిస్టెంట్ /ఎగ్జిక్యూటివ్ వారికి మాత్రమే).టైర్-2కి సంబంధించి సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ అభ్యర్థులు 50కి 20క్వాలిఫయింగ్ మార్కులు సాధించాలి. ఎంటీఎస్ అభ్యర్థులు 40కి 16 మార్కులు సాధించాలి.
- » టైర్-3: ఈ దశలో ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్‌ను నిర్వహిస్తారు. ఇది 50 మార్కులకు ఉంటుంది.

ముఖ్యమైన సమాచారం

- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- » దరఖాస్తులకు చివరి తేదీ: 25.11.2022
- » వెబ్‌సైట్: www.mha.gov.in

సర్కారీ బ్యాంకులో.. స్పెషలిస్ట్ ఆఫీసర్

» ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎస్ఓ పోస్టులకు ఐబీపీఎస్ నోటిఫికేషన్

» మొత్తం 11 బ్యాంకుల్లో 710 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ

ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, లా, అగ్రికల్చర్ వంటి ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసుకున్న వారి కోసం.. ఐబీపీఎస్(ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్) స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది! దీనిద్వారా 710 ఎస్ఓ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఆయా అర్హతలు కలిగిన అభ్యర్థులు సరైన వ్యూహంతో అడుగులు వేస్తే.. సర్కారీ బ్యాంకుల్లో స్కేల్ 1 కొలువు సొంతం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఐబీపీఎస్ సీఆర్‌పీ-ఎస్‌పీఎల్-12 నోటిఫికేషన్ వివరాలు, భర్తీ చేయనున్న పోస్టులు, ఎంపిక విధానంతోపాటు విజయం సాధించడమెలాగో తెలుసుకుందాం...

11 బ్యాంకులు.. 710 పోస్ట్‌లు

దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పలు హోదాల్లోని ఖాళీల భర్తీకి.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్) నియామక ప్రక్రియ చేపడుతోంది. మొత్తం పదకొండు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో(బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) 710 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకి తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది.

పోస్టుల వివరాలు

-ఐటీ ఆఫీసర్(స్కేల్-1): 44 పోస్ట్‌లు; అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్(స్కేల్-1): 516 పోస్ట్‌లు; రాజ్‌భాష అధికారి(స్కేల్-1): 25 పోస్ట్‌లు; లా ఆఫీసర్(స్కేల్-1): 10 పోస్ట్‌లు; హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్(స్కేల్-1): 15 పోస్ట్‌లు; మార్కెటింగ్ ఆఫీసర్ (స్కేల్-1): 100 పోస్ట్‌లు.

అర్హతలు

- ఆయా పోస్టులను అనుసరించి మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్, లా తదితర ప్రొఫెషనల్ కోర్సుల ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు.
- **వయసు:** అన్ని పోస్ట్‌లకు నవంబర్ 1, 2022 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీ(నాన్-క్రీమీ లేయర్)లకు మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌ల భర్తీకి ఐబీపీఎస్ మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. అవి.. ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్, పర్సనల్ ఇంటర్వ్యూ. ప్రిలిమినరీ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ మినహా మిగతా విభాగాలకు ఇంగ్లిష్ లేదా హిందీ మీడియంలలో హాజరుకావచ్చు.

ప్రిలిమినరీ (లా ఆఫీసర్, రాజ్ భాష అధికారి)

ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 50 ప్రశ్నలు-25 మార్కులు, రీజనింగ్ 50 ప్రశ్నలు-50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు బ్యాంకింగ్ ఇండస్ట్రీ 50 ప్రశ్నలు-50 మార్కులు.. ఇలా మొత్తం 150 ప్రశ్నలు-125 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.

ఇతర పోస్ట్‌లకు ప్రిలిమినరీ ఇలా

ఐటీ ఆఫీసర్, అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్, హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్ పోస్ట్‌లకు నిర్వహించే ప్రిలిమినరీ పరీక్షలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ 50 ప్రశ్నలు-25 మార్కులు, రీజనింగ్ 50 ప్రశ్నలు-50 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-50 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం రెండు గంటలు.

రెండో దశ మెయిన్

- ప్రిలిమినరీ పరీక్షలో సాధించిన మార్కులు, సబ్జెక్ట్/సెక్షన్ వారీగా నిర్దేశించిన కటాఫ్ మార్కులు పొందిన వారిని.. అందుబాటులోకి ఖాళీలను పరిగణనలోకి తీసుకుంటూ మెయిన్ ఎగ్జామ్‌కు ఎంపిక చేస్తారు.
- రాజ్ భాష అధికారి పోస్ట్‌లకు ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో, మిగతా పోస్ట్‌లకు పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో మెయిన్ పరీక్షలు నిర్వహిస్తారు.
- రాజ్ భాష అధికారి మెయిన్‌లో ప్రొఫెషనల్ నాలెడ్జ్‌పై 45 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు, ప్రొఫెషనల్ నాలెడ్జ్ డిస్క్రిప్టివ్‌లో 2 ప్రశ్నలు అడుగుతారు. రెండు విభాగాలకు సంబంధించి మొత్తం 60 మార్కులకు పరీక్ష ఉంటుంది. డిస్క్రిప్టివ్ విభాగానికి సంబంధించి అభ్యర్థులు ఇంగ్లిష్ లేదా హిందీ మీడియంలో ఒక ఎస్సే రైటింగ్, ఒక లెటర్ రైటింగ్ రాయాల్సి ఉంటుంది.
- ఐటీ ఆఫీసర్, లా ఆఫీసర్, అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్, హెచ్ఆర్/పర్సనల్ ఆఫీసర్, మార్కెటింగ్ ఆఫీసర్ పోస్ట్‌లకు నిర్వహించే మెయిన్ పరీక్షలో ప్రొఫెషనల్ నాలెడ్జ్‌పై 60 ప్రశ్నలు-60 మార్కులకు ఉంటాయి.
- ప్రిలిమ్స్, మెయిన్స్ రెండు పరీక్షల్లోనూ నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమలు చేస్తున్నారు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కుల కోత విధిస్తారు.

చివరగా ఇంటర్వ్యూ

ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షల్లో పొందిన మార్కుల ఆధారంగా.. ఖాళీలను అనుసరించి మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. 100మార్కులకు జరిగే ఈ ఇంటర్వ్యూలో అభ్యర్థులకు బ్యాంకింగ్ రంగం పట్ల ఉన్న ఆసక్తి,తాజా పరిణామాలపై అవగాహన, వ్యక్తిగత దృక్పథం వంటి అంశాలను పరిశీలిస్తారు.



బ్యాంక్ జాబ్స్

80:20 వెయిటేజీ విధానం

తుది జాబితా రూపకల్పనలో మెయిన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల్లో పొందిన మార్కులకు 80:20 నిష్పత్తిలో వెయిటేజీ విధానాన్ని అనుసరించి.. విజేతలను ఖరారు చేస్తారు. అంటే.. మొత్తం వంద మార్కులకు తుది జాబితాను నిర్ధారించి.. అందులో పైన పేర్కొన్న వెయిటేజీలను క్రోడీకరించి..విజేతల జాబితాను సిద్ధం చేస్తారు.

విజయ సాధనకు మార్గాలివే

బ్యాంకు పరీక్షలంటేనే తీవ్రమైన పోటీ నెలకొంటుంది. కాబట్టి స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు.. దరఖాస్తు సమయం నుంచే విజయం దిశగా అడుగులు వేయాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌తో మొదలుపెట్టి వొకాబ్యులరీ పెంచుకోవడం వరకు కృషి చేయాలి. రీడింగ్ కాంప్రహెన్షన్, కరెక్షన్ ఆఫ్ సెంటెన్సెస్,జంబుల్డ్ సెంటెన్సెస్,ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే ఇంగ్లిష్ ఎస్సే రైటింగ్,లెటర్ రైటింగ్ కోసం ఇంగ్లిష్ దినపత్రికలు చదవడం, ఎడిటోరియల్ లెటర్స్ అనుసరించడం మేలు చేస్తుంది.

రీజనింగ్

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో ప్రధానంగా భావించే రీజనింగ్ ప్రిపరేషన్ పరంగా అభ్యర్థులు పకడ్బందీగా వ్యవహరించాలి. సిరీస్, అనాలజీ, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్‌పై పట్టు సాధించాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగానికి సంబంధించి అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, పర్సంటేజెస్, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియోస్ సంబంధిత ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వీటితోపాటు నంబర్ సిరీస్, డేటా అనాలిసిస్ విభాగాలను కూడా ప్రాక్టీస్ చేస్తే ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ మంచి మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

జనరల్ అవేర్‌నెస్

లా ఆఫీసర్, రాజ్‌భాష అధికారి పోస్ట్‌ల ప్రిలిమినరీలో ఉండే ఈ విభాగం కోసం అభ్యర్థులు మరింత ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలి. కారణం.. జనరల్ అవేర్‌నెస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు బ్యాంకింగ్ ఇండస్ట్రీ అని స్పష్టంగా పేర్కొన్నారు. ఈ విభాగంలో రాణించాలంటే.. జాతీయ ఆర్థిక రంగంలో తాజా పరిణామాలు,బ్యాంకుల విధి విధానాల్లో మార్పులు, అవి కొత్తగా ప్రకటిస్తున్న పథకాల గురించి తెలుసుకోవాలి. బ్యాంకింగ్, ఆర్థిక రంగంలో వినియోగించే పదజాలంపైనా పట్టు సాధించాలి.

ప్రొఫెషనల్ నాలెడ్జ్

మెయిన్ పరీక్షలో ఉండే ప్రొఫెషనల్ నాలెడ్జ్ విభాగంలో రాణించేందుకు అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న స్పెషలైజేషన్, దానికి సంబంధించి బ్యాచిలర్, పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యమైన కాన్సెప్ట్‌లను అప్లికేషన్ అప్రోచ్‌తో అధ్యయనం చేయాలి. ఆయా విభాగాలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలు, ఇతర పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను సాధన చేయడం కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:నవంబర్21,2022
- ప్రిలిమినరీ పరీక్ష తేదీ:డిసెంబర్ 24, 31 తేదీల్లో
- ఆన్‌లైన్ మెయిన్ ఎగ్జామ్ తేదీ:జనవరి 29, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.ibps.in

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్‌లో 144 మందికి ప్రవేశాలు



సీటు పొందిన విద్యార్థినికి గుర్తింపు కార్డును అందజేస్తున్న చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి, పక్కన గోపాలరాజు

నూజివీడు: రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఖాళీల భర్తీకి ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో సోమవారం నిర్వహించిన మూడో విడత కౌన్సెలింగ్‌లో 144 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. ట్రిపుల్ ఐటీ ఆవరణలో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌కు 263 మంది అభ్యర్థులకు గాను 144 మంది హాజరై ప్రవేశాలను పొందారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి పరిశీలించారు. మిగిలిన సీట్లు, స్పోర్ట్స్ కోటా సీట్లకు త్వరలోనే మరో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య గోపాలరాజు తెలిపారు. అడ్మిషన్లు పొందినవారు వెంటనే వారికి సీటు వచ్చిన క్యాంపస్‌కు వెళ్లాలని సూచించారు.

ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం ఎస్‌ఆర్‌లు ఉండాలి

- ప్రైవేట్ వైద్య కళాశాలలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదేశాలు



సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిధిలోని వైద్య కళాశాలల్లో నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ)–2019 నిబంధనల ప్రకారం సీనియర్ రెసిడెంట్(ఎస్‌ఆర్) డాక్టర్లు ఉండాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసరావు స్పష్టంచేశారు. ఈ మేరకు అన్ని ప్రైవేట్ వైద్య కళాశాలలకు ఆయన సోమవారం ఆదేశాలు జారీచేశారు. ఎంబీబీఎస్ సీట్లు 100 ఉంటే 59 మంది ఎస్‌ఆర్‌లు, 150 సీట్లు ఉంటే 75 మంది ఎస్‌ఆర్‌లు, 200 సీట్లు ఉంటే 89 మంది ఎస్‌ఆర్‌లు, 250 సీట్లు అయితే 94 మంది సీనియర్ రెసిడెంట్ డాక్టర్‌లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.

బీఈడీ స్పాట్ అడ్మిషన్లు వాయిదా

సాక్షి, అమరావతి: బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నిర్వహించే బీఈడీ (ఎస్ఈ) కోర్సు స్పాట్ అడ్మిషన్లు, స్లైడింగ్ ప్రక్రియను వాయిదా వేసినట్టు వర్సిటీ అభ్యాసక సహాయ సేవా కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం ఈ నెల 16న స్పాట్ అడ్మిషన్లు, ప్రోగ్రాం సెంటర్ మార్పు చేసుకోవాలనుకునేవారికి స్లైడింగ్ అవకాశం ఇచ్చామని పేర్కొన్నారు. అయితే సాంకేతిక సమస్యతో ఈ ప్రక్రియను వాయిదా వేశామని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో 11 ప్రోగ్రాం సెంటర్ల ద్వారా మూడు (ఎంఆర్, హెచ్ఐ, వీఐ) స్పెషలైజేషన్లలో 500 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. త్వరలోనే స్లైడింగ్, అడ్మిషన్ల తేదీ ప్రకటిస్తామని, వివరాలకు అభ్యర్థులు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

అంతరిక్ష రంగంలో తెలుగు తేజం



- ప్రైవేట్ రాకెట్ రూపకర్తల్లో విశాఖ యువకుడు నాగభరత్
- దేశ చరిత్రలో తొలిసారిగా రాకెట్ ప్రయోగించనున్న స్కైరూట్ సంస్థ
- భారత అంతరిక్ష రంగంలో కొత్త శకానికి నాంది
- ఈ నెలలోనే నింగిలోకి దూసుకెళ్లనున్న 'విక్రమ్-ఎస్'



నాగభరత్

భారత అంతరిక్ష రంగంలో నవశకం ఆరంభం కాబోతోంది. దేశ చరిత్రలో తొలిసారిగా నింగిలోకి దూసుకెళ్లేందుకు ఓ ప్రైవేట్ రాకెట్ సిద్ధమవుతోంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు శాస్త్రవేత్తలు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైతే.. భవిష్యత్‌లో అంతరిక్ష యానం మరింత సులభతరం కానుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ నెలలోనే శ్రీహరికోట నుంచి మూడు పేలోడ్‌లతో కూడిన ఈ ప్రైవేట్ రాకెట్ రోదసి బాట పట్టనుంది.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సహకారంతో స్కైరూట్ ఏరో స్పేస్ స్టార్టప్ సంస్థ తయారు చేసిన రాకెట్ ఈ నెల 16 లేదా 18న రోదసిలోకి దూసుకుపోనుంది. రాకెట్ రూపకర్తల్లో విశాఖకు చెందిన నాగభరత్ దాకా (33) ఒకరు కాగా.. మరొకరు హైదరాబాద్‌కు చెందిన చందన్ పవన్‌కుమార్. వీరిద్దరూ స్కైరూట్ ఏరో స్పేస్ పేరిట స్టార్టప్ సంస్థను ప్రారంభించారు. వ్యవస్థాపకులలో ఒకరిగా.. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో)గా వ్యవహరిస్తున్న నాగభరత్ విశాఖలోనే విద్యను అభ్యసించి అంచెలంచెలుగా ఎదిగారు. ఆయన ఆధ్వర్యంలో రూపొందించిన విక్రమ్-ఎస్ అంతరిక్ష ప్రయాణానికి సిద్ధమవుతూ చరిత్ర సృష్టించబోతోంది.

భీమిలిలో బీజం



విశాఖ శివారు భీమిలిలోని అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (అనిట్స్) ఫౌండర్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన డాక్టర్ రఘురామిరెడ్డి కుమారుడు నాగభరత్. 1999 నుంచి 2001 వరకూ రుషి వ్యాలీ స్కూల్‌లో విద్యనభ్యసించిన ఆయన 2001 నుంచి 2005 వరకు నగరంలోని లిటిల్ ఏంజల్స్ హైస్కూల్‌లో ఉన్నత విద్య పూర్తి చేశారు. అనంతరం ఐఐటీ మద్రాస్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని 2012 అక్టోబర్ నుంచి 2015 మే వరకూ విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో ఇంజనీర్ (ఎస్‌సీ)గా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత ఉద్యోగానికి స్వస్తి చెప్పి 2018 ఆగస్టులో తోటి శాస్త్రవేత్త పవన్‌కుమార్ చందనతో కలిసి స్కైరూట్ ఏరో స్పేస్ అనే స్టార్టప్ సంస్థను హైదరాబాద్ కేంద్రంగా ప్రారంభించారు. చిన్న చిన్న రాకెట్స్ మోడల్స్‌ను తయారు చేస్తూ వాటిపై పరిశోధనలు వేగవంతం చేశారు.

రెండేళ్ల నుంచి పరిశోధనలు



ఇప్పటివరకు అంతరిక్షంలోకి రాకెట్లను పంపించేందుకు ఇస్రోకు మాత్రమే అనుమతులు ఉండేవి. అయితే, రెండేళ్ల క్రితం అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల కూడా అడుగు పెట్టేందుకు ఇస్రో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అప్పటి నుంచి నాగభరత్, పవన్‌కుమార్ కలిసి దేశ అంతరిక్షంలోకి అడుగుపెట్టే మొదటి ప్రైవేట్ రాకెట్ తమదే కావాలన్న లక్ష్యంతో పరిశోధనలు ప్రారంభించారు. అనేక సంస్థల నుంచి పోటీ ఎదురైనా.. వాణిజ్య అవసరాలు తీర్చేలా స్నేహితులిద్దరూ ముందుగా రాకెట్ తయారు చేసి రికార్డు సృష్టించారు. భారత అంతరిక్ష పరిశోధనా వ్యవస్థకు ఆద్యుడైన విక్రమ్ అంబాలాల్ సారాభాయ్‌కు నివాళిగా తొలి ప్రైవేట్ రాకెట్‌కు విక్రమ్-ఎస్ (శరభి) అని నామకరణం చేశారు. తొలుత ఈ ప్రైవేట్ రాకెట్‌ను ఈ నెల 15న ప్రారంభించాలని భావించగా.. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈ నెల 16 లేదా 18వ తేదీన ప్రయోగించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ లాంచ్ ప్యాడ్ నుంచి ఈ రాకెట్ ప్రయోగం చేయనున్నారు. ప్రస్తుతం చేపట్టబోయే ప్రయోగం డెమాన్‌స్ట్రేషన్ మాత్రమే. ఇందులో మూడు శాటిలైట్లను పంపిస్తున్నారు. తొలి ప్రైవేట్ రాకెట్ కావడంతో ఈ ఆపరేషన్‌కు 'ప్రారంభ్ మిషన్' గా నామకరణం చేశారు. విక్రమ్ పేరుతో మూడు రకాల రాకెట్లను తయారు చేస్తున్నారు.

రాకెట్ల ధరలు తగ్గే చాన్స్!

కొన్నేళ్లుగా భారత అంతరిక్ష రంగంపై ఇస్రో ఏకఛత్రాధిపత్యం కొనసాగుతోంది. కానీ, దాని బడ్జెట్ పరిమితులతో అనుకున్నంత వేగంగా పరిశోధనలు జరగడంలేదన్నది వాస్తవం. ఈ కారణంగా స్పేస్ రంగంలో ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు ద్వారాలు తెరిచింది. ఇస్రో, బీహెచ్ఈఎల్ సహకారంలో పీఎస్ఎల్‌వీ రాకెట్ తయారీకి వివిధ సంస్థలతో కలిసి కన్సార్షియం ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇది విజయవంతమైతే భవిష్యత్‌లో రాకెట్ల ఖర్చు మరింత తగ్గుముఖం పట్టే సూచనలున్నాయి. స్పేస్ రంగంలోకి ప్రైవేట్ సంస్థల రాకతో భవిష్యత్‌లో ఉపగ్రహాల వినియోగం భారీగా పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వివిధ సంస్థలు సొంతంగా ఉపగ్రహాలు ప్రయోగించి పారిశ్రామిక సర్వేలు, వ్యవసాయం, రహదారులు, కమ్యూనికేషన్లు, వాతావరణం అంచనా వేయడం, నీరు-ఇంధనం గుర్తింపు వంటి విభిన్న అవసరాలకు వినియోగించేందుకు వెసులుబాటు ఉంటుంది. అందుకే.. స్పేస్ స్టార్టప్‌ల సంఖ్య కూడా దేశంలో క్రమంగా పెరుగుతూ వస్తోంది. భారత్‌లో ఇప్పటివరకూ 50కి పైగా స్పేస్ స్టార్టప్‌లు ఇస్రో వద్ద రిజిస్టర్ కావడం విశేషం. ఇందులో ఎక్కువగా రాకెట్స్ తయారీ, శాటిలైట్స్ నిర్మించే కావడం కొసమెరుపు.

తిరుపతిలో ప్రతిష్టాత్మక ఎన్ఐఈఎల్ఐటీ

తిరుపతి అలిపిరి: ఢిల్లీ కేంద్రంగా ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఎన్ఐఈఎల్ఐటీ) విద్యా సంస్థ.. ఇప్పుడు తిరుపతిలో ఏర్పాటు కానుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో దక్షిణ భారతదేశంలోని కేరళలోని కాలికట్, తమిళనాడులోని చెన్నైలో ఉన్న ఈ విద్యా సంస్థ.. తాజాగా తిరుపతికి రానుంది. ఇందులో భాగంగా సోమవారం తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎన్ఐఈఎల్ఐటీ కమిటీ చైర్మన్ కమ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణమూర్తి, అడిషనల్ డైరెక్టర్ రజనీష్‌కుమార్ అస్థాన కలిసి స్థల పరిశీలన చేశారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలోని నేచురల్ సైన్స్-2 భవనంతో పాటు, శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ, ఐఐడీటీ భవనాలను పరిశీలించారు. కమిటీ చైర్మన్ మాట్లాడుతూ తమ నివేదికను ఎన్ఐఈఎల్ఐటీ చైర్మన్‌కి అందిస్తామని తెలిపారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీ రంగంలో వృత్తి విద్య కోర్సులతో పాటు ఉద్యోగావకాశాల కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లకుండా తగిన విశ్వవిద్యాలయ నైపుణ్యం ఈ సంస్థ ద్వారా లభిస్తుందని చెప్పారు. తైవాన్, జపాన్, చైనా, కొరియా వంటి దేశాలతో ఈ సంస్థ ఒప్పందం కలిగి ఉండటంతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు అర్హతను బట్టి విదేశాల్లోనూ ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎపెడ సీఈవో కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్వీ యూనివర్సిటీ వీసీ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మౌంట్ కోజిస్కో'ని అధిరోహించిన ఉమేష్ ఆచంట

ఆస్ట్రేలియా ఖండంలోనే అతి పెద్ద పర్వతంగా గుర్తింపు



సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరానికి చెందిన టెన్నిస్ క్రీడాకారుడు, పర్వతారోహకుడు ఉమేష్ ఆచంట మరో ఘనకీర్తిని సాధించారు. ఆస్ట్రేలియా ఖండంలోనే అతి పెద్ద పర్వతం మౌంట్ కోజిస్కో పర్వతాన్ని అధిరోహించారు. ఈ నెల 5వ తేదీన మనదేశం నుంచి ఆస్ట్రేలియాకు వెళ్లిన ఉమేష్ 12వ తేదీన మౌంట్ కోజిస్కో పర్వతాన్ని అధిరోహించాడు. ఈ పర్వతం ఎత్తు 2,228 మీటర్లు. ప్రస్తుతం ఈ పర్వతం పూర్తిగా మంచుతో నిండి ఉండటంతో పర్వతారోహణను పూర్తిగా ఆపేశారు. అయితే గతంలో రెండు పర్వతాలు ఎక్కిన అనుభవం ఉందని, ప్రత్యేక అనుమతి తీసుకుని ఉమేష్ పర్వతారోహణ పూర్తి చేశారు. ఉమేష్ ఆచంట మార్చి 2021లో మౌంట్ కిలిమాంజరో (ఆఫ్రికా ఖండంలో అతిపెద్ద పర్వతం), ఆగస్టు 2021లో మౌంట్ ఎలబస్ (యూరప్ ఖండంలో అతి పెద్ద పర్వతం) అధిరోహించాడు.

రామోజీ.. ఇవేమి నీచపు రాతలు?

వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (సెంట్రల్): కొద్దిరోజులుగా వ్యవసాయ రంగానికి సంబంధించి ఈనాడు రామోజీ నిస్సిగ్గుగా అసత్యవార్తలు రాస్తూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో ఎక్కడా లేనివిధంగా బీమా మొత్తం రైతులకు ఉచితంగా అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని చెప్పారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లలో రైతులకు బీమా కింద రూ.3,411 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. రైతులకు రూ.716 కోట్లు ఎగ్గొట్టారని చెప్పారు. ఇవన్నీ రామోజీకి అప్పుడు కనిపించలేదా... అని ప్రశ్నించారు. గతంలో రైతులకు ఎందుకు బీమా ఇవ్వలేదు, రైతుల చేత నగదు ఎందుకు కట్టించుకున్నారు.. అనే విషయాలను ఈనాడులో ఎందుకు రాయలేదని నిలదీశారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్ ఈ మూడేళ్లలో రైతులకు రూ.6,684 కోట్లు ఇచ్చారని చెప్పారు. ఇవన్నీ చెప్పకుండా ఈనాడు రామోజీ, పచ్చపత్రికలు, చంద్రబాబు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఉచిత బీమాలో దేశానికే ఆదర్శం

గతంలో పంటల బీమాకు రైతు 25 శాతం చెల్లిస్తే మిగిలిన నగదును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లించేవని గుర్తుచేశారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత రైతులు రూపాయి ఇస్తే చాలు ప్రీమియం మొత్తం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేలా చేశారన్నారు. రెండో ఏడాది నుంచి ఉచితంగా పంటల బీమాను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్న ఈ విధానాన్ని మిగిలిన రాష్ట్రాలు కూడా అమలుచేశాయని గుర్తుచేశారు. బీమా విషయంలో దేశానికే ఏపీ రోల్ మోడల్‌గా నిలవడంతో, కేంద్రమే దిగి వచ్చి దేశవ్యాప్తంగా ఒకేలా అమలుచేయాలని సూచించిందని చెప్పారు. అందులో భాగంగానే ఏపీలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన భాగస్వామి అయిందని రామోజీ గుర్తుపెట్టుకోవాలని సూచించారు.

అదనంగా 14 లక్షల టన్నుల ధాన్యం

చంద్రబాబు హయాంలో వందల కొద్దీ కరువు మండలాలు ప్రకటించారని, కాని ప్రస్తుత ప్రభుత్వంలో ఎక్కడా కరువు అనే మాట లేదని చెప్పారు. దీన్ని మాత్రం పచ్చపత్రికలు పట్టించుకోవా... అని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వంలో కనీసం ధాన్యం ఎంత సేకరించారో చెప్పలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఏటా సగటున అదనంగా 14 లక్షల టన్నుల ధాన్యం వస్తోందన్న విషయాన్ని రామోజీ తెలుసుకోవాలని కాకాణి అన్నారు.

రాహుకేతువుల్లాగా బాబు, పవన్

చంద్రబాబు, పవన్ ఆంధ్రప్రదేశ్‌కు రాహుకేతువుల్లాగా తయారయ్యారని మంత్రి మండిపడ్డారు. రైతుల కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అన్ని విధాలుగా అండగా ఉంటున్నారని చెప్పారు. కానీ చంద్రబాబు, పవన్, పచ్చ పత్రికలు మాత్రం రైతులను రెచ్చగొట్టే విధంగా చేయడం సరికాదని పేర్కొన్నారు. 52 లక్షల మంది రైతుల ఖాతాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుభరోసా నగదు వేస్తే ఉత్తుత్తి బటన్ నొక్కుతున్నారంటూ సిగ్గులేకుండా ఈనాడులో వార్తలు రాశారని చెప్పారు. 98 శాతం మంది ఖాతాల్లో నగదు పడి, సాంకేతిక కారణాలతో ఒకశాతమో, అరశాతమో నగదు పడకపోతే దాన్ని కూడా రామోజీ దిగజారి రాస్తున్నారని మండిపడ్డారు. స్వార్థ ప్రయోజనాలతో చంద్రబాబును గద్దెనెక్కించాలనే దురుద్దేశంతో అసత్య కథనాలు రాయడం సరికాదని చెప్పారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రామోజీ, చంద్రబాబు, పవన్ ఎన్ని కుయుక్తులు చేసినా ప్రజలు వారిని నమ్మరని చెప్పారు. రానున్న రోజుల్లో మరింతగా వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు తమ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి సీవిజిల్ విన్యాసాలు

- దేశవ్యాప్తంగా నేవీ, కోస్ట్‌గార్డ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- ముంబై దాడుల తర్వాత నుంచి ఏటా నిర్వహణ



సాక్షి, విశాఖపట్నం: భారత తీర రక్షణ వ్యవస్థకే సవాల్ విసిరిన 26/11 దాడుల తర్వాత ఆయా రక్షణ విభాగాలు ఉక్రోషంతో ఊగిపోయాయి. మరోసారి 26/11 తరహా దాడి ఘటన దేశంలో జరగకూడదంటూ ప్రతినబూనాయి. తీర రక్షణ వ్యవస్థను పటిష్టం చేసి తీవ్రవాదులకు సవాల్ విసిరాయి. యావత్ ప్రపంచానికి తమ రక్షణ శక్తిని చాటిచెప్పేందుకు ఏటా రెండు రోజులపాటు భారత నౌకాదళం, తీరగస్తీ దళం, మెరైన్ పోలీస్ వ్యవస్థ సమర సన్నద్ధ ప్రదర్శన నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా దేశమంతటా విస్తరించి ఉన్న తీర ప్రాంతంలో మంగళవారం, బుధవారం భారత నౌకాదళం నేతృత్వంలో సీవిజిల్–2022 (సముద్ర జాగరణ) పేరుతో మూడో ఎడిషన్ యుద్ధ విన్యాసాలు నిర్వహిస్తోంది.ఏపీ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పుదుచ్చేరి సహా 13 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 7,516.6 కిలోమీటర్ల పొడవునా సమర సన్నద్ధ ప్రదర్శనలకు ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. రక్షణ మంత్రిత్వ శాఖతో పాటు హోం, షిప్పింగ్, పెట్రోలియం, సహజ వాయువులు, కస్టమ్స్, మత్స్యశాఖ, పశు సంవర్థక శాఖతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు ఈ విన్యాసాలకు సహకారం అందిస్తున్నాయి. ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్, మెరైన్ పోలీసు బృందాలు ద్వీపాల్లోనూ, సముద్ర ప్రాంతాలు, మత్స్యకారుల బోట్లు ఒడ్డుకు చేరే ప్రాంతాల్లోనూ నిర్వహించనున్నారు.

40 నౌకలు.. 85 పెట్రోలింగ్ బోట్లు

నేవీ, కోస్ట్‌గార్డ్‌కు చెందిన 40 నౌకలతోపాటు 85 పెట్రోలింగ్ బోట్లు ఈ విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. విశాఖ సహా ప్రతి తీరానికి ఐదు మైళ్ల దూరం వరకూ నిఘా వ్యవస్థను పటిష్టం చేసి మాక్ డ్రిల్‌ని తొలి రోజున నిర్వహిస్తారు. విశాఖపట్నం పోర్టు సమీపంలోనూ, పారాదీప్ కేజీ బేసిన్ వద్ద మత్స్యకారుల రూపంలో ఉగ్రవాదులు చొరబడేందుకు ప్రయత్నించడం.. వారిని రక్షణ బలగాలు గుర్తించి అదుపులోకి తీసుకోవడం మొదలైన విన్యాసాలు జరగనున్నాయి. ప్రతి రాష్ట్రంలోనూ ఆయా రక్షణ వ్యవస్థలు తమ పరిధిలో ఎప్పటికప్పుడు వివిధ స్నేహపూర్వక దేశాలతో కలిసి యుద్ధ విన్యాసాలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నప్పటికీ, దేశ రక్షణ వ్యవస్థ ఎంతమేర బలోపేతమైందన్న అంశం ప్రపంచానికి తెలియజెప్పేందుకే ఈ దేశవ్యాప్త సమర సన్నద్ధ ప్రదర్శన చేపడుతున్నట్లు రక్షణ విభాగాధికారులు స్పష్టం చేస్తున్నారు.

1,458 'సీనియర్ రెసిడెంట్'ల నియామకానికి నోటిఫికేషన్

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం 46 వేల పోస్టులను భర్తీ చేపట్టింది.

రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదివిన వారికే..

ఎస్ఆర్ పోస్టుల నియామకంలో తమకు అవకాశం కల్పించాలని కొందరు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో పీజీ చేసిన వైద్యులు సంప్రదిస్తున్నారు. అయితే నేషన్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) అడ్మిషన్ నిబంధనల మేరకు కళాశాలల్లోని ప్రతి విభాగంలో ఎస్ఆర్ పోస్టులను భర్తీ చేస్తున్నాం. ఈ క్రమంలో కేవలం రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో చదివిన వారికే అవకాశం కల్పిస్తున్నాం. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో చదివిన వారు తాము చదివిన కళాశాలల్లో ఎస్ఆర్‌లుగా పనిచేసేందుకు ఆయా కళాశాలల యాజమాన్యాలను సంప్రదించాలి. – డాక్టర్ వినోద్‌కుమార్, డీఎంఈ

18 తర్వాత రాష్ట్రంలో వర్షాలు

- రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

సాక్షి, విశాఖపట్నం: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కొద్దిరోజులుగా దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలు దంచి కొడుతున్నాయి. కొన్నిచోట్ల కుంభవృష్టి, మరికొన్ని చోట్ల విస్తారంగా వానలు కురుస్తున్నాయి. ప్రస్తుతం ఈ అల్పపీడనం అరేబియా సముద్రంలో విలీనమైంది. ఉపరితల ఆవర్తనంగానీ, ద్రోణులుగానీ లేకపోవడంతో వర్షాలు తగ్గుముఖం పట్టనున్నాయి. ఈ నేపథ్యంలో రేపు (బుధవారం) ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో ఈనెల 18 తర్వాత నుంచి రాష్ట్రంలో మళ్లీ వర్షాలు కురవడానికి ఆస్కారం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మంగళవారం దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకటిరెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సోమవారం రాత్రి నివేదికలో తెలిపింది. బుధవారం నుంచి మూడురోజుల పాటు రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతుందని పేర్కొంది. సోమవారం వైఎస్సార్, ఎస్పీఎస్సార్ నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిశాయి. రాష్ట్రంలో అత్యధికంగా వైఎస్సార్ జిల్లా బి.కోడూరు మండలం పాయలకుంట్లలో 6.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కలల జోన్‌కు సొంతగూడు

త్వరలోనే రైల్వే జోన్ భవన పనులకు టెండర్లు

- రూ.106 కోట్లతో హెడ్ క్వార్టర్స్ నిర్మాణం
- వందేళ్లు పటిష్టంగా ఉండేలా చారిత్రక నిర్మాణాలు
- 36 నెలల్లో భవన నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రణాళికలు
- రైల్వే బోర్డు ఆదేశిస్తే.. తాత్కాలిక కార్యకలాపాలూ ప్రారంభించే అవకాశం
- జోనల్ మేనేజర్ తాత్కాలిక కార్యాలయంగా డీఆర్ఎం ఆఫీస్



సౌత్‌కోస్ట్‌రైల్వే జోన్ హెడ్ క్వార్టర్స్ భవన నమూనాలు

సాక్షి, విశాఖపట్నం : కలల జోన్ పనులు ప్రారంభమయ్యేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయ పనులకు త్వరలో టెండర్లు పిలిచేందుకు రైల్వే బోర్డు సన్నద్ధమవుతోంది. ప్రస్తుత డీఆర్ఎం కార్యాలయానికి, రైల్వే స్టేషన్ మధ్యలో ఉన్న వైర్‌లెస్ కాలనీలో రూ.106 కోట్ల వ్యయంతో ప్రధాన కార్యాలయం నిర్మించనున్నారు. వందేళ్లు పటిష్టంగా ఉండేలా చారిత్రక నిర్మాణంగా ఈ కార్యాలయం రూపుదిద్దుకోనుంది. ఇప్పటికే తయారు చేసిన డిజైన్లకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. పనులు ప్రారంభించిన 36 నెలల్లో భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావిస్తోంది. ఈలోగా జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని బోర్డు నిర్ణయిస్తే.. డీఆర్ఎం కార్యాలయం నుంచి తాత్కాలికంగా జోనల్ మేనేజర్ బాధ్యతలు నిర్వర్తించేలా కూడా సన్నాహాలు చేస్తున్నారు.

టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు

రైల్వే జోన్ హెడ్‌క్వార్టర్స్ భవన నిర్మాణానికి ఈ నెలాఖరులోగా వర్చువల్‌గా ప్రధాని మోదీ చేతుల మీదుగానే శంకుస్థాపన నిర్వహించే అవకాశం ఉందని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. శంకుస్థాపన జరిగిన వెంటనే టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వైర్‌లెస్ కాలనీలో ఉన్న 13 ఎకరాల్లో 8 ఎకరాల విస్తీర్ణంలో హెడ్‌క్వార్టర్స్ రానుంది. రూ.106 కోట్ల వ్యయంతో జోన్ ప్రధాన కార్యాలయానికి టెండర్లు పిలవనున్నారు. మొత్తం ఏడు ఫ్లోర్లలో హెడ్‌క్వార్టర్స్ బిల్డింగ్ ఉండనుంది. ప్రతి భవనానికి 2 యాక్సెస్ పాయింట్స్, రెండు ఎమర్జెన్సీ ఎగ్జిట్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో బీటీరోడ్స్ కోసం రూ.2.64 కోట్లు, సీసీ రోడ్లకు రూ.1.66 కోట్లు, ఫుట్‌పాత్ ఏరియాకు రూ.32 లక్షలు, పార్కింగ్ పావ్డ్ ఏరియా కోసం రూ.1.08 కోట్లు, ప్లాంటేషన్‌కు రూ.2.16కోట్లు, బిల్ట్‌అప్ ఏరియాకు రూ.71.64 కోట్లు, బేస్‌మెంట్, స్టిల్ట్‌లో పార్కింగ్ కోసం రూ.21 కోట్లు ఖర్చు చేయనున్నారు. టెండర్లు ఖరారు చేసిన తర్వాత అగ్రిమెంట్ జరిపి.. 36 నెలల్లో భవనాన్ని పూర్తి చేయాలని రైల్వే అధికారులు భావిస్తున్నారు.

ప్రపంచ స్థాయి భవనం

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హెడ్ క్వార్టర్స్ నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ మొదలు పెడుతున్నాం. వైర్‌లెస్ కాలనీలో అత్యద్భుతంగా ప్రపంచస్థాయి భవనాన్ని నిర్మించనున్నాం. వందేళ్లు పటిష్టంగా ఉండేలా చారిత్రక కట్టడంగా హెడ్‌క్వార్టర్స్ ఉండాలని రైల్వే మంత్రి సూచించారు. పాత వైర్‌లెస్ కాలనీలోని 13 ఎకరాల్లో భూమిని జోన్ కోసం సమీకరించాం. ఇందులో తొలి దశలో 8 ఎకరాల్లో మల్టీ స్టోరీడ్ బిల్డింగ్స్ రానున్నాయి. కచ్చితంగా విశాఖ కేంద్రంగా రాబోతున్న సౌత్ కోస్టల్ రైల్వే జోన్ బిల్డింగ్ ప్రపంచ స్థాయి భవనంగా రూపుదిద్దుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.
– అనూప్‌కుమార్ సత్పతి, వాల్తేరు డీఆర్ఎం

తాత్కాలిక సేవలు మొదలయ్యేనా.?

2019 ఫిబ్రవరి 28న కేబినెట్ ఆమోద ముద్రవేస్తూ విశాఖ కేంద్రంగా కొత్త జోన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. తాజా పరిణామాలతో దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను సమర్థంగా ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త భవన నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రెండేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది. ఈలోగా జోన్ కార్యకలాపాలు కూడా ప్రారంభించాలనే ఆదేశాలు కూడా ఇవ్వాలా వద్దా అనే ఆలోచనలో రైల్వే బోర్డు ఉంది. ఒకవేళ బిల్డింగ్ నిర్మాణంతో పనిలేకుండా జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే తాత్కాలిక కార్యాలయంగా ప్రస్తుతం ఉన్న వాల్తేరు డీఆర్ఎం కార్యాలయాన్ని వినియోగించాలని భావిస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే సౌత్ కోస్ట్ జోన్ ఓఎస్‌డీ, తను సమర్పించిన జోన్ డీపీఆర్‌లోనూ పొందుపరిచారు. జోనల్ కార్యాలయానికి సరిపడా నిర్మాణాలు ఉండటంతో జీఎం కార్యాలయాన్ని ఇక్కడ నుంచి మొదలు పెట్టే అవకాశాలున్నాయి.

శభాష్.. సత్పతి

ఇటీవల విశాఖపట్నంలో పర్యటించిన రైలేమంత్రి అశ్వినీ వైష్ణవ్, రైల్వే బోర్డు చైర్మన్ త్రిపాఠీ.. వాల్తేరు స్టేషన్ పరిసరాలను చూసి ఆశ్చర్యపోయారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ అతి సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఎక్కడా లేని విధంగా అతి తక్కువ సమయంలోనే వాల్తేరు డివిజన్ నుంచి అత్యధికంగా ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు తిరిగేలా శ్రమించిన డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతిని అభినందించారు. వినూత్న విధానాలతో డివిజన్‌ను లాభాల బాటలో తీసుకెళ్తున్నారంటూ ప్రశంసించారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే ప్రతి ఫిర్యాదుని, సలహాలను స్వీకరించి దానికనుగుణంగా వ్యవహరించడం నిజంగా అరుదని కితాబిచ్చారు. జోన్ హెడ్ క్వార్టర్స్, విశాఖపట్నం రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు విషయంలోనూ ఇదే తరహాలో పర్యవేక్షించి అద్భుత ఫలితాలు తీసుకురావాలని డీఆర్ఎంకు రైల్వే మంత్రి స్వయంగా బాధ్యతలు అప్పగించడం విశేషం.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.